


ESTD: 1999

www.voodayam.com

# వుదయం




ఆదిలాబాద్ | 05-10-2026 సోమవారం | సంపుటి : 14 | సంచిక :26 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal | Follow us on

## భారత్‌కు రష్యా ఎప్పటికీ నమ్మకమైన మిత్రదేశమే...

### విదేశాంగ మంత్రి జై శంకర్ స్పష్టం



న్యూఢిల్లీ:క్లిష్ట సమయాల్లో భారతదేశానికి రష్యా ఎన్నో సందర్భాల్లో అండగా నిలిచిందని, ఆ చారిత్రక అనుబంధాన్ని దేశ ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరని భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జై శంకర్ ఉద్ఘాటించారు. నగరంలో నిర్వహించిన 62వ మ్యూనిక్ భద్రతా సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. 1950వ దశకంలో ప్రపంచంలోని అనేక శక్తివంతమైన దేశాలు పాకిస్థాన్‌కు కొమ్ముకాసినప్పటికీ, నాటి సోవియట్ రష్యా మాత్రం నిలకడగా భారతదేశం వెంటే నిలబడిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు.మాస్కోతో మైత్రిపై స్పష్టత:1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధ సమయంలో కూడా మాస్కో భారతదేశానికి ఎంతో సహాయపడిందని, అదే సమయంలో అమెరికా పాకిస్థాన్‌కు మద్దతుగా నిలిచిన విషయాన్ని జై శంకర్ ప్రస్తావించారు.

## భారతీయ ఔషధ కర్మాగారంపై రష్యా డ్రోన్ దాడి

### రూ. 400 కోట్ల నష్టం

కీవ్ / సుమీ: ఉక్రెయిన్ భూభాగంలోని సుమీ నగరంలో ఉన్న ప్రముఖ భారతీయ ఔషధ తయారీ సంస్థపై రష్యా సైన్యం డ్రోన్ దాడులకు తెగబడింది. 'కుసుమ్' అనే భారతీయ ఔషధ కర్మాగారంపై డ్రోన్లు విరుచుకుపడటంతో ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగాయి. ఈ విషాదకర సంఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు.

## సినిమా శిఖరం నేలకొరిగింది

### ప్రయోగాల సృష్టికర్త సింగీతానికి కన్నీటి వీడ్కోలు

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం

### అశ్రునయనాల నడుమ తుది వీడ్కోలు



చెన్నై, అక్టోబర్ 4 (ఎఎంస్) : భారతీయ చలనచిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకున్న లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు ఇకలేరు. గత కొంతకాలంగా వయోభారంతో, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, చెన్నైలోని కావేరీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అక్టోబర్ 3 రాత్రి 94 ఏళ్ల వయస్సులో తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికకాయానికి కుటుంబ సభ్యులు చెన్నైలోని నేసపాక్కం శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి చేసి తుది వీడ్కోలు పలికారు.

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సంతాపం**

వైవిధ్యభరితమైన కథాంశాలతో సినీ ప్రేక్షకులను అలరించిన ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు మరణం పట్ల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలుగు చిత్రపరిశ్రమకే కాకుండా, మొత్తం భారతీయ చలనచిత్ర రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. నూతన ఆలోచనలను, ప్రయోగాత్మక కథాంశాలను వెండితెరపై ఆవిష్కరిస్తూ తెలుగు సినిమాకు కొత్త బాటలు పరిచిన గొప్ప సృజనాత్మక దర్శకుడు సింగీతం అని సీ ఎం స్మరించుకున్నారు. కేవలం దర్శకుడిగానే కాకుండా రచయితగా, ఆలోచనాపరుడిగా, సినిమా రంగానికి ఆయన అందించిన సేవలు చిర స్మరణీయమని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు ముఖ్యమంత్రి గారు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**అశ్రునయనాల నడుమ తుది వీడ్కోలు:**

అంత్యక్రియలకు ముందు ప్రజల, సినీ ప్రముఖుల సందర్శనార్థం ఆయన పార్థివదేహాన్ని చెన్నై విరుగంబాక్కంలోని స్వగృహంలో ఉంచారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, అభిమానులు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఆరు దశాబ్దాలకు పైగా సాగిన తన సుదీర్ఘ సినీ ప్రయాణంలో 'పుష్పక విమానం', 'ఆదిత్య 369', 'భైరవ ద్వీపం', 'మయూరి', 'మైఖేల్ మదన కామరాజన్' వంటి ఎన్నో అద్భుతమైన ప్రయోగాలతో ఆయన తన ముద్రను శాశ్వతంగా వేసుకున్నారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన సృష్టించిన అపురూప చిత్రాలు తరతరాల ప్రేక్షకులకు గుర్తుండిపోతాయని అభిమానులు సోషల్ మీడియా వేదికగా నివాళులర్పిస్తున్నారు.

## 2028 జూన్ నాటికి

### నల్లగొండ మెట్ట ప్రాంతాలకు 30 టీఎంసీల నీళ్లే లక్ష్యం

# శ్రీశైలం ఎడమగట్టు కాలువ నీరు





- సురక్షితంగా షియర్ జోన్ దాటిన తవ్వకాలు
- ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గంలో కీలక ముందడుగు
- జర్మనీ యంత్రాలతో పనుల్లో మరింత వేగం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష

హైదరాబాద్, అక్టోబర్ 4 (వుదయం) : శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) ప్రధాన సొరంగం నిర్మాణంలో ఎదురైన అత్యంత క్లిష్టమైన భూగర్భ సవాళ్లను దాటుకుని ప్రాజెక్టు పనుల్లో కీలక ముందడుగు వేసినట్లు రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతిపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో ఆదివారం ఆయన సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు.

గతంలో ప్రమాదం సంభవించిన ప్రాంతంలోని తీవ్ర బలహీనమైన శిలల మండలాన్ని (షియర్ జోన్) సాంకేతిక పరిజ్ఞానంతో సురక్షితం మంత్రి తెలిపారు. సొరంగం లోపల 20 కిలోమీటర్లకు పైగా లోతున పనిచేస్తున్న కార్మికులు, ఇంజనీర్ల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూనే, పనుల వేగాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు. నల్లగొండ మెట్ట ప్రాంతాలకు 30 టీఎంసీలకు పైగా తాగు, సాగునీటిని అందించి ఏళ్లనాటి నీటి ఎద్దడిని తీర్చడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. 2028 జూన్ నాటికి నీటి సరఫరా ప్రారంభించేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు.

ఐదారు నెలల్లో 700 మీటర్ల పురోగతి: గడిచిన ఐదారు నెలల కాలంలో సొరంగం తవ్వకాలు 700 మీటర్ల మేర ముందుకు సాగాయని అధికారులు మంత్రికి విశ్లేషించారు. మొత్తం 43.968 కిలోమీటర్ల పొడవైన ప్రధాన సొరంగంలో ఇప్పటికే 79 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన 9.1 కిలోమీటర్ల తవ్వకాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఈ పనులకు నేతృత్వం వహిస్తున్న భారత సైన్యానికి చెందిన సొరంగ నిర్మాణ నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా మాట్లాడుతూ.. తీవ్రమైన నేల బలహీనత, రాళ్లు విరిగిపడే ప్రమాదాల వల్ల తొలినాళ్లలో తవ్వకాల వేగాన్ని తగ్గించాల్సి వచ్చిందన్నారు. 140 మిల్లీమీటర్ల సీమ్‌లెస్ పైపులతో గొడుగు వంటి రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసి, ముందస్తు పరీక్షా డ్రిల్లింగ్ ద్వారా సురక్షితంగా ఈ షియర్ జోన్‌ను దాటినట్లు వివరించారు.

జర్మనీ యంత్రాలతో ముమ్మర పనులు:సొరంగం లోపల నుంచి తవ్విన రాళ్లు, మట్టిని వేగంగా బయటకు తరలించేందుకు జర్మనీ నుంచి ప్రత్యేక రైలు ఇంజిన్ (లోకోమోటివ్) తెప్పిస్తున్నట్లు, అది అక్టోబర్ నెలాఖరుకు అందుబాటులోకి వస్తుందని అధికారులు చెప్పారు. దీనివల్ల గతంలో 48 గంటలు పట్టే పని సమయం 10 నుంచి 12 గంటలకు తగ్గుతుందని అంచనా వేశారు. 2028 మేజూన్ నాటికి రెండు వైపుల నుంచి సాగుతున్న తవ్వకాలు పూర్తయి ప్రధాన సొరంగం అనుసంధానమవుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సమీక్షా సమావేశంలో పార్లమెంట్ సభ్యులు కె. రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, శాసనసభ్యులు మందుల సామేల్, కె. జైవీర్‌రెడ్డి, వేముల వీరేశం, అనిల్ కుమార్ రెడ్డి, శాసనమండలి సభ్యుడు శంకర్ నాయక్, నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్, ఇంజనీర్ ఇన్ చీఫ్ ఓ.వి. రమేష్‌బాబుతో పాటు సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

## కృత్రిమ మేధ రంగంలో ఆధిపత్యం



వాషింగ్టన్: కృత్రిమ మేధ రంగంలో తమ దేశ సాంకేతిక ఆధిపత్యాన్ని, భద్రతను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టుకోవడమే లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఒక కీలకమైన విభాగాన్ని ఆవిష్కరించారు. ఈ ప్రత్యేక సాంకేతిక సమన్వయ దళానికి సంబంధించిన బాధ్యతలను నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జే క్లేటన్‌తో పాటు మరికొందరు ప్రముఖులకు అప్పగించినట్లు తన సామాజిక మాధ్యమ వేదిక ద్వారా వెల్లడించారు. ఈ ప్రత్యేక విభాగం నేరుగా దేశాధ్యక్షుడితో పాటు ప్రధాన కార్యదర్శి పర్యవేక్షణలోనే పనిచేస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రయత్నాలకు కొత్త దిశ: నూతన సాంకేతిక రంగంలో అమెరికా ఎప్పటికీ అగ్రగామిగా నిలిచేలా ప్రభుత్వ విధానాలకు ఈ విభాగం సరైన మార్గదర్శకత్వం వహిస్తుందని డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. వినియోగదారులు, సాంకేతిక సంస్థలు, కీలకమైన మౌలిక వసతుల కల్పన దారులు మరియు ధార్మిక సంస్థలతో ప్రభుత్వం జరిపే చర్చలు, సంప్రదింపులను ఇది సమన్వయం చేస్తుందన్నారు. దేశ ప్రజల సార్వభౌమాధికారాన్ని, ప్రయోజనాలను కాపాడుతూ వారి జీవన ప్రమాణాలను పెంపొందించడానికే ఈ రక్షణ వ్యవస్థ దోహదపడుతుందని పేర్కొన్నారు.టెక్ దిగ్గజాలతో స్వచ్ఛంద ఒప్పందం:శ్వేతసౌధంలో ప్రముఖ సాంకేతిక కంపెనీల ప్రతినిధులతో సమావేశమైన అధ్యక్షుడు ట్రంప్, ఇటీవల ఒక చారిత్రక ఒప్పందాన్ని ఆవిష్కరించిన సంగతి తెలిసిందే.

## కాగితపు బ్యాలెట్లతోనే ఎన్నికలు నిర్వహించాలి

ముంబయి, అక్టోబర్ 4 (ఎఎంస్) : కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాకరే) పక్ష నాయకుడు ఉద్ధవ్ ఠాక్రే అత్యంత ఘాటైన విమర్శలు చేశారు. ఆయన భారతీయ జనతా పార్టీకి ఒక 'ఆయుధం'లా మారి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మహారాష్ట్రలో నిర్వహిస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధినేత రాజ్ ఠాక్రే డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రధాన కమిషనర్ వైఖరికి మరియు ఓటరు జాబితా సవరణలో జరుగుతున్న అవకతవకలకు నిరసనగా ముంబయి నగరంలో ప్రతిపక్షాలు ఉమ్మడిగా చేపట్టిన 'విరాట్ గర్జన మోర్చా' భారీ ర్యాలీ, బహిరంగ సభలో మాట్లాడే సందర్భంగా ఠాక్రే సోదరులు ఈ వ్యాఖ్యలు చేశారు.ముంబయిలో కదలిన భారీ నిరసన ర్యాలీ:ముంబయిలోని మెట్రో సినిమా ప్రాంతం నుండి ప్రారంభమైన ఈ భారీ నిరసన ర్యాలీ బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం వరకు హోరెత్తింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలాసాహెబ్ థోరట్, విజయ్ వాడెట్టివార్‌లతో పాటు నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్) నాయకులు జయంత్ పాటిల్, శశికాంత్ షిందే, జితేంద్ర అవాద్, అనిల్ దేశ్‌ముఖ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.ప్రతిపక్ష నేతల ప్రశ్నలు సవాళ్లు:ఓటరు జాబితా నుంచి బంగ్లాదేశీయులను తొలగించడానికే ఈ ప్రత్యేక సవరణ చేపడుతున్నట్లయితే, అసలు దేశంలో అక్రమంగా ఎంతమంది బంగ్లాదేశీయులు నివసిస్తున్నారో కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని ఉద్ధవ్ ఠాక్రే ప్రశ్నించారు.

## రూ. లక్ష చెల్లింపునకు తుది అవకాశం

### ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఉపశమనం , 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ గృహాల ప్రక్రియ పూర్తి

హైదరాబాద్, అక్టోబర్ 4 (వుదయం) రాజధాని హైదరాబాద్ పరిధిలోని 16 శాసనసభ నియోజకవర్గాల్లో అందుబాటు ధరల గృహ నిర్మాణ పథకం కింద ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు ప్రక్రియను తెలంగాణ గృహ నిర్మాణ మండలి విజయవంతంగా పూర్తి చేసింది. లాటరీ పద్ధతి ద్వారా ఎంపికైన అర్హులైన లబ్ధిదారులకు ఇప్పటికే తాత్కాలిక కేటాయింపు పత్రాలను అందజేసింది. ఇందులో భాగంగా లబ్ధిదారులు చెల్లించాల్సిన రూ. 1,00,000 ప్రాథమిక మొత్తాన్ని జమ చేసేందుకు తెలంగాణ గృహ నిర్మాణ మండలి మరో అవకాశం కల్పిస్తూ అక్టోబర్ 9, శుక్రవారం వరకు తుది గడువును పొడిగించింది. నిర్ణీత గడువులోగా సొమ్ము చెల్లించని వారి తాత్కాలిక కేటాయింపులను రద్దు చేస్తామని స్పష్టం చేసింది.అర్హుల ఎంపిక క్షేత్రస్థాయి పరిశీలన:లాటరీ ద్వారా ఎంపికైన దరఖాస్తుదారులకు సంబంధించి నివాస అర్హత, వార్షిక ఆదాయ పరిమితి, స్వంత ఇల్లు లేదా స్థలం ఉందో లేదో తనిఖీ చేయడంతో పాటు ఒకే కుటుంబం నుంచి బహుళ దరఖాస్తులు రాకుండా సమగ్రంగా పరిశీలించారు. ఈ క్షేత్రస్థాయి తనిఖీల్లో సరైన పత్రాలు సమర్పించి, అర్హత సాధించిన వారికి మాత్రమే తాత్కాలిక కేటాయింపులు జారీ చేశారు. అయితే, ఆయా నియోజకవర్గాలకు చెందకుండా ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వారి దరఖాస్తులతో పాటు, అధిక ఆదాయం ఉన్నవారివి, సమగ్ర సమాచారం లేని దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు.విశేష స్పందన రూ. లక్ష చెల్లింపులు:ప్రభుత్వం కేటాయింపు పత్రాలు అందజేసిన కొద్దిరోజుల్లోనే లబ్ధిదారుల నుంచి విశేష స్పందన లభించింది. అక్టోబర్ 4 నాటికి వ్యాపించి ఉన్న సమాచారం ప్రకారం.. మొత్తం 5,501 మందికి తాత్కాలిక కేటాయింపు పత్రాలు అందజేయగా, వారిలో 3,271 మంది లబ్ధిదారులు ఇప్పటికే తమ వంతు రూ. 1,00,000 చెల్లింపులను పూర్తి చేశారు. అంటే దాదాపు 59.46 శాతం మంది నిర్ణీత సొమ్మును చెల్లించారు. పలు నియోజకవర్గాల్లో ఈ చెల్లింపుల శాతం 60 నుండి 70 శాతానికి పైగా నమోదు కావడం గమనార్హం.

## రాష్ట్రంలో కరవు పరిస్థితులపై సర్కార్ నిర్లక్ష్యం



హైదరాబాద్, అక్టోబర్ 4 (వుదయం) తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరవు పరిస్థితులను చూస్తుంటే ఎంతో వేదన కలుగుతోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరుణయాగం నిర్వహించి, ఆ తర్వాత చేతులెత్తేశారని ఘాటుగా విమర్శించారు. రాష్ట్రంలో పంటలు ఎండిపోయి రైతులు అల్లాడుతున్నా, ప్రభుత్వం ఇప్పటివరకు కరవు మండలాలను ప్రకటించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే కరవు మండలాలను గుర్తిస్తేనే కేంద్ర ప్రభుత్వం నుంచి రైతులకు తగిన ఆర్థిక సహాయం అందుతుందని సూచించారు.

**జలాలు పక్క రాష్ట్రానికి తరలింపు:**

మన పాలమూరు ప్రాంతానికి నీళ్లు రాని దుస్థితి నెలకొంటే, కృష్ణా జలాలను మాత్రం కుప్పం వరకు తరలించుకుపోయేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు నీళ్లను బహుమతిగా ఇస్తున్నారని కవిత విమర్శించారు. రాజధాని హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు పట్టణాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి వేధిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

**విద్యుత్ కోతలను నిరూపిస్తా:**

వ్యవసాయ రంగానికి రోజుకు ఆరు లేదా ఏడు గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదని కవిత ఆరోపించారు. రాష్ట్రంలో కరెంటు కోతలు లేవని చెప్తున్న ప్రభుత్వం ఉచిత విద్యుత్ సరఫరాలో పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కరెంటు కోతలను నిరూపించడానికి తానే స్వయంగా ముఖ్యమంత్రి సొంత ఊరైన కొండారెడ్డిపల్లికి రావడానికి సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. ఏది ఏమైనా రైతాంగానికి సాగునీటితో పాటు పూర్తిస్థాయి విద్యుత్‌ను ప్రభుత్వం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు.

## మహిళా జర్నలిస్టుల పట్ల అనుచిత ప్రవర్తన

### కేంద్ర ప్రభుత్వానికి సవాల్



న్యూఢిల్లీ, అక్టోబర్ 4 (ఎఎంస్) : కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధానిలోని జంతర్‌మంతర్ వద్ద రెండు రోజులుగా ఆందోళనకారులు పెద్దఎత్తున నిరసనలు చేపడుతున్నారు. ఈ క్రమంలో శనివారం ఆందోళన జరుగుతున్న సమయంలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది తమ పట్ల లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ముగ్గురు మహిళా జర్నలిస్టులు తీవ్ర ఆరోపణలు చేశారు. నిరసనకారులను అదుపులోకి తీసుకుంటున్న సమయంలో అక్కడ మహిళా పోలీసు సిబ్బంది ఎవరూ లేకపోవడాన్ని తాము ప్రశ్నించగా, సహాయక కమిషనర్ వివేక్ భగత్ తమను అసభ్యంగా తాకుతూ వెనక్కి నెట్టేశారని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదులపై నిష్పక్షపాత విచారణ జరిపేందుకు కేసును నేర విభాగానికి బదిలీ చేసినట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు.వెయ్యి మందికి పైగా అదుపులోకి:నగరంలో నిషేధాజ్ఞలు అమలులో ఉన్నప్పటికీ వివిధ సామాజిక సంస్థలు, విద్యార్థి సంఘాల నాయకులు జంతర్‌మంతర్ వద్దకు చేరుకోవడంతో ఇప్పటివరకు వెయ్యి మందికి పైగా నిరసనకారులను అదుపులోకి తీసుకుని, కొన్ని గంటల అనంతరం విడుదల చేసినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఆదివారం కూడా ఆందోళనలు కొనసాగే అవకాశం ఉండటంతో ఆ ప్రాంతంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

## ఇంతే కదా...!








# మల్లమ్మకుంట రైతులకు ఊరట!

- రూ.16.50 లక్షల పరిహారం పెంపునకు సీఎం సానుకూల స్పందన
- రైతుల పక్షాన సంపత్‌కుమార్ విజ్ఞప్తి.. తగిన పరిహారం అందిస్తామని రేవంత్‌రెడ్డి హామీ

అలంపూర్: అక్టోబర్ 04 (వుదయం కరస్పాండెంట్ )

మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం పెంచే అంశంపై కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయించిన ఎకరాకు రూ.16.50 లక్షల పరిహారాన్ని మరింత పెంచాలని ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డా. ఎస్.ఏ. సంపత్‌కుమార్ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని కోరారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు సంపత్‌కుమార్ తెలిపారు.

**రైతుల పరిహారంపైనే ప్రధానంగా చర్చ**

తుమ్మిళ్ల లిఫ్ట్ కింద నిర్మించనున్న మల్లమ్మకుంట రిజర్వాయర్ కోసం భూసేకరణ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో, భూములు కోల్పోతున్న రైతులకు చెల్లించాల్సిన నష్టపరిహారం అంశంపై సంపత్‌కుమార్ ముఖ్యమంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిన ఎకరాకు రూ.16.50 లక్షల పరిహారం ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మరింత పెంచాల్సిన అవసరం ఉందని ఆయన సీఎం దృష్టికి తీసుకెళ్లారు. భూమిని కోల్పోతున్న రైతుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని నష్టపరిహారాన్ని పెంచాలని విజ్ఞప్తి చేశారు.

**రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం'**

సంపత్‌కుమార్ విజ్ఞప్తిపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. భూములు కోల్పోయే రైతులకు ఇబ్బంది కలగకుండా తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చినట్లు సంపత్‌కుమార్ వెల్లడించారు. దీంతో మల్లమ్మకుంట రిజర్వాయర్ కోసం భూములు ఇస్తున్న రైతుల్లో పరిహారం పెంపుపై ఆశలు నెలకొన్నాయి. అయితే పరిహారం ఎంత మేరకు పెంచుతారు? ఏ విధానంలో నిర్ణయిస్తారు? అనే అంశాలపై ప్రభుత్వ నిర్ణయం వెలువడాల్సి ఉంది.

**అలంపూర్ సాగునీటికి కీలక ప్రాజెక్టు**

తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం పరిధిలోని మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే అలంపూర్ ప్రాంతంలో సాగునీటి వనరులు మరింత బలోపేతం కానున్నాయి. ఒకవైపు ప్రాంత సాగునీటి అవసరాలను తీర్చే ప్రాజెక్టు నిర్మాణం ముందుకు సాగుతుండగా, మరోవైపు ప్రాజెక్టు కోసం భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం అందించడంపై దృష్టి పెట్టాలని సంపత్‌కుమార్ కోరుతున్నారు.సీఎం భేటీలో మల్లు రవి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జరిగిన ఈ సమావేశంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి కూడా పాల్గొన్నారు. మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణం, భూసేకరణ, రైతులకు అందించాల్సిన నష్టపరిహారం తదితర అంశాలపై జరిగిన ఈ చర్చకు ప్రాధాన్యం ఏర్పడింది. ప్రభుత్వం పరిహారం పెంపుపై తీసుకోబోయే తుది నిర్ణయంపై రైతుల్లో ఆసక్తి నెలకొంది.

## జనసేన పట్టభద్రుల ఎన్నికల్లో గెలుపుకై

# క్షేత్రస్థాయి కార్య చరణకు శ్రీకారం

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యాచరణ

మహబూబాబాద్, అక్టోబర్ 4 (వుదయం ప్రతినిధి)



ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం జనసేన పార్టీ అభ్యర్థి గడల శ్రీనివాస్ గెలుపు కోసం మహబూబాబాద్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. మహబూబాబాద్ కోఆర్డినేటర్ ఎం.ఎన్. జైసింహ పడాల, మొగిలిపాలెం రమేష్, వెంకటేష్ జెట్టి,నాయకత్వం లో మెరుగు చక్రపాణి గౌడ్, టౌన్ ఇన్‌చార్జి ఎం.డి. ఆసిఫ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో శనివారం ఈ సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ శ్రేణులను సమన్వయం చేసి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి మద్దతు కూడగట్టే అంశాలపై చర్చించారు.మండలాల వారీగా పార్టీ కార్యక్రమాలను విస్తరించేందుకు మహబూబాబాద్‌కు చక్రపాణి, కేసముద్రానికి పవన్, గూడూరుకు అనిల్, నెల్లికుదురుకు వీరారెడ్డి, ఇంగోర్తికి రాకేష్‌లతో చర్చించారు. ఆయా మండలాల్లో పార్టీ శ్రేణులను సమన్వయం చేయడంతో పాటు పట్టభద్రుల ఓటర్లను చేరుకునే విధంగా కార్యాచరణ రూపొందించారు. క్షేత్రస్థాయి కార్యకర్తలు రహీం, పాషా, చక్రధర్, అమీర్, దుర్గాప్రసాద్, ఉదయ్ తదితరులు పార్టీకి అండగా ఉండి ఎన్నికల కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. సమావేశంలో ప్రధానంగా పట్టభద్రుల ఓటరు జాబితాలో పేర్ల నమోదుకు సంబంధించిన ఫారం-18పై అవగాహన కల్పించడం, నియోజకవర్గ పరిధిలోని డిగ్రీ కళాశాలల సమాచారాన్ని కలెక్టర్ కార్యాలయం నుంచి సేకరించడం, మండల స్థాయిలో పార్టీ క్యాడర్‌ను నియమించడం వంటి అంశాలపై చర్చించారు. డిగ్రీ కళాశాలల్లో పార్టీ అభ్యర్థికి మద్దతుగా ప్రచార కార్యక్రమాలను నిర్వహించే విధానంపైనా చర్చ జరిగింది. అలాగే ప్రతి మండలంలో క్షేత్రస్థాయి కార్యకర్తలను గుర్తించి వారికి పార్టీ పరంగా తగిన గౌరవం, బాధ్యతలు కల్పించేలా నాయకత్వం సహకరించాలని సమావేశంలో నిర్ణయించారు. గ్రామ, మండల స్థాయి నుంచి పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ పట్టభద్రుల ఎన్నికల్లో జనసేన అభ్యర్థి గడల శ్రీనివాస్‌కు మద్దతుగా విస్తృతంగా ప్రచారం నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు.



# మల్దకల్ తిమ్మప్పకు 'మహా' యోగం!

- 102 ఎకరాలతో నూతన ఆకృతి.. దేవరగట్టు రోడ్డుకు రంగం సిద్ధం!
- బ్రహ్మోత్సవాల్లోగా భక్తుల కష్టాలు తీరాల్సిందే!
- ప్రభుత్వంతో పోరాడైనా నిధులు తెస్తా: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల అక్టోబర్ 04 (వుదయం బ్యూరో)

నడిగడ్డ ఆరాధ్యదైవం మల్దకల్ తిమ్మప్ప క్షేత్రానికి చిరకాల స్వప్నం సాకారమయ్యే కాలం వచ్చింది. బ్రహ్మోత్సవాల వేళ లక్షలాదిగా వచ్చే భక్తుల రవాణా కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేలా దేవరగట్టు రహదారి నిర్మాణానికి ఊపిరి పోశారు. సర్వే నంబర్లు 334, 134లోని 102 ఎకరాల విస్తీర్ణంతో తిమ్మప్ప ఆలయాన్ని దక్షిణ తెలంగాణలోనే ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చేలా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని కలిసిన ఆలయ వర్గాలు అభివృద్ధి మ్యాప్‌ను అందజేశాయి. దీనిపై ఘాటుగా స్పందించిన ఎమ్మెల్యే, "తిమ్మప్ప క్షేత్రానికి ఏళ్లుగా జరుగుతున్న నిర్లక్ష్యానికి ముగింపు పలుకుతాం. దసరా నుంచే రోడ్డు పనులు పట్టాలెక్కిస్తాం. ప్రభుత్వంతో మాట్లాడి నిధులు సాధించే బాధ్యత నాది" అని స్పష్టం చేశారు.

# నీళ్లు తెరిచి వదిలేస్తే.. రేపు చెంబుడు నీళ్లకు తల్లడిల్లాల్సిందే!

- తాగునీటిని వృథా చేస్తే కఠిన ఆంక్షలు.. చట్టపరమైన చర్యలు
- ఐజ మున్సిపల్ చైర్మన్ సి.ఎం. సురేష్ హెచ్చరిక
- అడుగంటుతున్న భూగర్భ జలాలు.. పడిపోతున్న జూరాల నీటి మట్టం
- ఉదయం, సాయంత్రం సరఫరా అయ్యే భగీరథ నీటిని పొదుపుగా వాడాలని పిలుపు

ఐజ అక్టోబర్ 04 (వుదయం ప్రతినిధి)



ఇంటి ముందు నల్లాను ఇష్టారాజ్యంగా తెరిచి వదిలేసి, తాగునీటిని మురుగు కాలువల్లోకి పారిస్తే భవిష్యత్తులో చెంబుడు నీటి కోసం అల్లాడాల్సి వస్తుందని ఐజ మున్సిపల్ చైర్మన్ సి.ఎం. సురేష్ తీవ్రంగా హెచ్చరించారు. తాగునీటి ప్రాధాన్యతను గుర్తించకుండా అలసత్వం వహిస్తే మున్సిపాలిటీ తరపున కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గొంతు ఎండుతున్న వేళ పరుగులు తీయడం కంటే.. ముంచుకొస్తున్న కరువును గ్రహించి ఇప్పటి నుంచే నీటిని ప్రాణప్రదంగా కాపాడుకోవాలని మున్సిపల్ ప్రజలకు పిలుపునిచ్చారు. తాగునీటిపై కరువు నీడలు! వాతావరణంలో మార్పులు, వేసవిని తలపించేలా పెరిగిన ఉష్ణోగ్రతల వల్ల భూగర్భ జలాలు వేగంగా అడుగంటి పోతున్నాయని చైర్మన్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి తోడు పట్టణ తాగునీటి అవసరాలకు ప్రధాన ఆధారమైన జూరాల ప్రాజెక్టులో నీటి నిల్వలు రోజురోజుకూ క్షీణిస్తున్నాయని వెల్లడించారు. ఇదే పరిస్థితి కొనసాగితే సాగునీటి మాట దేవుడెరుగు.. చివరికి గుక్కెడు తాగునీటికి కూడా తీవ్రమైన ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందన్నారు.బాధ్యతారాహిత్యాన్ని సహించేది లేదు! మిషన్ భగీరథ ద్వారా ఉదయం, సాయంత్రం వేళల్లో సరఫరా అవుతున్న నీటిని అవసరమైన మేరకే వాడుకోవాలని చైర్మన్ స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలోని నల్లాలకు తప్పనిసరిగా ట్యాపులు బిగించుకోవాలని, పైపులైన్లలో ఎక్కడైనా లీకేజీలు ఉంటే వెంటనే మున్సిపల్ సిబ్బందికి సమాచారం అందించి మరమ్మతులు చేయించుకోవాలని కోరారు. తాగునీటిని రోడ్లపైకి, డ్రెయిన్లలోకి వదిలేసే సంస్కృతిని ఏమాత్రం సహించేది లేదని తేల్చి చెప్పారు. "నల్లా నుంచి చుక్క చుక్కగా కారిపోయే నీరు.. రేపటి మన జీవితాలను ఎండబెట్టే కరువుకు పునాది" అని ఘాటుగా గుర్తుచేశారు. మానవ తప్పిదాలపై ఉక్కుపాదం! పట్టణ ప్రజలకు తాగునీటిని అందించడం ఎంత బాధ్యతో.. నీటి వృథాను అరికట్టడం కూడా అంతే ప్రాథమిక కర్తవ్యమని చైర్మన్ వ్యాఖ్యానించారు. తాగునీటిని ఇష్టారాజ్యంగా వృథా చేసే వారిపై ఐజ మున్సిపాలిటీ తరపున కఠినమైన ఆంక్షలు, జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఇంటి నుంచే మహోద్యమం కావాలి నీటి సంరక్షణ అనేది ఏదో ఒక రోజు చేసే కార్యక్రమం కాదని, అదొక నిరంతర బాధ్యత అని ఆయన అన్నారు. ప్రతీ ఇంట్లోనూ మహిళలు, యువత, పెద్దలు నీటిని పొదుపుగా వాడటంలో ముందుండాలని పిలుపునిచ్చారు. పక్కన ఉన్నవారు నీటిని వృథా చేస్తుంటే చూస్తూ ఊరుకోవడం కూడా నేరంతో సమానమేనన్నారు. నీటిని కాపాడుకోవడం అంటే మన భవిష్యత్తు తరాలను కాపాడుకోవడమేనని, మున్సిపల్ యంత్రాంగానికి ప్రతి ఒక్కరూ సంపూర్ణంగా సహకరించాలని సురేష్ విజ్ఞప్తి చేశారు.

# రోడ్డుపైనే మురుగు నీరు.. పట్టించుకోని అధికారులు

- దుర్వాసనతో ప్రజల అవస్థలు.. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

కోహీర్, అక్టోబరు 4 (వుదయం ప్రతినిధి):



కోహీర్ మండల పరిధిలోని దిగ్వాల్ గ్రామంలో మురుగు నీటి సమస్య తీవ్రంగా మారింది. గ్రామంలోని 65వ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై మురుగు నీరు రోజుల తరబడి నిలిచిపోవడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. మురుగు నీటిలో ఈగలు, దోమలు విపరీతంగా పెరగడంతో పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్య నెలకొంది. దీంతో ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మురుగు నీటితో పాటు రోడ్డుపై బురద పేరుకుపోవడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోందని గ్రామస్తులు తెలిపారు. రోడ్డుపై మురుగు నీరు నిలిచిపోవడంతో వాహనాలు వెళ్లే సమయంలో నీరు చుట్టుపక్కల చిందుతున్న పరిస్థితి ఉందని పేర్కొన్నారు.సమస్యపై సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు సమాచారం ఇచ్చినా ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించాలని కోరుతున్నారు. మురుగు నీటిని తొలగించడంతో పాటు రోడ్డును శుభ్రం చేసి, నీరు నిలిచిపోకుండా శాశ్వత డ్రైనేజీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టి దిగ్వాల్ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఘనంగా బిజెపి నేత

# రతంగ్ జన్మదిన వేడుకలు



నారాయణపేట టౌన్ అక్టోబర్4 (వుదయం ప్రతినిధి)

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొత్తకాపు రతంగ్ పాండు రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ నాయకు లు కార్యకర్తలు అభిమాను లు ఆదివారం ఘనంగా నిర్వహించా రు.ఈ సందర్భంగా పట్టణంలోని 8 శతాబ్దాల నాటి నిమజ్జనం ఎరుగని మట్టి వినాయకుడి మందిరంలో సతీమణి రత్నమాల,కుమారుడు డాక్టర్ కే. రాజేష్ రెడ్డి బిజెపి జిల్లా పట్టణ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ రతంగ్ పాండు రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపా రు.ప్రజా సేవ చేసేందుకు ఆయనకు ఆ భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసా దించాలనిఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి శ్యామ్ సుందర్ గౌడ్,మున్సిపల్ వైస్ చైర్మన్ మంజుల జి.ఆర్ రెడ్డి, కౌన్సిలరులు ప్రభాకర్, నాగ మ్మ,నాయకులు జి.రాఘవేంద్ర రెడ్డి,జ్యోతి సాయిబ న్న,శ్రీనివాస్ రెడ్డి, అశోక్ భయ్యా,నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



## అంబరాన్నంటిన

# గోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు

- శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు అందజేసిన కల్వకుంట్ల కవితక్క

సదాశివపేట: అక్టోబర్ 04 (వు దయం):

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) రాష్ట్ర నాయకుడు గోపాల్ రెడ్డి గారి జన్మదిన వేడుకలు పార్టీ శ్రేణులు, నాయకుల సమక్షంలో అత్యంత ఘనంగా, కోలాహలంగా జరిగాయి. తన పుట్టినరోజును పురస్కరించుకుని రాష్ట్ర నాయకుడు గోపాల్ రెడ్డి గారు పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితక్క గారిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా కవితక్క గారు గోపాల్ రెడ్డిని ప్రత్యేకంగా శాలువాతో ఘనంగా సత్కరించి, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కలబూర్ దయాకర్ రెడ్డి, చంద్రిక కరుణాకర్, మనోజ్ రెడ్డి, రజనీకాంత్, రామకృష్ణ, రాహుల్, ప్రదీప్, ఎండీ వాజిద్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని గోపాల్ రెడ్డి గారికి శుభాకాంక్షల వెల్లువ కురిపించారు.



# పేదరికం ముందు ఓడిన ప్రాణం!

- నిండు గర్భంతో ఆస్పత్రుల చుట్టూ తిరిగిన ఎలిశమ్మ.. చివరకు మృత్యుఒడిలోకి
- తల్లిని కోల్పోయిన నలుగురు ఆడపిల్లలు.. కుటుంబం రోడ్డున పడే పరిస్థితి
- రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా.. పిల్లల చదువుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్

అలంపూర్ అక్టోబర్ 04 (వుదయం కరస్పాండెంట్ )



కడుపులో బిడ్డ.. కళ్ల ముందు నలుగురు ఆడపిల్లలు.. గుండెను పట్టిపీడిస్తున్న వ్యాధి.. చేతిలో డబ్బుల్లేని దయనీయ పరిస్థితి.. మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రుల చుట్టూ తిరిగినా చివరకు ప్రాణం నిలవలేదు. తొమ్మిది నెలల నిండు గర్భిణి ఎలిశమ్మ (35) మృతి చెందిన ఘటన జోగులాంబ గద్వాల జిల్లా అల్లంపూర్ మండలం క్యాతూర్ గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. దళిత కుటుంబానికి చెందిన ఎలిశమ్మకు భర్త నరేందర్‌తో పాటు నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. కొద్దిరోజులుగా తీవ్రమైన దగ్గు, ఆయాసం, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందితో ఆమె బాధపడుతున్నారు. పరిస్థితి ఆందోళన కరంగా మారడంతో కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు గుండె సంబంధిత సమస్య తీవ్రంగా ఉందని, మెరుగైన వైద్యం అవసరమని చెప్పి హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కానీ పేదరికం ఆ కుటుంబానికి మరో పెద్ద గోడగా మారింది. ఖరీదైన వైద్యం చేయించే స్తోమత లేక చివరకు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే ఎలిశమ్మ పరిస్థితి విషమించి మృతి చెందింది. ఒక్క మరణం.. నాలుగు జీవితాలకు చీకటి ఎలిశమ్మ మరణంతో భర్త నరేందర్ కన్నీరుమున్నీరవు తున్నాడు. నిన్నటి వరకు అమ్మ ఒడిలో ఉన్న నలుగురు ఆడపిల్లలు.. నేడు అమ్మలేని ఇంట్లోకి మిగిలిపోయారు. వారి చదువు ఎవరు చూసుకుంటారు? భవిష్యత్తుకు ఎవరు అండగా నిలుస్తారు? అనే ప్రశ్నలు గ్రామస్థులను కలచివేస్తు న్నాయి. తల్లిని కోల్పోయిన ఆ చిన్నారు లకు ప్రభుత్వం తల్లిలా అండగా నిలవా ల్సిన సమయం ఇది. ప్రభుత్వం స్పందించకపోతే పేదలకు వైద్యం ఎందుకు? అత్యవసర పరిస్థితుల్లో పేద కుటుంబాలకు మెరుగైన వైద్యం అందకపోతే ప్రభుత్వ వైద్య వ్యవస్థపై నమ్మకం ఎలా నిలుస్తుందని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. డబ్బున్నవారికి ప్రైవేటు ఆస్పత్రులు..డబ్బులేని పేదలకు ఏ దారి? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పేదరికం కారణంగా వైద్యం అందక ఏ ఒక్క ప్రాణం కూడా కోల్పోకూడదని, అత్యవసర గుండె వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి**

ఎలిశమ్మ కుటుంబం పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.తక్షణ డిమాండ్లు: అంత్యక్రియల కోసం రూ.30 వేల ఆర్థిక సాయం వెంటనే అందించాలి. బాధిత కుటుంబానికి రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి. నలుగురు ఆడపిల్లల విద్య, పోషణ, భవిష్యత్తుకు ప్రభుత్వం పూర్తి భరోసా కల్పించాలి. ఇద్దరు ఆడపిల్లలకు గురుకుల పాఠశాలలో ఉచిత ప్రవేశం కల్పించాలి. కుటుంబానికి జీవనోపాధి కల్పించేలా ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలి. పేద గర్భిణులు, అత్యవసర రోగులకు సకాలంలో మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవసర వైద్య సదుపాయాలను బలోపేతం చేయాలి. ఎమ్మార్వో.. ఎంపీడీవో వెంటనే స్పందించాలి బాధిత కుటుంబం దుస్థితిని అధికారులు స్వయంగా పరిశీలించి, ప్రభుత్వ పరంగా అందాల్సిన ప్రతి సహాయాన్ని ఆలస్యం లేకుండా తక్షణమే అందించాలని క్యాతూర్ గ్రామస్థులు కోరుతున్నారు. ఎలిశమ్మ ప్రాణం తిరిగి రాదు. కానీ ఆమె నలుగురు ఆడపిల్లల భవిష్యత్తును ప్రభుత్వం కాపాడగలదు. ఆ చిన్నారులు రేపటి రోజున తమ తల్లిని గుర్తు చేసుకుంటూ కన్నీరు పెట్టుకోకుండా.. వారి చదువు, జీవితం, భవిష్యత్తుకు ప్రభుత్వం అండగా నిలవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.ఎలిశమ్మ కుటుంబానికి న్యాయం చేయాలి.. నలుగురు ఆడపిల్లలకు భరోసా కల్పించాలి.. పేదలకు ప్రాణం పోసే వైద్యం అందించాలి" అని క్యాతూర్ గ్రామస్థులు ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# గురునగర్‌లో దొంగల హల్‌చల్.. ఆలయాలూ టార్గెట్!

- హుండీ పగలగొట్టి నగదు అపహరణ.. సీసీ కెమెరాలు ఉన్నా ఆగని చోరీలు

సదాశివపేట వుదయం :

పట్టణంలోని గురునగర్ కాలనీలో దొంగలు రెచ్చిపోతున్నారు. ఇళ్లతో పాటు ఏకంగా దేవాలయాలను సైతం టార్గెట్ చేస్తూ వరుస చోరీలకు పాల్పడుతుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. తాజాగా శ్రీ భవాని మాత ఆలయంలోకి చొరబడిన ఓ దొంగ.. తొలుత అమ్మవారిని దర్శించుకుని, నుదుటిన బొట్టు పెట్టుకుని మరీ హుండీ వద్దకు వెళ్లాడు. అనంతరం హుండీని పగలగొట్టి అందులోని నగదును అపహరించాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదైనట్లు తెలుస్తోంది.

**వరుస ఘటనలతో కలకలం**

గత నెలలోనూ ఇదే ఆలయంలో హుండీ చోరీ జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. అదేవిధంగా గురునగర్ కాలనీలో బైక్ చోరీలు, ఇళ్లలో చోరీలు చోటుచేసుకున్నాయి. ఇంటి ముందు పార్క్ చేసిన బైక్‌కు నిప్పుపెట్టిన ఘటన కూడా గతంలో జరిగింది. వరుస ఘటనల నేపథ్యంలో వీటి వెనుక ఒకే ముఠా ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**పోలీసుల నిఘాపై ప్రశ్నలు**

కాలనీలో అనుమానాస్పద వ్యక్తుల సంచారం గురించి స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా తగిన చర్యలు కనిపించలేదని వాపోతున్నారు. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ దొంగతనాలు కొనసాగుతుండటంపై పోలీసుల నిఘాపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.వరుస చోరీలకు పాల్పడుతున్న ముఠాను వెంటనే గుర్తించి అరెస్టు చేయడంతో పాటు గురునగర్ కాలనీలో రాత్రి వేళల్లో పోలీసు గస్తీ పెంచి ప్రజలకు భద్రత కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

# జీవన్గిలో సర్పంచ్ పార్టీ మార్పుపై బీఆర్ఎస్ ఆగ్రహం

- రాజీనామా చేసి మళ్లీ ప్రజా తీర్పు కోరాలి
- సర్పంచ్‌పై బీఆర్ఎస్ నాయకుల తీవ్ర విమర్శలు

బషీరాబాద్ (ఉదయం, అక్టోబర్ 4):



జీవన్గి గ్రామంలో సర్పంచ్ రామని బసప్ప కాంగ్రెస్ పార్టీలో చేరిన వ్యవహారం రాజకీయ వివాదానికి దారితీసింది. సర్పంచ్ పార్టీ మార్పును వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆదివారం గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో సమావేశమైన వారు సర్పంచ్ నిర్ణయంపై తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. గత సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ శ్రేణులు, గ్రామ ప్రజలు సమష్టిగా పనిచేసి రామని బసప్పను 255 ఓట్ల మెజారిటీతో గెలిపించారని నాయకులు తెలిపారు. అయితే సర్పంచ్‌గా గెలిచిన అనంతరం తనను గెలిపించిన పార్టీ కార్యకర్తలు, ప్రజలతో చర్చించకుండా కాంగ్రెస్‌లో చేరడం సమంజసం కాదని వారు అన్నారు. ప్రజలు గ్రామాభివృద్ధిపై నమ్మకంతో బాధ్యత అప్పగించారని, అయితే గ్రామంలో తాగునీరు, వీధి దీపాలు వంటి మౌలిక సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. పంచాయతీ నిధుల వినియోగంపై కూడా అనుమానాలు ఉన్నాయని, సుమారు రూ.20 లక్షల వరకు నిధుల విషయంలో స్పష్టత ఇవ్వాల్సి ఉందని వారు ఆరోపించారు. ఈ ఆరోపణలపై సర్పంచ్ నుంచి వివరణ కోరాలని డిమాండ్ చేశారు. పార్టీ మారడం వ్యక్తిగత నిర్ణయమే అయినప్పటికీ, ఒక పార్టీ మద్దతుతో ఎన్నికైన ప్రజాప్రతినిధిగా పదవిలో కొనసాగుతూ మరో పార్టీలో చేరడం నైతికంగా సరైంది కాదని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. నిజంగా ప్రజల మద్దతు తనవైపే ఉందని భావిస్తే సర్పంచ్ పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేసి ప్రజా తీర్పు పొందాలని సవాల్ చేశారు.

ప్రజలు మళ్లీ గెలిపిస్తే ఏ పార్టీలో చేరినా మాకు అభ్యంతరం లేదు. ముందుగా ప్రజా తీర్పును గౌరవించాలి అని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. పదవికి రాజీనామా చేయకుండా కొనసాగితే గ్రామస్థులతో కలిసి పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. పార్టీ కార్యకర్తలు, ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించడాన్ని సహించబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల బీసీ సెల్ అధ్యక్షుడు దస్తయ్య గౌడ్, ఉప సర్పంచ్ జర్నప్ప, వార్డు మెంబర్ పూర్మ ఈరప్ప, సీనియర్ నాయకులు ఎనుముల అంజిలప్ప, భీమప్ప తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన రహదారిపై డ్రైనేజీ నీరు

- డ్రైనేజీ నిర్మించాలని కాలనీ వాసుల డిమాండ్..

మెదక్ జిల్లా వుదయం

నిజాంపేట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీకి వెళ్లే దారి, రజాక్‌పల్లి ప్రధాన రహదారిపై నిత్యం డ్రైనేజీ నీటిని రోడ్డుపైకి వదులుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ నీరు రోడ్డుపై ప్రవహించడంతో దుర్వాసన వెదజల్లుతూ పరిసరాలను కలుషితం చేస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.డ్రైనేజీ నీటిని రోడ్డుపై ఎందుకు వదులుతున్నారని కాలనీ వాసులను ప్రశ్నించగా, తమ కాలనీకి ఇప్పటివరకు డ్రైనేజీ వ్యవస్థ నిర్మించకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో నీటిని రోడ్డుపైకి వదలాల్సి వస్తోందని తెలిపారు. దీంతో నిత్యం ఈ రహదారిపై రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండటంతో దుర్వాసనతో పాటు దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని, ప్రజారోగ్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా గ్రామపంచాయతీ పాలకవర్గం స్పందించి కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి, మురుగునీటిని రోడ్డుపైకి రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీ వాసులు కోరుతున్నారు.





# గ్రేటర్ హైదరాబాద్



## 14వ వార్డులో చైర్‌పర్సన్ సమత వెంకట్‌రెడ్డి పర్యటన

- **ప్రజల సమస్యలపై ఆరా.. నీటిని పొదుపుగా వినియోగించాలని సూచన**

**చేవెళ్ల, అక్టోబర్ 4 (వుదయం)**

చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ సమత వెంకట్‌రెడ్డి పర్యటించారు.14వ వార్డ్ కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పర్యటనలో వార్డులోని ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వార్డులోని నీటి నల్లాలను పరిశీలించిన చైర్‌పర్సన్, ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవడం లేదని తెలిపారు.నీటి కొరత ఏర్పడకుండా ప్రజలు ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించాలని, నీటిని వృథా చేయవద్దని సూచించారు. అలాగే వార్డు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుద్ధ్యంపై



ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆమె కోరారు.ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు మున్సిపాలిటీ తరపున చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, వార్డు సభ్యులు శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎరుకల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- **ఎస్టీ జాబితాలో రాజకీయ ప్రాతినిధ్యంతో పాటు తగిన అవకాశాలు కల్పించాలి: టీపీవైఎస్ అధ్యక్షుడు కూరాకుల కృష్ణ**

**ముషీరాబాద్, అక్టోబర్ 04(వుదయం)**

ఎరుకల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం (టీపీవైఎస్) అధ్యక్షుడు కూరాకుల కృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీపీవైఎస్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కూరాకుల కృష్ణ మాట్లాడుతూ.. ఎరుకల సమాజానికి ఎస్టీ జాబితాలో తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు రాజకీయంగా ఎదిగేందుకు సముచిత అవకాశాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్రం నుంచి గ్రామస్థాయి వరకు ఎరుకల సంఘాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా, మండల, గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేసి, ఎరుకల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఎరుకల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, గురుకులాల్లో ప్రవేశాలు, పోటీ పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ వంటి సదుపాయాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎరుకల ఆర్థికాభివృద్ధి కోసం అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.



అదేవిధంగా ఎరుకల ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించాలని, ట్యాంక్‌బండ్‌పై ఎరుకల జాతి మహనీయుల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఎరుకల సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో ప్రధాన కార్యదర్శి ధర్మ, దేవరాయ సుధాకర్, కూరాకుల కిషన్‌లాల్, కూడాడి పాండు, శ్రీరాం శివకుమార్, నిమ్మ చంద్రయ్య, పుచ్చిత మల్లేష్, దేవసాని కృష్ణ, కోట సుజాత, కూరాకుల సరస్వతి, మాన్పాటి శైలజ, కూడాడి అనసూయ, ముద్దనోళ్ల శ్రీనివాస్, ముద్దనోళ్ల బాలయ్య, రాగికి అనంతప్ప, నల్ల గొండ భీమమ్మ తదితరులు పాల్గొన్నారు.





## పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం

- **తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్**

**రామచంద్రాపురం అక్టోబర్ 4(వుదయం)**

పటాన్చెరు నియోజకవర్గం భారతీనగర్ డివిజన్ పరిధిలోని బాంబే కాలనీలో ఉన్న మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో జాతీయ పోషకాహార వారోత్సవాల సందర్భంగా పోషకాహార మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామచంద్రాపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. పుష్పనగేష్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పోషకాహారం ఎంతో కీలకమన్నారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు సమతుల్య ఆహారం అవసరమని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను అధిగమించవచ్చన్నారు.ప్రతి కుటుంబంలో పోషకాహారంపై అవగాహన పెంపొందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అనంతరం మూడు నుంచి ఆరు సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ జైరాం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, కృష్ణవేణి, సంధ్య, కల్పన, మధుబాల, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.



## సంచార ముస్లింలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- **ప్రభుత్వాలు సంచార ముస్లింల సమస్యలను పరిష్కరించాలి**
- **విద్య, ఉపాధి, గృహ వసతి కల్పించాలి**
- **రాష్ట్ర అధ్యక్షుడు సాయిదా ఖాన్ డిమాండ్**

**ముషీరాబాద్, అక్టోబర్ 04 (వుదయం)**

సంచార ముస్లింల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని సంచార ముస్లిం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాయిదా ఖాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంచార ముస్లింలలోని వివిధ కుల సంఘాలు, సంస్థలను ఏకతాటిపైకి తీసుకొచ్చి సామాజిక న్యాయం, హక్కుల సాధన కోసం సంచార ముస్లిం జేఏసీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా సంచార ముస్లింలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆశించిన స్థాయిలో ప్రయోజనాలు అందలేదని సాయిదా ఖాన్ ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ పదేళ్ల పాలనలోనూ తమ వర్గానికి తగిన న్యాయం జరగలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్నా సంచార ముస్లింల సమస్యల పరిష్కారానికి సమగ్ర చర్యలు తీసుకోలేదని విమర్శించారు.ముస్లింలను కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా వారి విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబన, గృహ వసతిపై రాజకీయ పార్టీలు దృష్టి సారించాలని కోరారు. విద్యకు దూరమైన సంచార ముస్లిం పిల్లలకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇళ్లు లేని పేద కుటుంబాలకు పక్కా గృహాలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందించాలని కోరారు.



సంచార ముస్లింల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ప్రత్యేక బడ్జెట్ కేటాయించడంతో పాటు సంక్షేమ పథకాలను నేరుగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంచార జాతుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అన్నారు.

సంచార ముస్లింలలోని తుర్కకాశా, ఫకీరు, గారెడి సాయిబులు, గంటా ఫకీరు తదితర కుల సంఘాలతో పాటు సంచార జాతులకు చెందిన రెండు సంస్థలను కలుపుకొని జేఏసీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐక్యంగా పనిచేస్తూ తమ హక్కుల సాధన కోసం ప్రభుత్వంపై ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఒత్తిడి తీసుకువస్తామని స్పష్టం చేశారు.

జేఏసీ చైర్మన్‌గా సాయిదా ఖాన్, వైస్ చైర్మన్‌గా ఫరీద్, ప్రధాన కార్యదర్శిగా మసూద్,
కోశాధికారిగా ఇమాం పాషా, గౌరవ సలహాదారుగా సలీమ్ ఎన్నికైనట్లు తెలిపారు. ఇతర కార్యవర్గాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



## గ్రామ యువతకు అభినందనలు

- **రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కల తొలగింపు**

**చేవెళ్ల,అక్టోబర్ 04 (వుదయం)**

చేవెళ్ల మండల పరిధిలోని తల్లారం గ్రామపంచాయతీ దుద్దాగు గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను గ్రామ యువకులు ఆదివారం తొలగించారు.మొక్కలు రోడ్డుపైకి విస్తరించడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గ్రామ యువత సమస్యను గుర్తించి ముందుకు వచ్చింది.ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సొంత నిధులతో జేసీబీ సాయంతో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు.దీంతో రహదారి విశాలంగా మారి వాహనాల రాకపోకలకు సౌకర్యం గా మారింది. ప్రభుత్వంపై ఆధారపడకుండా గ్రామ సమస్యను గుర్తించి సొంత ఖర్చులతో పరిష్కారానికి చొరవ చూపిన దుద్దాగు గ్రామ యువతను స్థానికులు గ్రామ యువతను అభినందించారు.గ్రామాభివృద్ధికి యువత ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని వారు కోరారు.ఈ కార్యక్రమం కోనాపురం రవీందర్,గూడెం నవీన్ జాలగూడెం రవి, కూరాకుల శంకరయ్య గూడెం సాయి కుమార్

## తెలంగాణలో కరవు పరిస్థితి చూస్తుంటే బాధగా ఉంది: కవిత

**హైదరాబాద్:**

రాష్ట్రంలో కరవు పరిస్థితి చూస్తుంటే బాధగా ఉందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వరుణయాగం చేసి.. చేతులెత్తేశారని విమర్శించారు. రాష్ట్రంలో ఇప్పటికీ కరవు మండలాలను ప్రకటించలేదన్నారు. కరవు మండలాలను ప్రకటిస్తే.. రైతులకు కేంద్రం సాయం చేస్తుందని చెప్పారు. మీడియా సమావేశంలో కవిత ఈమేరకు మాట్లాడారు.‘‘కృష్ణ జలాలు కుప్పం వరకు తరలిపోయాయి. మన పాలమూరుకు రాని పరిస్థితి. సీఎం రేవంత్‌రెడ్డి.. చంద్రబాబుకు నీళ్లను గిఫ్ట్‌గా ఇస్తున్నారు.



## శ్రీవారి సేవలో ఏపీ ఎఫ్‌డీసీ చైర్మన్ భరత్ భూషణ్..

## త్వరలోనే నంది అవార్డుల వేడుక!

- **శ్రీవారిని దర్శించుకున్న ఏపీ ఎఫ్డిసి చైర్మన్ భరత్ భూషణ్.. త్వరలోనే నంది అవార్డు జరుగుతున్నట్టు తెలిపారు..!**

**తిరుమల అక్టోబర్ 4 (వుదయం)**

శ్రీవెంకటేశ్వర స్వామివారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం విఐపి విరామ సమయంలో ఎస్ వి బి సి చైర్మన్ శ్రీధర్ వర్మ, ఏపీ ఎఫ్డిసి చైర్మన్ భరత్ భూషణ్ కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఏపీ ఎఫ్డిసి చైర్మన్ భరత్ భూషణ్ కుటుంబ సమేతంగా శ్రీవారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం ఆలయ రంగ నాయకుల మండపంలో పండితులు వేదశీర్వచనం అందించగా

....ఆలయం అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు ఏపీ ఎఫ్డిసి చైర్మన్ భరత్ భూషణ్ గారికి అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు.ఎస్విబిసి చైర్మన్ శ్రీధర్ వర్మ ఏపీ ఎఫ్డిసి చైర్మన్ భరత్ భూషణ్ గారికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయురారోగ్యాలు కలగాలని, ప్రతి పనిలోనూ స్వామి వారి ఆశీస్సులు ఉండాలి అని తెలిపారు.

## దివంగత నాయకుడు ఇంద్రారెడ్డి జయంతి వేడుకలు..

### శ్రద్ధాంజలి ఘటించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి





- **చేవెళ్లలో విగ్రహానికి పూలమాలలు వేసిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**

**చేవెళ్ల,అక్టోబర్ 4 (వుదయం)**

స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రారెడ్డి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ హోంశాఖ మంత్రి జయంతి సందర్భంగా ఆదివారం చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఇంద్రారెడ్డి స్వగ్రామమైన కౌకుంట్లలోని వ్యవసాయ క్షేత్రంలో ఉన్న ఆయన సమాధి వద్ద సబితా ఇంద్రారెడ్డి, కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు,
నాయకులు, అభిమానులు నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు ఇంద్రారెడ్డి సేవలను స్మరించుకున్నారు.ఆయన జయంతి కార్యక్రమాల్లో భాగంగా చేవెళ్లతో పాటు కౌకుంట్లలో అభిమానులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శంకర్‌పల్లి పట్టణంలో ఘనంగా స్వర్గీయ ఇంద్రారెడ్డి జయంతి వేడుకలు..




- **బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండి చెర్ల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నివాళులు**
- **స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రారెడ్డి సేవలు చిరస్మరణీయం.. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండి చెర్ల గోవర్ధన్ రెడ్డి**
- **ఇంద్రారెడ్డి అడుగుజాడల్లో నడిచి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి.. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండి చెర్ల గోవర్ధన్ రెడ్డి**
- **ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఇంద్రారెడ్డి ఆశయాలను కొనసాగించాలి.. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండి చెర్ల గోవర్ధన్ రెడ్డి**

**శంకర్‌పల్లి అక్టోబర్ 04 (వుదయం)**

శంకర్‌పల్లి పట్టణంలో ఆదివారం మాజీ హోంశాఖ మంత్రి, స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రారెడ్డి జయంతి వేడుకలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో ఉన్న స్వర్గీయ ఇంద్రారెడ్డి విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఇంద్రారెడ్డి అమర్ రహే అంటూ నినాదాలు చేస్తూ ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండి చెర్ల గోవర్ధన్ రెడ్డి పాల్గొని ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం స్వర్గీయ ఇంద్రారెడ్డి చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. ఆయన రాజకీయ జీవితంలో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని గుర్తు చేశారు.స్వర్గీయ ఇంద్రారెడ్డి హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందాయని నాయకులు పేర్కొన్నారు. గ్రామాలకు రహదారులు, తాగునీరు, విద్యుత్, ఇతర మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. సాధారణ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి కృషి చేసిన నాయకుడిగా ఇంద్రారెడ్డి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఆయన ఆశయాలను, ఆలోచనా విధానాన్ని నేటి తరం నాయకులు, కార్యకర్తలు ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండి చెర్ల గోవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు.

గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అందరూ ఐక్యంగా పనిచేస్తూ ఇంద్రారెడ్డి చూపిన బాటలో నడవాలని సూచించారు.ఈ జయంతి కార్యక్రమంలో శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్, మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బద్దం శశిధర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు గోవర్ధన్ రెడ్డి, మాల చిన్న నరసింహులు, మాజీ ఏఎంసీ చైర్మన్ మాణిక్ రెడ్డి, మాజీ సర్పంచ్ బి. శ్రీధర్, నాయకులు విజయ్ కుమార్, వాసుదేవ్ కన్నా, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పలు గ్రామాలకు చెందిన సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై స్వర్గీయ ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇంద్రారెడ్డి చేసిన ప్రజాసేవను గుర్తుచేసుకుని ఆయన ఆశయాలను కొనసాగిస్తామని నాయకులు ప్రతిజ్ఞ చేశారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని నాయకులు పేర్కొన్నారు.

## ఘనంగా 'ఇంటర్నేషనల్ ఇంక్ బౌండ్ 2.0' వేడుక

- **పుస్తకాలను ఆవిష్కరించిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు**
- **మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా ఘనంగా 'ఇంటర్నేషనల్ ఇంక్ బౌండ్ 2.0' వేడుక**

**హైదరాబాద్ అక్టోబర్ 4 (వుదయం)**

కస్తూరి విజయం పబ్లిషర్స్ సంస్థ నిర్వహించిన 'ఇంటర్నేషనల్ ఇంక్ బౌండ్ 2.0 వేడుక శనివారం సాయంత్రం ప్రసాద్ ల్యాబ్‌లో జరిగింది. కస్తూరి విజయం సంస్థ వ్యవస్థాపకులు పామర్తి సుధీర్ పామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, రచయిత, నటుడు తనికెళ్ల భరణి, మాజీ రాజ్యసభ సభ్యులు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్‌లు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్ యజ్ఞాల రచించి కస్తూరి విజయం పబ్లిషర్స్ ప్రచురించిన స్క్రీన్‌ప్లే మాస్టర్ సుకుమార్ పుస్తకం తెలుగు, హిందీ, ఇంగ్లీష్ల ఎడిషన్‌లతో పాటు ప్రముఖ రచయిత వంగూరి చిట్టెన్ రాజు రచించిన అవేమైనా జ్ఞాపకాలా మర్చిపోవడానికి పుస్తకాలను వెంకయ్య నాయుడు గారు ఆవిష్కరించారు. దీంతో పాటు ఈ సందర్భంగా 48 కథల సంకలనం అమ్మమ్మ కథల ఖజానా పుస్తకాన్ని కూడా పబ్లిషర్స్ ఆ పుస్తక రచయితల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు గారు మాట్లాడుతూ '' పుస్తకం మధుర మధురజ్ఞాపకాల బాండాగారం.. చిట్టేం రాజు ఈ పుస్తకంలో ఎన్నో విషయాలను ఆవిష్కరించారు. ఇక మనం మరిచిపోతున్న మన సంప్రదాయాలను కట్టు, బొట్టు, భాషలను ఈ పుస్తకంలో ఆయన గుర్తు చేశారు. ఇక ఇండియాలో కంటే ఎక్కువగా విదేశాల్లో మన సంప్రదాయాలను చక్కగా పాటిస్తున్నారు. ఇండియాలో ఉన్నవాళ్లు పాశ్చాత్య సంస్కృతి పేరిట వింత పోకడలను అనుసరిస్తున్నారని ఆయన చెప్పారు. స్క్రీన్‌ప్లే మాస్టర్ సుకుమార్ పుస్తకం రావడం అభినందనీయం. సినిమాలు వినోదంతో పాటు విజ్ఞానాన్నిఅందించాలి. హ్యూమర్, గ్రామర్ ఉంటే సినిమాకు గ్లామర్ వస్తుంది. ఈ దిశలో సినిమా ప్రముఖులు చొరవ తీసుకోవాలి. దర్శకుడు సుకుమార్‌పై మూడు భాషల్లో పుస్తకం రావడం అభినందనీయం' అన్నారు.




నటుడు, రచయిత తనికెళ్ల భరణి మాట్లాడుతూ '' సుధీర్ పామిరెడ్డి కుటుంబ సభ్యులు మంచి సాహిత్య ప్రియులు. కుటుంబం మొత్తం ఈ పుస్తకాల ప్రచురణలో ఉండటం అభినందనీయం. స్క్రీన్‌ప్లే మాస్టర్ సుకుమార్ పుస్తకం రచించిన ప్రవీణ్ యజ్ఞాల నా మిథునం సినిమా కథస్క్రీన్‌ప్లేపై తులనాత్మక పరిశోధనతో ఓ పుస్తకం తీసుకొచ్చాడు. సుకుమార్‌పై రాసిన పుస్తకం కూడా చదివి నా అభిప్రాయం తెలియజేస్తాను' అన్నారు.

**IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL CHIEF JUDGE. CITY CIVIL COURT At: SECUNDERABAD**
**M.V.O.P. No. 902 OF 2025**

**Between :**
Tadaka Srikanth & another ...Petitioners
**AND**
Mr. Bandu Gedam & others ... Respondents
TO.
1. Mr. Bandu Gedam, S/o. Govinda Gedam, Aged: 55 Years, Occ: Driver of crime vehicle, R/o.H. No. 3-76, VTC-Girmpur village, P.O Girmpur, Medchal (m), K.V Rangareddy Dist. Telangana state. Pin. 501401. 2. Bandi sunitha, W/o. Bandi Atmaram Goud, Age about: 45 years, Occ: Owner of the crime vehicle, R/o. H. No. 37-269/2, Last bus stop, Jagadgiri Gutta, Near Kaman, Quthubullapur mandal, Medchal-Malkajgiri Dist. Telangana state. Pin. 500037. 3. Gajarla Lakshmi Sukanya , W/o. Not Known, age Major, Occ: Business, R/o. H. NO. 2-12, Main road Near Gramapanchayathi, Khanapuram, Venkatarampuram, Krishna, Andhra-Pradesh. Pin: 521175. As per policy Owner of the Tipper Lorry. ...Respondents

Please take notice that the above named petitioners filed the above case, claiming compensation for Death of Kavaleti Jyothi, W/o. Tadaka Srikanth, by the accident that occurred on 08.12.2025 at about 07:30 a.m, near Jothi Milk U turn, Suraram, Hyderabad, Due to the rash and negligent driving of driver of the crime Vehicle Tipper Lorry bearing No. TS 29-TB-7591 against you. You are here by summoned to appear before this Hon'ble court in person or through your counsel on: 28-10-2026, At: 10:30 A.M and the case is posted for your appearance and counter on said date, failing which, matter will be decided against you as per Law.

**"By order of the Hon'ble court"**
**Sd/-**
**J.RAMESH,**
**TS/3019/2010 M.A,LL.M,**
**Advocate,**
**M. RAVINDER,**
**Advocate.**
**Office: Plot No. 75, H. No. 1-325/82/71, Road No. 1, New Bhavani Nagar colony, Boduppal, Hyderabad, Telangana state. 92.**
**Cell. No. 9948374599,**
**Email. ramz. jramz@gamil.com.**

# ఉష
వుదయం సాహిత్యం

## విశ్వ మానవ మహాకవి గుర్రం జాషువా

సామ్రాజ్యవాదులు, జాతీయ అగ్రవర్ణ దురహంకారాల కబంధ హస్తాలలో నలిగిపోతూ ఉండే గుంటూరు జిల్లా పలనాడు ప్రాంతంలో దట్టమైన అడవుల మధ్య ఉండే ఒక మారుమూల కుగ్రామం ఒకప్పటి వినుకొండ. కులము మతము సాంఘిక దురాచారాలు వెయ్యి పడగల విషకోరలు, సామ్రాజ్య పాలన కలసి బుసలు కొడుతున్న రోజులవి. దానికి తోడు దట్టమైన అడవిలోంచి ఒక పులి వినుకొండ గ్రామం పై పడి నానా బీభత్సం చేసి మనుషులను చంపేదట! ప్రతిరోజు ప్రతిక్షణం భయం గుప్పెట్లో ప్రజలు ఉండేవారట. వలస వచ్చిన బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలకులు, రాజ్యం దోపిడి కాంక్షతోనే కొద్ది కరుణతో, వినుకొండ గ్రామ ప్రజల భయాన్ని పోగొట్టడానికి, ఎవరైనా ముందుకు వచ్చి పులిని చంపగలిగితే వారికి, పారితోషకము రాజ సత్కారం ఉంటుంది అని ప్రకటించారట. కానీ ఎవరు ధైర్యం చేయలేదట ఎవరు సాహసం చేయలేదట. ముఖ్యంగా యువకులు సాహసం చేయలేకపోయారట. చరిత్రకు కాలం ఎప్పటికప్పుడు ఒక వీరుని ఇస్తుందని, రుజువు పరిచిన సత్యంలోంచి ఒక వీరుడు ముందుకు వచ్చాడట. అయితే ఆ నునుగు మీసాల యువకుడ్ని ఒక అమ్మాయి ప్రేమించిందట. రెండు రోజులలో వివాహం కూడా జరగడానికి నిర్ణయం కూడా అయిందట! గ్రామస్తులు ఆ యువ వీరున్ని అడవికి పోవద్దని బతిమాలుతుంటే, ప్రేమించిన అమ్మాయి మాత్రం అడవికి పొమ్మని పులిని చంపి రమ్మని చెప్పిందట. వీరుడిగా తిరిగి వస్తే, ఒక సాహసి నా భర్తని గర్వంగా చెప్పుకుంటానని, అతడు మరణిస్తే కూడా ఆ వీర సాహసానికి చిహ్నంగా నేను అతని స్మృతిలో ఉంటూ జీవితాంతం అతడే నా భర్తగా భావిస్తానని, కన్న మట్టికి ప్రజల క్షేమం కోసం సాహసం చేసే వీరుడిని ప్రేమించినందుకు, ఎంతో ఆనందంగా ఉంది. అతడిని వెళ్ళనివ్వండి అడవిలోకి అని తల ఎత్తి చెప్పిందట. సూర్యుడు నెలబాలుడే కాదు, ఉద్యమ బాలుడు అయినట్లు, అడవిలోకి వీరుడు పోయిండట! ఒక రాత్రి దట్టమైన చీకటి అడవి కొమ్ముల మధ్య కొవ్వొత్తి కరిగిపోయింది. ఒక పగలు కూడా పట్టుమని వెలిసిపోయింది. వీరుడు తిరిగి రాలేదు. భయం భయంతోనే ప్రజలు సమూహంగా కాగడాల వెలుగులతో అడవిలోకి వెళ్లి చూస్తే ఏముంది! ఒకవైపు వీరుడు, మరోవైపు పులి యుద్ధ క్షేత్రంలో మృత్యోదృశ్యం. సమూహం మధ్యలోంచి వీరుడిని ప్రేమించిన స్త్రీ దృశ్య క్షేత్రంలో నిలబడి, నుదుట కుంకుమ తూర్చుకుంది. చేతుల గాజులు పగలగొట్టుకుని,



పగలబడి దుఃఖానికి నవ్వుల్ని నేర్పిందట. పంచభూతాల సాక్షిగా చూపుల్ని సముద్ర అలలు చేసి ఈ సాహసి నా సహచరుడు నా భర్త గర్వంగా తల ఆకాశానికి వెన్నెల బొమ్మ చేసి చెప్పిందట..! ఇచ్చోట..... నేలేత ఇల్లాలి నల్లపూసల సౌరూ, గంగ కలిసిపోయే.... జాషువా మధ్య గర్భ కాంతికి పురుడు పోసిందట. జాషువా ఒక్కొక్క పద్యానికి ఒక యదార్ధ గాథ ఉందని పద్యం పద్యం దుఃఖంలో గర్భం దాల్చి పురుడు పోసుకుందని, పద్యము కొత్త జననం ఈ నేల మీద శిశువై శివమెత్తిందని, తెలుగు సాహిత్య శిఖరం మీద జెండా అయిందని, చరిత్ర సంతకమైందని.... ఎప్పటివలె ఒకరోజు రేడియో ఆకాశవాణి వింటూ ఉంటే, జాషువా సమకాలికుడు సహచరుడు.. ఇచ్చోటనే... పద్యం పురుడు పోసుకున్న జన్మ రహస్యం ఇదని, వినుకొండ వీరుడి యదార్థ సాహసగాథ చెప్పాడు. అప్పటికే దుఃఖంలో నిలబడి జీవితంతో యుద్ధం చేస్తున్న నాకు, నన్ను వెంటాడుతున్న జాషువా, మరింత లోపలకి పోయి, ప్రభావ కాంతి జ్యోతి అయిండు. నా చీకటి గదిలో. స్నేహ, శత్రువు, ముఖాల నవ్వుల అంతర్ కుట్ర మీద, ఒక అగ్గిపుల్ల గీసి ఇచ్చాడు విశ్వ మానవ మహాకవి గుర్రం జాషువా.

నిన్ను దలిచి! మాట నడకకు నిలువెత్తు కులం నింపుకొని భూమంతా పుట్టలు పుట్టెలుగా పడగల నీడల కింద జాతి లోహితుడు శవం గా పడి ఉన్న ఒక దుఃఖ లోకం మీద.., ఆకాశము కూడా అంటరానిదై ఊరు అవతల ఏరు దాటి అడవిలో ఎండిన ఒంటరి చెట్టుకు ఉరి పోసుకుంటున్నప్పుడు అక్షరము అగ్నిపునీతమై పురుడుపోసుకుంది! తండ్రి జాషువా...! ఎంత దుఃఖం! ఎంత వేదన! ఎంత హైందవ రంపపు చిత్రహించకు పుట్టం పెట్టుకున్నావో.., పడగల మీది అక్షరం...... నీ పాదాల కింద మట్టి తేజం చేసుకున్నావు. తండ్రి జాషువా...! ఇచ్చోటనే నువ్వు ఇచ్చిన అక్షరం ఆయుధా అక్షయపాత్రయింది. దళిత తల్లి యుద్ధపుత్ర వీర తిలకం అయింది. తండ్రి నిన్ను దలిచి హైటెక్ హైందవ కుబుసం మీద కూడా యుద్ధం జరుగుతుంది!

చరిత్రకు కాలం ఎప్పటికప్పుడు ఒక వీరుని ఇస్తుందని, రుజువు పరిచిన సత్యంలోంచి ఒక వీరుడు ముందుకు వచ్చాడట. అయితే ఆ నునుగు మీసాల యువకుడ్ని ఒక అమ్మాయి ప్రేమించిందట. రెండు రోజులలో వివాహం కూడా జరగడానికి నిర్ణయం కూడా అయిందట! గ్రామస్తులు ఆ యువ వీరున్ని అడవికి పోవద్దని బతిమాలుతుంటే, ప్రేమించిన అమ్మాయి మాత్రం అడవికి పొమ్మని పులిని చంపి రమ్మని చెప్పిందట. వీరుడిగా తిరిగి వస్తే, ఒక సాహసి నా భర్తని గర్వంగా చెప్పుకుంటానని, అతడు మరణిస్తే కూడా ఆ వీర సాహసానికి చిహ్నంగా నేను అతని స్మృతిలో ఉంటూ జీవితాంతం అతడే నా భర్తగా భావిస్తానని, కన్న మట్టికి ప్రజల క్షేమం కోసం సాహసం చేసే వీరుడిని ప్రేమించినందుకు, ఎంతో ఆనందంగా ఉంది. అతడిని వెళ్ళనివ్వండి అడవిలోకి అని తల ఎత్తి చెప్పిందట. సూర్యుడు నెలబాలుడే కాదు, ఉద్యమ బాలుడు అయినట్లు, అడవిలోకి వీరుడు పోయిండట! ఒక రాత్రి దట్టమైన చీకటి అడవి కొమ్ముల మధ్య కొవ్వొత్తి కరిగిపోయింది.

## సింగీతం తెలుగు వారి హృదయగీతం

ప్రయోగాత్మక చిత్రాల
ప్రయోగశాల,
సినీ రంగ
ఆగమనాభిలాషులకు
పెద్ద పాఠశాల,
పరిపూర్ణ
జీవనానుభవాల
గ్రంథశాల,
నవరస విందుభోజన
పాకశాల!
తాను చేసిన ప్రతి
చిత్రం
ప్రయోగాత్మకం,
అంతే స్థాయిలో
సామాజిక
సందేశాత్మకం,
ఆయనకే సాధ్యమైన
సృజనాత్మకం,
సినీ జగతిలో
చరిత్రాత్మకం!
విభిన్నతకు వేశారు
పెద్దపీట,
వైవిధ్యభరిత కథల
కళాద్రష్ట,
సంగీత సాహిత్య
సింగారాల తోట,
సినీ ప్రియులకు
పరిచారు పూలవాట!
ఆయన సుదీర్ఘ సినీ
ప్రయాణం
అత్యంత విలువైన
జీవన ప్రమాణం,
సినీ కళామతల్లికి
భూషణం,
ప్రతి ఎదను
విహరింపజేసే పుష్పక
విమానం!
మౌనానికి మాట



నేర్పినవాడు,
ఊహకు రూపం
ఇచ్చినవాడు,
కవికి రెక్కలు తొడిగి
తెలుగు తెరకు
కొత్తలోకాలు
చూపినవాడు!
నిత్య విద్యార్థికి
నిదర్శనం,
సృజనకు చిరునామా,
సింగీతం చిత్రాలు
సినీ ప్రపంచానికి
వీలునామా!

రామిశెట్టి రామనర్సయ్య
9948162433

# మరుగున పడుతున్న మట్టి మాటలు

## పల్లె పలుకులకు పునర్జీవనం ఎప్పుడు?

ప్రట పోతే జ్ఞాపకం పోతుంది. జ్ఞాపకం పోతే చరిత్ర పోతుంది. చరిత్ర పోతే ఒక సమాజం తన మూలాలను కోల్పోతుంది. వికారాబాద్ నేల అంటే కేవలం అనంతగిరి కొండలు, తాండూరు ప్రాంతం, పంట పొలాలు, గ్రామాలు మాత్రమే కాదు. తరతరాలుగా ఈ నేలపై జీవించిన ప్రజల మాటలు, పాటలు, సామెతలు, కథలు, ఆచారాలు కూడా ఈ ప్రాంతపు అసలు గుర్తింపులో భాగమే. కానీ కాలం మారుతున్న కొద్దీ ఆ మట్టి మాటలు నెమ్మదిగా మరుగున పడుతున్నాయి. ఇది కేవలం భాషలో మార్పు కాదు. ఒక ప్రాంతపు జ్ఞాపకాలు, జీవన అనుభవాలు, సంస్కృతి మసకబారుతున్న సంకేతం.

### మట్టి మాట అంటే ఏమిటి?

ఒక ప్రాంతపు ప్రజలు సహజంగా మాట్లాడే మాటల్లో ఆ ప్రాంతపు జీవన విధానం దాగి ఉంటుంది. వ్యవసాయంతో ముడిపడిన పదాలు, పాత వృత్తులకు సంబంధించిన పదజాలం, ప్రకృతిని వివరించే స్థానిక పదాలు, కుటుంబ సంబంధాల పలుకుబడులు, పండుగలు-జాతరలకు సంబంధించిన పదాలు—ఇవన్నీ కలిసి ఒక ప్రాంతపు మాండలిక సంపదగా నిలుస్తాయి. వికారాబాద్‌లోని గ్రామాల మధ్య మాట తీరులో కనిపించే తేడాలు కూడా ఈ భాషా వైవిధ్యానికి ఉదాహరణలుగా చూడవచ్చు. ప్రామాణిక తెలుగు అవసరమే. కానీ మాండలికాన్ని తక్కువగా చూడటం సరైంది కాదు. మాండలికం భాషకు ప్రత్యామ్నాయం కాదు; ప్రజల జీవన అనుభవాల నుంచి పుట్టిన భాషా రూపం.

### అనంతగిరి కొండలు చెబుతున్న కథలు ఎక్కడ?

వికారాబాద్ పేరు చెప్పగానే అనంతగిరి కొండలు గుర్తుకొస్తాయి. ప్రకృతి, ఆలయాలు, చారిత్రక ప్రదేశాలు, మూసీ నదితో ముడిపడిన భౌగోళిక నేపథ్యం ఈ ప్రాంతానికి ప్రత్యేకతను ఇస్తాయి. అయితే ఒక పర్యాటకుడికి కనిపించేది కొండ మాత్రమే కావచ్చు. స్థానిక ప్రజలకు మాత్రం ఆ కొండ చుట్టూ తరతరాలుగా వచ్చిన జ్ఞాపకాలు, కథనాలు, నమ్మకాలు, ఆచారాలు ఉండవచ్చు. ఏ ప్రదేశానికి ఆ పేరు ఎందుకు వచ్చింది? ఏ చెట్టు గురించి పెద్దలు ఏం చెప్పేవారు? ఏ పండుగకు ఏ పాట పాడేవారు? ఏ జాతర వెనుక ఏ స్థానిక కథ ఉంది? ఇలాంటి విషయాలను సేకరించి భద్రపరచకపోతే అవి చెప్పేవారి తరంతోనే మాయమయ్యే ప్రమాదం ఉంది. అనంతగిరి ప్రాంతాన్ని కేవలం పర్యాటక కేంద్రంగా కాకుండా స్థానిక మౌఖిక చరిత్రకు కూడా ఒక భాండాగారంగా చూడాల్సిన అవసరం ఉంది.

### తాండూరు నేలలో మారుతున్న పదజాలం

తాండూరు వికారాబాద్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిన ప్రాంతం. వ్యవసాయం, కందుల ఉత్పత్తి, సున్నపురాయి ఆధారిత పారిశ్రామిక కార్యకలాపా



లు వంటి రంగాలు అక్కడి ఆర్థిక జీవనంలో భాగం. జీవన విధానం మారుతున్న కొద్దీ పాత వృత్తులు, పాత పనిముట్లు, వాటికి సంబంధించిన పదజాలం కూడా మారుతుంది. ఒకప్పుడు తరచుగా వినిపించిన వృత్తి పదం ఇప్పుడు కొత్త తరానికి తెలియకపోవచ్చు. పనిముట్టు వాడుకలో లేకపోతే దాని పేరు కూడా కనుమరుగవుతుంది. అందుకే వృత్తులు మారుతున్నాయనే కారణంతో వాటి భాషను కూడా మర్చిపోవద్దు. వృత్తి మారవచ్చు.. పదం మాత్రం చరిత్రలో మిగలాలి.

### బతుకమ్మ పాటల్లో బతికే పల్లె జ్ఞాపకం

బతుకమ్మ తెలంగాణ సంస్కృతిలో ఒక ముఖ్యమైన పండుగ. పూలతో పండుగ జరుపుకోవడం మాత్రమే కాదు.. పాట, సామూహిక భాగస్వామ్యం, స్థానిక జీవన అనుభవాలు కూడా దానిలో భాగం. వికారాబాద్ గ్రామాల్లో తరతరాలుగా పాడిన పాటలు, వాటిలోని స్థానిక పదాలు, ప్రాంతీయ పలుకుబడులు సేకరించాల్సిన అవసరం ఉంది. ఒకే పాటకు గ్రామానికో రూపం ఉంటే ఆ వైవిధ్యాన్ని కూడా నమోదు చేయాలి. పాటను పాడటం ఎంత ముఖ్యమో, దాన్ని రాబోయే తరాలకు భద్రపరచడం కూడా అంతే ముఖ్యం.

### పెద్దల నోటి మాటకు రికార్డు ఎక్కడ?

ఇది అత్యంత కీలకమైన ప్రశ్న. గ్రామాల్లోని పెద్దలకు తెలిసిన కథలు, సామెతలు, పాటలు, పాత పదాలు, గ్రామ చరిత్రకు సంబంధించిన జ్ఞాపకాలు ఎక్కువగా మౌఖికంగానే ఉన్నాయి. రేపు ఆ పెద్దలు లేకపోతే ఆ సమాచారం ఎవరి దగ్గర ఉంటుంది? ఒక పాత పాటను రికార్డు చేయకపోతే దాన్ని తర్వాత ఎవరు పాడగలరు? ఒక గ్రామం పేరు వెనుక ఉన్న స్థానిక కథను నమోదు చేయకపోతే భవిష్యత్ తరానికి అది ఎలా తెలుస్తుంది? మాండలికం చిన్నచూపు చూడాల్సిన భాష కాదుపల్లె మాట మాట్లాడుతున్న విద్యార్థి తన భాషపై సంకోచించాల్సిన పరిస్థితి రాకూడదు. ప్రామాణిక భాష నేర్చుకోవడం అవసరం. అదే సమయంలో ఇంటి భాషను గౌరవించడం కూడా అవసరం. భాషా వైవిధ్యాన్ని సరిచేయాల్సిన లోపంగా కాకుండా నమోదు చేయాల్సిన సంపదగా చూడాలి. ఒక గ్రామంలో వినిపించే పదం మరో గ్రామంలో వేరే రూపంలో ఉండవచ్చు. ఈ తేడాలు భాష బలహీనత కాదు. అవి భాష జీవించి ఉన్నదానికి గుర్తులు.

### పాఠశాలల నుంచే మొదలుకావాలి

ప్రతి పాఠశాలలో "మన ఊరి మాట-మన ఊరి పాట" కార్యక్రమం చేపట్టవచ్చు. విద్యార్థులు తమ తాతలు, అమ్మమ్మలు, గ్రామ పెద్దలను ఇంటర్వ్యూ చేయాలి. స్థానిక పదాలు, సామెతలు, పాటలు, కథలు సేకరించాలి. వాటి అర్థాలు, ఉపయోగించే సందర్భాలను నమోదు చేయాలి. పాఠశాల స్థాయిలో సేకరించిన సమాచారాన్ని మండల, జిల్లా స్థాయికి పంపే వ్యవస్థ ఉంటే విద్యార్థులే ఈ సాంస్కృతిక పరిరక్షణలో భాగస్వాములు అవుతారు.

### "మట్టి మాటల నిఘంటువు" ఎందుకు ఉండకూడదు?

జిల్లాలోని గ్రామాల నుంచి స్థానిక పదాలను సేకరించి సమగ్ర నిఘంటువు రూపొందించాలి. ప్రతి పదానికి అర్థం, ఉపయోగించే సందర్భం, ప్రాంతీయ రూపం నమోదు చేయాలి. వ్యవసాయం, పశుపోషణ, వృత్తులు, ప్రకృతి, పండుగలు, ఆహారం, కుటుంబ సంబంధాలు వంటి విభాగాలుగా వర్గీకరించాలి. వీలైన చోట ఆ పదాన్ని ఉపయోగించే పెద్దల స్వరాన్ని కూడా భద్రపరచాలి. ఇది కేవలం పుస్తకం కాదు. వికారాబాద్ జిల్లా సాంస్కృతిక భాండాగారం అవుతుంది.

### డిజిటల్ యుగాన్ని అవకాశంగా మార్చాలి

మొబైల్ ఫోన్ వల్ల స్థానిక భాషపై ప్రభావం పెరిగిందని చెప్పడం మాత్రమే సరిపోదు. అదే సాంకేతికతను భాషా పరిరక్షణకు ఉపయోగించవచ్చు. పాత పాటలను ఆడియోగా, కథలను వీడియోగా, సామెతలను లిఖిత రూపంలో, స్థానిక పదాలను డిజిటల్ నిఘంటువుగా భద్రపరచవచ్చు. యువత ఈ పనిలో ముందుకు రావాలి. ఒక స్మార్ట్‌ఫోన్‌తో ప్రారంభమైన చిన్న రికార్డు కూడా భవిష్యత్‌లో విలువైన సాంస్కృతిక ఆధారంగా మారవచ్చు.

### ప్రతి గ్రామం ఒక భాషా భాండాగారం

వికారాబాద్ జిల్లాలోని ప్రతి గ్రామానికీ తనదైన జీవన అనుభవం ఉంది. అందుకే "ఒక గ్రామం-ఒక మట్టి మాటల పుస్తకం" అనే కార్యక్రమం చేపట్టవచ్చు. ప్రతి గ్రామం నుంచి స్థానిక పదాలు, సామెతలు, పాటలు, కథలు, పాత వృత్తుల పదజాలం, గ్రామ చరిత్రకు సంబంధించిన స్థానిక కథనాలు సేకరించాలి. ఈ సమాచారాన్ని గ్రామ స్థాయి నుంచి మండల స్థాయికి, అక్కడి నుంచి జిల్లా స్థాయికి తీసుకెళ్లాలి. అప్పుడు వికారాబాద్ మొత్తం ఒక పెద్ద సాంస్కృతిక భాండాగారంగా రూపుదిద్దుకుంటుంది.

సాహితీ సంస్థలు సభలకే పరిమితం కాకూడదు

సాహితీ సంస్థలు కవిసమ్మేళనాలు, సన్మానాలతో పాటు స్థానిక సాహిత్య సేకరణపై దృష్టి పెట్టాలి. జానపద కళాకారులను గుర్తించాలి. పాత పాటలను సేకరించాలి. గ్రామీణ కథకులను పరిచయం చేయాలి. స్థానిక మాండలికంపై సదస్సులు నిర్వహించాలి. ప్రతి సంవత్సరం "వికారాబాద్ జానపద సాహిత్యోత్సవం" వంటి కార్యక్రమం నిర్వహిస్తే స్థానిక కళాకారులకు వేదికతో పాటు సాంస్కృతిక పరిరక్షణకు ఒక స్థిరమైన వేదిక ఏర్పడుతుంది.

### మీడియా కూడా తన పాత్ర పోషించాలి

స్థానిక మీడియా రోజువారీ రాజకీయాలు, ప్రమాదాలు, సమావేశాలకే పరిమితం కాకుండా సమాజపు సాంస్కృతిక సంపదను కూడా వెలుగులోకి తీసుకురావాలి. ప్రతి వారం ఒక మట్టి మాట, ఒక సామెత, ఒక పాత పాట, ఒక గ్రామ కథ, ఒక జానపద కళాకారుడి పరిచయం వంటి కథనాలు ప్రచురించవచ్చు. పత్రికల్లో ప్రచురించిన సమాచారాన్ని డిజిటల్ రూపంలోనూ భద్రపరచాలి. మీడియా ద్వారా ప్రజల్లో తమ ప్రాంతపు భాషపై గౌరవం పెంచవచ్చు.

### ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ చేపట్టాలి

స్థానిక భాష, జానపద సాహిత్యంపై జిల్లా స్థాయిలో సమగ్ర సర్వే చేపట్టాలి. గ్రామాల నుంచి సమాచారాన్ని సేకరించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలి. పాఠశాలలు, కళాశాలలు, గ్రంథాలయాలు, సాహితీ సంస్థలు, స్థానిక కళాకారులను ఒకే కార్యక్రమంతో అనుసంధానం చేయాలి. సేకరించిన సమాచారాన్ని డిజిటల్ రూపంలో భద్రపరచాలి. ప్రతి సంవత్సరం ఎంత సమాచారం సేకరించాం, ఎంత ప్రచురించాం, ఎంత డిజిటల్ చేశామనే వివరాలతో పురోగతి నివేదిక విడుదల చేయాలి.

### ఇక మాటలు కాదు.. కార్యాచరణ కావాలి

"మన సంస్కృతి పోతోంది" అని బాధపడటం మాత్రమే సరిపోదు. ఎవరు సేకరిస్తారు? ఎవరు నమోదు చేస్తారు? ఎవరు భద్రపరుస్తారు? ఎవరు ప్రచురిస్తారు? ఎవరు తర్వాతి తరానికి అందిస్తారు? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం కావాలి. ప్రతి గ్రామం నుంచి కనీసం కొన్ని స్థానిక పదాలు, సామెతలు, పాటలు, కథలు సేకరించే కార్యక్రమం ప్రారంభించాలి. మొదట చిన్న ప్రయత్నంగా కనిపించినా, అదే భవిష్యత్‌లో జిల్లా స్థాయి సాంస్కృతిక భాండాగారానికి పునాది అవుతుంది.

### పర్యాటకానికి సంస్కృతిని జోడించాలి

అనంతగిరి కొండలు, ఆలయాలు, ప్రకృతి ప్రాంతాలు వికారాబాద్‌కు పర్యాటక గుర్తింపును తెస్తున్నాయి. కానీ పర్యాటకుడికి కేవలం ప్రకృతిని చూపించడం సరిపోదు. ఆ ప్రాంతానికి సంబంధించిన స్థానిక కథలు, జానపద పాటలు, గ్రామీణ కళలు, పాత ఆచారాలు కూడా పరిచయం చేయాలి. ప్రదేశాన్ని చూపించడమే పర్యాటకం కాదు.. ఆ ప్రదేశపు కథను చెప్పడమే నిజమైన సాంస్కృతిక పర్యాటకం.

### కుటుంబమే మొదటి పాఠశాల

సంస్కృతి పరిరక్షణ ఇంటి నుంచే మొదలవుతుంది. తాతలు, అమ్మమ్మలు చెప్పే కథలను పిల్లలు వినాలి. పెద్దలు ఉపయోగించే పాత పదాల అర్థాలను పిల్లలకు చెప్పాలి. వారానికి ఒకసారి కుటుంబంలో పాత కథను, సామెతను, పాటను గుర్తుచేసుకునే అలవాటు ఏర్పడితే అది చిన్న సాంస్కృతిక పాఠశాలే. ప్రభుత్వం తర్వాత వస్తుంది. పాఠశాల తర్వాత వస్తుంది. మొదటి పాఠశాల కుటుంబమే.

### వికారాబాద్ ఉదాహరణలతో ఒక స్పష్టమైన పిలుపు

అనంతగిరి కథలు కావచ్చు. తాండూరు వృత్తి, వ్యవసాయ నేపథ్యంతో ముడిపడిన పదజాలం కావచ్చు. పల్లె పండుగల పాటలు కావచ్చు. గ్రామాల పెద్దల జ్ఞాపకాలు కావచ్చు. వీటన్నింటినీ విడివిడిగా కాకుండా ఒకే సాంస్కృతిక వారసత్వంగా చూడాలి. జిల్లా స్థాయిలో ఒక సమగ్ర "వికారాబాద్ మట్టి మాటల సాంస్కృతిక ప్రాజెక్టు" ప్రారంభించి గ్రామాల వారీగా సమాచారాన్ని సేకరించాలి. ఇది ఒకరోజు కార్యక్రమం కాకూడదు. నిరంతర ప్రక్రియగా ఉండాలి. అభివృద్ధి కావాలి. ఆధునిక విద్య కావాలి. సాంకేతికత కావాలి. కొత్త అవకాశాలు కావాలి. కానీ అభివృద్ధి పేరుతో మన మూలాలను కోల్పోవాల్సిన అవసరం లేదు. ప్రపంచంతో మాట్లాడాలి. అదే సమయంలో మన పల్లెతో మాట్లాడే భాషను మరచిపోకూడదు. ఒక పాత పదం మాయమైతే అది కేవలం ఒక పదం కోల్పోవడం కాదు. దాని వెనుక ఉన్న అనుభవం, వృత్తి, జీవన విధానం, జ్ఞాపకం కూడా మసకబారవచ్చు.

ఒక ప్రాంతపు ప్రజలు సహజంగా మాట్లాడే మాటల్లో ఆ ప్రాంతపు జీవన విధానం దాగి ఉంటుంది. వ్యవసాయంతో ముడిపడిన పదాలు, పాత వృత్తులకు సంబంధించిన పదజాలం, ప్రకృతిని వివరించే స్థానిక పదాలు, కుటుంబ సంబంధాల పలుకుబడులు, పండుగలు–జాతరలకు సంబంధించిన పదాలు—ఇవన్నీ కలిసి ఒక ప్రాంతపు మాండలిక సంపదగా నిలుస్తాయి. వికారాబాద్‌లోని గ్రామాల మధ్య మాటతీరులో కనిపించే తేడాలు కూడా ఈ భాషా వైవిధ్యానికి ఉదాహరణలుగా చూడవచ్చు. ప్రామాణిక తెలుగు అవసరమే. కానీ మాండలికాన్ని తక్కువగా చూడటం సరైంది కాదు. మాండలికం భాషకు ప్రత్యామ్నాయం కాదు; ప్రజల జీవన అనుభవాల నుంచి పుట్టిన భాషా రూపం. వికారాబాద్ పేరు చెప్పగానే అనంతగిరి కొండలు గుర్తుకొస్తాయి. ప్రకృతి, ఆలయాలు, చారిత్రక ప్రదేశాలు, మూసీ నదితో ముడిపడిన భౌగోళిక నేపథ్యం ఈ ప్రాంతానికి ప్రత్యేకతను ఇస్తాయి. అయితే ఒక పర్యాటకుడికి కనిపించేది కొండ మాత్రమే కావచ్చు. స్థానిక ప్రజలకు మాత్రం ఆ కొండ చుట్టూ తరతరాలుగా వచ్చిన జ్ఞాపకాలు, కథనాలు, నమ్మకాలు, ఆచారాలు ఉండవచ్చు. ఏ ప్రదేశానికి ఆ పేరు ఎందుకు వచ్చింది? ఏ చెట్టు గురించి పెద్దలు ఏం చెప్పేవారు? ఏ పండుగకు ఏ పాట పాడేవారు? ఏ జాతర వెనుక ఏ స్థానిక కథ ఉంది? ఇలాంటి విషయాలను సేకరించి భద్రపరచకపోతే అవి చెప్పేవారి తరంతోనే మాయమయ్యే ప్రమాదం ఉంది. అనంwతగిరి ప్రాంతాన్ని కేవలం పర్యాటక కేంద్రంగా కాకుండా స్థానిక మౌఖిక చరిత్రకు కూడా ఒక భాండాగారంగా చూడాల్సిన అవసరం ఉంది.



ఎం రవీందర్
7901503777

## ఓ యువతా! మాట కాదు మార్గం చూడు!!

గొప్ప పనులు మాటలతో
కాదు 'నిశ్శబ్దంగా చేసే
చేతలతోనే
సాధించబడతాయి"
_మహాత్మాగాంధీ.

కేవలం మాటలు చెప్పడం
సులువు కానీ ఆ మాటలను
చేతుల్లో చూపించినప్పుడే
మనిషికి నిజమైన గుర్తింపు
గొప్పతనం లభిస్తాయి.
సమాజంలో శాశ్వతంగా
నిలిచిపోయేది మన పనులు
కానీ మనం పలికే ఉత్తమ
పదాలు కావు.

మాటలు కోటలు దాటుతాయి
కానీ అడుగులు గడపైనా దాటవు
పలికే పదాలు అందంగా ఉండొచ్చు
కాని చేసే పనులే చరిత్రను మారుస్తాయి

చిలుక పలుకులు ఎన్నైనా
చెప్పొచ్చు కానీ గమ్యం చేరేది
రెక్కల కష్టంతోనే

ఆకాశాన్ని చూపిస్తూ
మురిపించడం కాదు
నేలపై నిలబడి గెలవడమే
నిజమైన గమ్యం

భాషణలు చేయడం చాలా
సులువు
ఆచరణ పెట్టడమే అసలైన
గెలుపు
శబ్దాల వేగం కంటే శ్రమించే
చేతుల వేగమే మిన్న

కలలు కనడం మొదటి అడుగైతే
కష్టపడడమే గమ్యానికి రహదారి
కాలం ఎవరికోసం ఆగదు సోదరా
మాటలు ఆపి నీ పనిని మొదలు
పెట్టు ప్రగల్భాలు కాదు ఫలితాలు
ముఖ్యం ఫలితాలే నీప్రఖ్యాతి

చేసే ప్రతి పనిలో శ్రద్ధ ఉంటే
విజయం నీ నీడలా మారుతుంది

నీ మాటలు నిన్ను గొప్పవాడిని
చేయవు
నీచేతలే సమాజంలో నీకు
గౌరవం తెస్తాయి

మాటల వెనుక దాక్కోకు సోదరా?
చేతలతో నీ సత్తా చాటుకో

ప్రపంచం నీ మాటలు
మర్చిపోవచ్చు కానీ నువ్వు
సృష్టించిన అద్భుతాలను
ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది
నువ్వు ప్రపంచాన్ని
మార్చాలనుకుంటే
మొదటఆ మార్పును
నీచేతల్లో చూపించు
_స్వామి వివేకానంద.

మాటల ఆర్భాటం తాత్కాలికం.
కానీ చేతల ప్రభావం శాశ్వతం.
విమర్శలుపొగడ్తలతో పని
లేకుండా నిశ్శబ్దంగా మన పనినీ
మనం చేసుకుంటూ పోయినప్పుడే
విజయం మనల్ని వెతుకుతూ
వస్తుంది.
మాటలు తగ్గించి చేతలు
పెంచడమే యువత ఉన్నత
శిఖరాలను అధిరోహించడానికి
ఏకైక మార్గం.



నేదునూరి కనకయ్య
9440245771

# జాతీయం-అంతర్జాతీయం



## పరిశోధనలపై దృష్టి సారించాలి

**మంత్రి నిర్మలా సీతారామన్**

**న్యూఢిల్లీ:**
ప్రపంచ ఆర్థిక అనిశ్చితుల మధ్య భారత వృద్ధిని మరింత వేగవంతం చేయాలంటే తదుపరి దశలో ప్రయివేటు పెట్టుబడులు, పరిశోధన, అభివృద్ధి వ్యయం పెరగాల్సిన అవసరం ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. న్యూఢిల్లీలో కౌటిల్య ఎకనామిక్ కాంక్లేవ్‌లో మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం భారత జిడిపిలో ఆర్‌అండ్‌డికి కేవలం 0.83 శాతం మాత్రమే ఖర్చు చేస్తుండగా.. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ వాటా 2.7 శాతంగా ఉందని తెలిపారు. దేశ ఆర్‌అండ్‌డి వ్యయంలో ప్రయివేటు రంగం వాటా కేవలం 36 శాతమేనని పేర్కొన్నారు. ఆవిష్కరణల సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రయివేటు పెట్టుబడులను విస్తరించాలన్నారు. మేడ్ ఇన్ ఇండియా దశ నుంచి ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలని కోరారు. గత నాలుగేళ్లలో ఎదురైన ఆర్థిక షాక్‌లను భారత్ సమర్థంగా అధిగమించిందన్నారు. 202627 తొలి త్రైమాసికంలో వాస్తవ జిడిపి వృద్ధి 7.8 శాతంగా నమోదైందని.. బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తులు దశాబ్దాల కనిష్ఠానికి చేరాయన్నారు. క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ కారిడార్లు, సెమీకండక్టర్లు, చిన్న మాడ్యులర్ రియాక్టర్లపై భారత్ దృష్టి సారించిందన్నారు.

## 10 కోట్ల బ్యారల్స్ చమురు, డీజిల్‌ను విడుదల చేస్తాం : జీ-7



**న్యూఢిల్లీ :**
ఇంధన సరఫరాల్లో నెలకొన్న అవరోధాల కారణంగా చమురు, డీజిల్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు 10కోట్ల బ్యా రల్స్ చమురు, డీజిల్‌ను విడుదల చేస్తానని జీ7 ప్రకటించింది. రాబోయే ఇరవై రోజుల్లో డీజిల్‌ను గణనీయంగా విడుదల చేస్తామని, అవసరమైతే అదనపు డీజిల్ విడుదలపైనా చర్చలు జరుపుతామని తెలిపింది. ఇది వెంటనే ప్రారంభమై 4నెలల పాటు కొనసాగుతుందని చెప్పింది. డీజిల్ ఎగుమతులను నిషేధిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరించిన నేపథ్యంలో జీ7 సభ్యదేశాలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. దీని ప్రకారం సభ్యదేశాల మధ్య ఇంధనం, ఇంధన ఉత్పత్తులపై ఎలాంటి ఎగుమతి ఆంక్షలు ఉండవు. జీ7లో అమెరికా, బ్రిటన్, కెనడా, జపాన్, జర్మనీ, ఇటలీ ఫ్రాన్స్ దేశాలున్నాయి. వీటి సమావేశాల్లో యూరోపియన్ యూనియన్ కూడా భాగస్వామి అవుతోంది. ఈయూ దేశాలు తమ వద్ద ఉన్న నిల్వలను మార్కెట్‌లోకి అధికంగా విడుదల చేసేందుకు అంగీకరించకపోతే అమెరికా నుంచి డీజిల్ ఎగుమతులను నిషేధిస్తానని ట్రంప్ హెచ్చరించారు. వచ్చే నెలలో అమెరికాలో మధ్యంతర ఎన్నికలు జరగనున్నందున ట్రంప్ నిర్ణయంతో ఆ దేశానికి చెందిన వినియోగదారులపై ధరల ఒత్తిడి తగ్గినప్పటికీ ఇతర ప్రాంతాలలో ధరలు పెరుగుతాయి.

## జంతర్‌మంతర్ నిరసనల్లో తీవ్ర కలకలం



**న్యూఢిల్లీ :** కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ.. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద రెండు రోజులుగా ఆందోళనకారులు నిరసనలు ) కొనసాగిస్తున్నారు. శనివారం నిరసన జరుగుతున్న సమయంలో పోలీసు సిబ్బంది తమను లైంగికంగా వేధించారని ముగ్గురు మహిళా జర్నలిస్టులు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకుంటున్న సమయంలో అక్కడ మహిళా సిబ్బంది ఎవరూ లేకపోవడాన్ని ప్రశ్నించినందుకు ఏసీపీ వివేక్ భగత్ తమను అసభ్యంగా తాకుతూ వెనక్కి నెట్టేశారని ఆరోపించారు. దీంతో వారి ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ కోసం ఈ ఫిర్యాదులను క్రైమ్ బ్రాంచ్ అధికారుల )కు బదిలీ చేసినట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు.
మరోవైపు ఈ నిరసనల్లో ఇప్పటి వరకు వెయ్యి మందికిపైగా నిరసకారులను అదుపులోకి తీసుకొని, కొన్ని గంటల అనంతరం వదిలేసినట్టు పోలీసులు వెల్లడించారు. ఆందోళనలపై నిషేధం ఉన్నప్పటికీ సామాజిక సంస్థలు, విద్యార్థి సంఘాల నేతలు జంతర్‌మంతర్ వద్ద గుమిగూడడంతో ఈ చర్యలు తీసుకున్నామన్నారు. ఆదివారం కూడా నిరసనలు కొనసాగే అవకాశం ఉండడంతో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు. సీఈసీ పదవి నుంచి జ్ఞానేశ్‌కుమార్ వైదొలగకపోతే ఈనెల 10న ఢిల్లీలో శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వెల్లడించింది. దేశప్రజలంతా ఈ నిరసలో పాల్గొనాలని పిలుపునిచ్చింది.

## పాఠశాలల దుస్థితిపై రోడ్డెక్కిన విద్యార్థులు

- **ఫ్రాన్స్‌లో నిరసనలు... వేలాది మంది అరెస్ట్**
- **మూతపడిన 400 స్కూల్స్**
- **ఆందోళనల ఉధృతికి విద్యార్థి సంఘాల నిర్ణయం**

**పారిస్ :**
పాఠశాలల దుస్థితిపై ఫ్రాన్స్‌లో కొనసాగుతున్న నిరసనలు హింసాత్మకంగా మారుతున్నాయి. ఈ క్రమంలో విద్యార్థులు, పోలీసుల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఈ ఘర్షణల్లో ఉపాధ్యాయులు, పోలీసులు సహా పలువురు గాయపడ్డారు. కొన్ని రోజులుగా జరుగుతున్న నిరసనల కారణంగా వేలాది మంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉద్రిక్తతలను నివారించేందుకు ఓ వైపు అధికారులు ప్రయత్నిస్తుండగా మరోవైపు దేశవ్యాప్తంగా శుక్రవారం 400కు పైగా పాఠశాలలను మూసివేశారు. తూర్పు ఫ్రాన్స్‌లోని స్ట్రాస్‌బర్గ్‌లో యువకులు బారికేడ్లు నిర్మిస్తుండగా పోలీసులు భాష్ప వాయుగోళాలు ప్రయోగించారు. లియోన్ సహా పలు నగరాల్లో శాంతియుతంగా ప్రదర్శనలు జరుగుతున్నాయి. దేశంలో విద్యారంగం వనరుల కొరతతో కూనారిల్లిపోతోందని, ఆ రంగంపై అధిక భారం పడుతోందని ఆందోళన కారులు ఆరోపించారు. తరగతి గదులలో రద్దీ అధికంగా ఉన్నదని, గైర్హాజరు అయిన ఉపాధ్యాయుల స్థానంలో కొత్తవారిని నియమించడం లేదని, పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నా యని వారు విమర్శించారు.

**ఎలుకలు, బద్దింకల స్వైరవిహారం**

పారిస్ శివారులోని పాంటిన్‌లో నిరసన తెలుపుతున్న పదిహేనేండ్ల కేసియా రాయిటర్స్ వార్తా సంస్థ



ప్రతినిధితో మాట్లాడుతూ 'ఒక్కో తరగతిలో 35 మంది ఉన్నాము. తరగతి గదిలో సరిపడా కుర్చీల్లేవు. అందరూ భోజనం చేసేందుకు గంట విరామం ఇస్తున్నారు. ఇది ఏ మాత్రం సరిపోవడంలేదు' అని వాపోయింది. తరగతి గదులలో రద్దీ, ఉపాధ్యాయుల కొరత, పాఠశాల భవనాల శిథిలావస్థ వంటి సమస్యలతో పాటు తరగతి గదులలో ఎలుకలు, బద్దింకలు స్వైరవిహారం చేస్తున్నాయి. పారిస్‌లో ప్రారంభమైన నిరసనలు దేశంలోని సుమారు 500 పాఠశాలలకు విస్తరించాయి. బోర్డో, నాంటెస్, మార్సెయిల్ వంటి నగరాలలో విద్యార్థులు పాఠశాలల గేట్లను దిగ్బంధించారు. కొన్నిచోట్ల అగ్ని ప్రమాదాలు కూడా జరిగాయి. మార్సెయిల్‌లో ఓ ఫైరింజన్‌కు నిరసనకారులు నిప్పు పెట్టారు. ఇప్పటివరకూ సుమారు ఐదు వేల మందికి పైగా ఆందోళనకా రులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా నిరసనలు ప్రజల భద్రతకు ముప్పుగా మారాయని న్యాయ శాఖ మంత్రి గెరాల్డ్ దార్మానిన్ చెప్పారు. ఇదిలావుండగా హైస్కూలు విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా మంగళవారం పలు విద్యార్థి సంఘాలు దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టబోతున్నాయి. యూనివర్సిటీలు, హైస్కూల్స్‌లో బంద్ పాటించాలని ఆ సంఘాలు పిలుపునిచ్చాయి. అదే రోజు ఉపాధ్యాయులు కూడా సమ్మెకు సిద్ధమవుతున్నారు. నిరసనలు తగ్గుముఖం పట్టే అవకాశాలు లేకపోవడం, హింస కొనసాగడంతో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. తల్లిదండ్రులు, సిబ్బందితో విద్యా శాఖ మంత్రి ఎడ్వర్డ్ జెఫ్రే జరిపిన చర్చలు ఫలించలేదు. శాంతియుత నిరసనలు కొనసాగించాలని విద్యార్థి ప్రతినిధులు నిర్ణయించారు. హింసతో తమకు సంబంధం లేదని వారు స్పష్టం చేశారు. బలప్రయోగాన్ని తప్పుపట్టిన అమ్నెస్టీ మైనర్లపై లాఠీఛార్జీ చేయడం, భాష్పవాయు గోళాలను ప్రయోగించడం వంటి చర్యలకు పాల్పడడాన్ని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ తప్పుపట్టింది. బలప్రయోగానికి స్వస్తి చెప్పి చర్చలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. కాగా పోలీసు హింసపై మూడు విచారణలు జరుపుతున్నామని ఆంతరంగిక మంత్రిత్వ శాఖ తెలియజేసింది.

**ఆందోళనకు రాజకీయ రంగు**

దేశంలోని పలు ప్రాంతాలలో మూసివేసిన పాఠశాలల ఎదుట ప్రజలు గుమిగూడడాన్ని అధికారులు నిషేధించారు. అయితే ఈ చర్య పెద్దగా ప్రభావం చూపడం లేదు. ఇదిలావుండగా విద్యార్థుల ఆందోళన రాజకీయ రంగు పులుముకుంటోంది. అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్ష 'లా ఫ్రాన్స్ ఇన్సౌమిస్' (ఎల్ఎఫ్ఐ) విద్యార్థులను రెచ్చగొడుతోందని ప్రధాని సెబాస్టియన్ లెకోర్ను ప్రభుత్వం ఆరోపించింది. విద్యార్థుల కారణంగా జరిగిన నష్టానికి తల్లిదండ్రులను బాధ్యులను చేసి, వారి నుంచి డబ్బు రాబట్టాలని ఓ మంత్రి ప్రతిపాదించగా ప్రతిపక్ష ఫ్రాన్స్ అన్‌బౌడ్ పార్టీ మండిపడింది. ఇది అసంబద్ధ ప్రతిపాదన అని ధ్వజమెత్తింది. హింసను సమర్థిస్తున్నట్లు కన్పిస్తున్న ఎన్నికల అధికారులపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ విమర్శలు కురిపించారు.

## అవి డ్రగ్ ఫ్యాక్టరీలు

- **ఇరాన్ అణు కర్మాగారాలపై ట్రంప్**
- **డొనాల్డ్ వాదనపై నిపుణుల విస్మయం**

**వాషింగ్టన్ :**
ఇరాన్ అణు కర్మాగారాలపై రెండు రోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్య అమెరికన్లనే కాకుండా నిపుణులను కూడా ఆశ్యర్యానికి గురి చేస్తున్నాయి. గత సంవత్సరం అమెరికా దాడికి గురైన మూడు ఇరాన్ అణు కర్మాగారాలను గురించి ట్రంప్ అనేక విషయాలు చెప్పారు. వాటిని డ్రగ్ కర్మాగారాలుగా అభివర్ణించారు. ట్రంప్ వ్యాఖ్యపై కార్నెగీ ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్‌కు చెందిన న్యూక్లియర్ పాలసీ ప్రోగ్రామ్ సహడైరెక్టర్ జేమ్స్ ఆక్టన్ స్పందిస్తూ 'నాకు తెలిసినంత వరకూ ట్రంప్ చెబుతున్న ఫోర్డో కర్మాగారాన్ని మాదకద్రవ్యాల ఉత్పత్తి కోసం ఉపయోగించడం లేదు. అసలు నేను ఇప్పటి వరకూ అలాంటి ఆరోపణ ఏదీ వినలేదు' అని చెప్పారు. కాగా ట్రంప్ వ్యాఖ్యపై వివరణ ఇచ్చేందుకు అధ్యక్షభవనం నిరాకరించింది.సమర్థనకు తంటాలువాస్తవానికి అంతకుముందే కరేబియన్‌లో అక్రమ మాదకద్రవ్యాల రవాణాను అరికట్టడానికి తాను చేస్తున్న ప్రయత్నాలను, వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోను పట్టుకున్న ఉదంతాన్ని ఆ ర్యాలీలో ట్రంప్ వివరించారు. ఆ వెంటనే ఇరాన్‌లోని డ్రగ్ ఫ్యాక్టరీలపై బాంబులు పడ్డాయని చెప్పారు. వెనిజులా ప్రస్తావన తెచ్చిన వెంటనే ఇరాన్ పేరు తీయడంతో పొరబాటుగా అలా మాట్లాడారా అన్న అభిప్రాయం కలుగుతుంది. అయితే తమ మాటలో తడబాటు దొర్లినప్పటికీ దానిని అంగీకరించేందుకు ట్రంప్ ఇష్టపడరు. కాబట్టే డ్రగ్ ఫ్యాక్టరీలు అనే తప్పుడు వాదనను సరిదిద్దడానికి బదులుగా ఆయన దానినే పునరుద్ఘాటించారు. అంతేకాక అదనంగా మూడు వాక్యాలను కూడా అల్లుకొచ్చారు. ట్రంప్ వ్యాఖ్యలను ఎప్పుడూ వెనకేసుకొచ్చే శ్వేతసౌధం ఈసారి దానిని సమర్థించకపోవడం విశేషం.
ఏం జరిగిందంటే...తను చెబుతున్నది వాస్తవమా లేక అవాస్తవమా అనే విషయాన్ని పట్టించుకోకుండా తన వాదననే గట్టిగా సమర్థించుకోవడం ట్రంప్‌కు అలవాటే. చేసిన తప్పిదాన్ని అంగీకరించడం ఆయనకు సుతరామూ ఇష్టం ఉండదు. అసలు జరిగిందేమిటంటే...ట్రంప్ గురువారం వైట్‌హౌస్ నుంచి టెక్సాస్‌లోని ఓ కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉంది. వాతావ



రణం అనుకూలంగా లేకపోవడంతో విమానంలో కాకుండా కారులో ప్రయాణించారు. దీంతో ఒక్లహోమాలో ర్యాలీకి రెండు గంటల ఆలస్యంగా చేరుకున్నారు. ఇరాన్‌ను ఎదుర్కోవడానికి తాను చేస్తున్న ప్రయత్నాలను ట్రంప్ ఆ ర్యాలీలో ఏకరువు పెట్టారు. గత సంవత్సరం 'ఆపరేషన్ మిడ్‌నైట్ హామర్' అనే సంకేతనామంతో ఇరాన్ అణు కర్మాగారాలపై దాడి చేసిన స్టెల్త్ బాంబర్లను గురించి వివరించారు. 'తెల్లవారుజామున ఒంటిగంటకు చిమ్మచీకటిలో బాంబు దాడులు జరిగాయి.
ప్రతి ఒక్క బాంబు నేరుగా డ్రగ్ ఫ్యాక్టరీలలోకి దూసుకుపోయింది.
వాళ్లు చేస్తున్నది అదే....అణు, డ్రగ్స్ వ్యాపారం చేస్తున్నారు. డ్రగ్ ఫ్యాక్టరీలు కమ్ న్యూక్లియర్ ఫ్యాక్టరీలపై తీవ్రమైన దాడులు జరిగాయి' అని చెప్పుకొచ్చారు.

## తీరని 'తేజస్' కొరత: ఒకవైపు స్క్వాడ్రన్ల తగ్గింపు.. మరోవైపు హెచ్‌ఏఎల్ జాప్యం!

- **ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ ఆందోళన**

**దిల్లీ:**
యుద్ధ విమాన స్క్వాడ్రన్ల సంఖ్య తరిగిపోతున్నప్పటికీ తేజస్ జెట్‌ల అందజేతలో అసాధారణ జాప్యం భారత వాయుసేనకు నష్టం కలిగిస్తోందని ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ శనివారం ఆందోళన వ్యక్తంజేశారు. దేశ భద్రతలో వైమానిక యుద్ధతంత్రం అతికీలకంగా మారిన నేపథ్యంలో తేజస్ విమానాలను సత్వరం వాయుసేనకు అందించాల్సిన అవసరం పెరిగిందని ఆయన విలేకరులకు తెలిపారు. రానున్న కొన్ని సంవత్సరాల్లో వాయుసేన ఏటా కనీసం 36 నుంచి 40 ఫైటర్ జెట్లను సమకూర్చుకోవాల్సి ఉందన్నారు. దేశీయంగా రూపొందించిన తేజస్ మార్క్1ఏ యుద్ధ విమానాలను, బహుళ ప్రయోజన యుద్ధవిమాన (ఎంఆర్‌ఎఫ్ఏ) ప్రాజెక్టు కింద రఫేల్ జెట్‌లను రంగంలోకి దించితే పరిస్థితి మెరుగుపడుతుందని అమర్‌ప్రీత్ అన్నారు.
హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)



సంస్థ జెట్ విమానాల సరఫరాలో చోటు చేసుకుంటున్న జాప్యంపై అడిగిన ఒక ప్రశ్నకు బదులిస్తూ.. ''అది మనకు నష్టం కలిగిస్తోంది'' అని వాయుసేనాధిపతి చెప్పారు. 2021 ఫిబ్రవరిలో రక్షణ శాఖ రూ.48 వేల కోట్ల విలువ చేసే 83 తేజస్ ఎంకే1ఏ యుద్ధవిమానాల కొనుగోలుకు హెచ్‌ఏఎల్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం 2024 మార్చి కల్లా తొలివిడత జెట్‌లు వాయుసేనకు అందాలి. హెచ్ఏఎల్ ఇప్పటివరకూ ఒక్క విమానాన్నీ సరఫరా చేయలేకపోయింది. వాయుసేనలో మొత్తం 42 యుద్ధవిమాన స్క్వాడ్రన్‌లకు ప్రభుత్వం అనుమతినివ్వగా.. ప్రస్తుతం స్క్వాడ్రన్‌ల సంఖ్య 29కి పడిపోయింది. తేజస్ మార్క్1ఏ విమానాలు, మార్క్2, అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (అమ్కా)ల కోసం వాయుసేన ఎదురుచూస్తోందని వైమానిక దళాధిపతి తెలిపారు.
పాక్ చేతికి ఐదోతరం యుద్ధ విమానాలు!
ఐదోతరం ఫైటర్ జెట్ విమానాల విషయంలో చైనా, పాకిస్థాన్‌లు పరస్పర సహకారంతో ముందుకు సాగుతున్నాయన్న వార్తలు ఆందోళనకరమని ఎయిర్ చీఫ్ మార్షల్ అన్నారు. అయితే ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు భారత వాయుసేనకు సామర్థ్యం ఉందని స్పష్టం చేశారు.

**ఏఐ ఆధారిత దళం ఉండాలి**

భారత్‌కు ఉన్న మొత్తం సైనిక బలంలో వైమానిక శక్తి కీలకమైనదని, కృత్రిమ మేధ సాయంతో దానిని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని అమర్‌ప్రీత్ చెప్పారు. ఐఏఎఫ్‌ను ఆధునీకరించడం గురించి మాట్లాడుతూ.. భవిష్యత్ యుద్ధాలను ఎదుర్కొనేందుకు కృత్రిమ మేధ ఆధారిత దళం ఉండాలని ఆయన పేర్కొన్నారు.



## విరిగిన రడ్డర్‌తోనే సురక్షిత ల్యాండింగ్.

**దుబాయ్, అక్టోబర్ 4:**
( ఫ్లైదుబాయ్ విమానం 'FZ1073' ల్యాండ్ కావడం ఏవియేషన్ అద్భుతం. దీనిలోని కోపైలట్ హమామ్ అల్‌హమ్మామీ.. కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై 'క్రాష్‌యాక్స్' (అత్యవసర సమయంలో వాడే గొడ్డలి)తో విచక్షణా రహితంగా దాడి చేయడంతో విమానం అసాధారణ స్థాయిలో అదుపు తప్పినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ డేటా విశ్లేషణలో తేలింది. ఒక దశలో దాదాపు నిటారుగా విమానం భూమి దిశగా దూసుకొచ్చినట్లు తేలింది. ఆ తర్వాత విమానం తిరిగి అదుపులోకి వచ్చినా.. భౌతికంగా దెబ్బతినడంతో.. ల్యాండింగ్ సవాలుగా మారిందని అమెరికా మీడియా సంస్థ ఓ కథనంలో వెల్లడించింది.

**దాదాపు శబ్ద వేగాన్ని అందుకుని..**

ఫ్లైదుబాయ్ 'FZ1073'.. బోయింగ్ 737మ్యాక్స్ శ్రేణికి చెందిన భారీ విమానం. ఇది అత్యధికంగా మ్యాక్ 0.82 వేగాన్ని మాత్రమే తట్టుకోగలదు. ఇంతకు మించిన వేగంతో ప్రయాణిస్తే విమానం భౌతికంగా దెబ్బతినే ప్రమాదం పొంచి ఉంది. ఈ విమానం దాడి సమయంలో.. 0.96 మ్యాక్ వేగంతో (దాదాపు 1 మ్యాక్ అంటే శబ్ద వేగానికి సమానంగా) భూమి దిశగా రావడం మొదలుపెట్టిందని 'ఫ్లైట్‌రాడార్24' డేటా వెల్లడించింది. ఈ వేగం ఇంకా ఎక్కువే ఉన్నట్లు తెలుస్తోంది. బ్లాక్‌బాక్స్ వివరాలు వస్తే.. కచ్చితమైన వేగం తెలుస్తుంది.

**92 సెకన్లలో 17,000 ఎత్తు తగ్గి..**

విమానం కిందకు పడిపోయే సమయంలో కొన్ని రెట్ల జీఫోర్స్ (గురుత్వాకర్షణ శక్తి)కి లోనైంది. ఫలితంగా విమానం దిశను మార్చుకునేందుకు వినియోగించే రడ్డర్ (rudder) దెబ్బతింది. విమానం ముక్కుభాగం.. సాధారణంగా ల్యాండింగ్ సమయంలో 3 డిగ్రీల కోణంలో కిందకు దిగుతుంది. కానీ, ఫ్లైదుబాయ్ 'FZ1073' మాత్రం అక్టోబర్ 1న 39 డిగ్రీల కోణంలో భూమి దిశగా దూసుకెళ్లింది. కేవలం 92 సెకన్లలో 17,000 అడుగుల కిందకు పడిపోయింది. ఆ సమయంలో విమానం బాడీపై సాధారణ జీఫోర్స్ కంటే మూడు రెట్లు అదనంగా పడింది. సాధారణంగా 737 మ్యాక్స్ రకం విమానం 2.5 పాజిటివ్ జీఫోర్స్ మాత్రమే అత్యధికంగా తట్టుకోగలదు. ఏ కమర్షియల్ ఫ్లైట్ అయినా ఇంతే. విమానం దిశమార్చుకోవాలంటే అత్యధికంగా 230 నాట్స్ వరకు వేగంలో మాత్రమే సాధ్యం. కానీ, విమానం 0.96 మ్యాక్ వేగంలోకి వెళ్లడంతో దానిని సాధారణ స్థితికి తీసుకు రావడం కూడా సవాలే.

**అదుపులోకి వచ్చినా.. డ్యామేజీ తప్పలేదు**

విమానంలో ఉన్న డెడ్‌హెడ్ పైలట్స్ (విధులు ముగించుకొని.. లేదా వేరే చోట్ల విధులకు వెళుతున్నవారు) కంట్రోల్స్‌ను అదుపు చేసినా.. దాని తోక వద్ద రడ్డర్ దెబ్బతింది. వీరు సౌదీలోని తబుక్ విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్‌కు వెళుతున్న సమయంలో కూడా.. హఠాత్తుగా 500 అడుగుల ఎత్తు తగ్గిపోవడం వంటి ఘటనలు చోటు చేసుకొన్నాయి.

## ఇండోనేషియాలో 5.2 తీవ్రతతో భూకంపం



ఇండోనేషియాలో ఆదివారం తెల్లవారుజామున భూకంపం సంభవించింది.
భారత కాలమానం ప్రకారం ఉదయం 5:07 గంటలకు ప్రకంపనలు చోటుచేసుకున్నట్లు భారత భూకంప అధ్యయన కేంద్రం (NCS) వెల్లడించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 5.2గా నమోదైంది. భూకంప కేంద్రం భూ ఉపరితలం నుంచి 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. భూకంప ప్రకంపనలతో స్థానికులు భయాందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించినట్లు సమాచారం లేదు. భూకంపం కారణంగా సునామీ ముప్పు కూడా లేదని అధికారులు స్పష్టం చేశారు. పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

## పెట్రోల్ మంట.. డీజిల్ బాదుడు!

- **నయారా ఎనర్జీ భారీగా ధరల పెంపు**

**న్యూఢిల్లీ :**
భారత్‌లో ఇంధన ధరల మంట మళ్లీ మొదలైంది. ప్రయివేటు ఇంధన రిటైలర్ నయారా ఎనర్జీ శనివారం నుంచి పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. లీటరు పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 చొప్పున పెంచేసింది. పశ్చిమాసియాలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఇంధన సరఫరాపై ఆందోళనలతో అంతర్జాతీయ చమురు మార్కెట్లలో ధరలు పెరగడం రిటైలర్లపై ఆర్థిక ఒత్తిడిని పెంచుతోందని ఆ వర్గాలు తెలిపాయి. ధరల పెంపు నయారా ఎనర్జీకి ఇదే తొలిసారి కాదు. ఈ ఏడాది మార్చి 26న కూడా పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 పెంచింది. ఆ సమయంలో పెట్రోల్ ధర రూ.100.71, డీజిల్ ధర రూ.91.31కు చేరాయి.




అయితే పశ్చిమాసియా ఉద్రిక్తతలు తగ్గి చమురు ధరలు దిగిరావడంతో జులై 1న ఈ పెంపును వెనక్కి తీసుకుంది. ఇప్పుడు మరోసారి ధరలు పెంచింది. దేశంలో ఈ సంస్థ 7,108 బంకులను కలిగి ఉంది. రిలయన్స్‌బిపి 2,304 బంకులను నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న 1,04,137 పెట్రోల్ బంకుల్లో 90 శాతానికి పైగా వాటా కలిగిన ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం కంపెనీలు ధరలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటాయో వేచి చూడాలి.

## ఆకాశాన్నంటుతున్న ఇళ్ల అద్దెలు..

- **స్పెయిన్ వ్యాప్తంగా నిరసనలు**
- **ప్రభుత్వం మద్దతిచ్చినా పార్లమెంట్‌లో ఓటమి**
- **దశాబ్ద కాలంలో రెట్టింపైన అద్దెలు**
- **స్పెయిన్ వ్యాప్తంగా నిరసనలు**
- **ప్రభుత్వం మద్దతిచ్చినా పార్లమెంట్‌లో ఓటమి**
- **దశాబ్ద కాలంలో రెట్టింపైన అద్దెలు**

**మాడ్రిడ్ :**
అద్దెకుండేవారి రక్షణలను బలోపేతం చేయడానికి ఉద్దేశించిన రెండు ప్రభుత్వ చర్యలను పార్లమెంట్ తిరస్కరించడంతో స్పెయిన్ వ్యాప్తంగా తాజాగా ఆందోళనలు తలెత్తాయి. రాజధాని మాడ్రిడ్ సహా పలు నగరాల్లో శనివారం వేలాదిగా ప్రజలు వీధుల్లోకి వచ్చారు. 50 నగరాల్లో నిరసనలు జరిగాయి. మాడ్రిడ్‌లోజరిగిన నిరసన ప్రదర్శనలో 70వేల మందికి పైగా ఆందోళనకారులు పాల్గొన్నారు. ప్రధాని పెడ్రో సాంచెజ్ మైనారిటీ సోషలిస్టు ప్రభుత్వం ఈ చర్యలకు మద్దతిచ్చినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ చర్యలు గనక



ఆమోదం పొందినట్లైతే అద్దె కాంట్రాక్టులు ఆటోమేటిక్‌గా పునరద్దరణ జరిగేవి. బలహీనులైన అద్దెదారులను ఖాళీ చేయించకుండా వుండేలా బలమైన రక్షణలు కల్పించేవి, తమ పెట్టుబడులతో చవకగా ఆస్తులను కొనుగోలు చేసి, వాటిని అద్దెలకు ఇవ్వడంపై ఆంక్షలు విధించబడేవి. కానీ పార్లమెంట్ వాటిని తిరస్కరించింది. మాడ్రిడ్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో మారికార్మెన్ అబస్కల్ (87) 70సంవత్సరాల నుండి నివసిస్తున్నారు. అయితే ఆమె నివసిస్తున్న ఆ అపార్ట్‌మెంట్‌ను ఒక ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ కొనుగోలు చేసింది. ఆ తర్వాత ఆమె ఇంటి అద్దెను 275శాతం పెంచడానికి సిద్ధమైంది. ఈ సంఘటనతో ఒక్కసారిగా ప్రజల్లో ఆగ్రహాందోళనలు పెల్లుబికాయి. ఈ నిరసనలతో కొత్త యజమానులు ఆమెను తక్కువ అద్దెకే నివసించేందుకు అనుమతించడానికి అంగీకరించారు.

ఈ సంఘటన నేపథ్యంలో టెనంట్స్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు 50కి పైగా నగరాల్లో ప్రదర్శనలు జరిగాయి. రాజకీయ పార్టీలు ప్రజల డిమాండ్లను పట్టించుకోవడం లేదని వారు నిరసించారు. తాజాగా ప్రభుత్వం తలపెట్టిన చర్యలు కూడా పార్లమెంట్‌లో వీగిపోవడంతో సాంచెజ్ ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. సత్వర ఎన్నికలు నిర్వహించాలంటూ ప్రతిపక్షనేత అల్బర్టో నూనెజ్ పిలుపిచ్చారు. స్పెయిన్‌లో ఇళ్ళ అద్దెలు ప్రధానమైన ఆందోళనగా వుంది. గత దశాబ్ద కాలంలో సగటున అద్దెలు రెట్టింపయ్యాయి. ఇళ్ళ ధరలు 90శాతం పెరుగుతున్నాయి.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## 60 వేల మంది విద్యార్థులకు అల్పాహారం



**మునగాలలో రూ.9.60 కోట్లతో కమ్యూనిటీ కిచెన్ అక్టోబర్ 6న శంకుస్థాపన చేయనున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**సూర్యాపేట, అక్టోబర్ 04, (వుదయం ప్రతినిధి):**
సూర్యాపేట జిల్లాలోని 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సుమారు 60 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించేందుకు మునగాల మండలంలో రూ. 9.60 కోట్లతో అత్యాధునిక కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు చేయనున్నారు.
ఈ ప్రాజెక్టుకు అక్టోబర్ 6న మధ్యాహ్నం 12 గంటలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు.
మునగాల మండలంలో జాతీయ రహదారి పక్కన, మునగాలమాధారం మధ్య ఎంపిక చేసిన స్థలంలో ఈ కేంద్రీకృత వంటశాలను నిర్మించనున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులకు ఒకే కేంద్రం నుంచి ఆహారం తయారు చేసి, ప్యాకింగ్, రవాణా, పంపిణీ చేసే విధంగా ప్రాజెక్టును రూపొందిస్తున్నారు. దేశంలోనే అత్యాధునిక సదుపాయాలతో ఈ వంటశాలను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.
సింగరేణి విరాళంతో ప్రాజెక్టు
కమ్యూనిటీ కిచెన్ నిర్మాణానికి సింగరేణి కంపెనీ రూ. 9.60 కోట్ల విరాళం అందించింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి చేసిన విజ్ఞప్తుల మేరకు సింగరేణి ఈ నిధులను సమకూర్చినట్లు మంత్రి తెలిపారు. విద్యార్థులకు నేరుగా ప్రయోజనం చేకూర్చే ఈ కార్యక్రమానికి సహకరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సింగరేణి కంపెనీకి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి కృతజ్ఞతలు తెలిపారు.
1,029 విద్యాసంస్థలకు ఆహార సరఫరా
హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు.
జిల్లాలోని సుమారు 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న దాదాపు 60 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం అల్పాహారం తయారు చేసి సరఫరా చేయడం కమ్యూనిటీ కిచెన్ ప్రధాన ఉద్దేశం. అవసరాన్ని బట్టి ఎంపిక చేసిన కొన్ని జూనియర్ కళాశాలలకు మధ్యాహ్న భోజనం అందించే అంశాన్ని కూడా ప్రణాళికలో చేర్చారు.
నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యం
వంటశాలలో ఆహార తయారీ, ప్యాకింగ్, రవాణా, పంపిణీ కోసం సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఆహార నాణ్యత, పోషక విలువలు, పరిశుభ్రత, సురక్షిత నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. విద్యార్థులకు పాఠశాల వేళల్లో పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, సంక్షేమానికి తోడ్పడేలా ఈ కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు.
పనులపై మంత్రి పర్యవేక్షణ
కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం, నిర్వహణ, ఆహార తయారీ, విద్యాసంస్థలకు సరఫరా వంటి అంశాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వయంగా పర్యవేక్షించనున్నారు. కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, సంబంధిత అధికారులు, అమలు భాగస్వాములతో సమన్వయం చేస్తూ ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షిస్తానని మంత్రి తెలిపారు.

## లివర్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

### క్లినికల్ డైరెక్టర్, కాలేయ వైద్య నిపుణులు డాక్టర్ నవీన్ పోలవరపు



**ఫ్యాటీ లివర్, హెపటైటిస్‌తో క్యాన్సర్ ప్రమాదం: పాంక్రియాస్ స్పెషలిస్ట్ డాక్టర్ కృష్ణ భరద్వాజ్ ముందస్తు రక్త పరీక్షలతో ప్రాణాలు కాపాడుకోవచ్చు.!**

**హనుమకొండ, అక్టోబర్ 04 (వుదయం ప్రతినిధి) :**
ప్రపంచవ్యాప్తంగా శర వేగంతో పెరుగుతున్న క్యాన్సర్లలో లివర్ క్యాన్సర్ ఒకటిగా మారుతోందని యశోద హాస్పిటల్ హైటెక్ సిటీకి చెందిన క్లినికల్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, లివర్ వ్యాధుల నిపుణుడు డాక్టర్ నవీన్ పోలవరపు, పాంక్రియాస్ స్పెషలిస్ట్ డాక్టర్ కృష్ణ భరద్వాజ్ తెలిపారు. హనుమకొండలో ప్రత్యేక విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం క్లినికల్ డైరెక్టర్, డాక్టర్ నవీన్ పోలవరపు మాట్లాడుతూ 'నిశ్శబ్ద హంతకులు'గా ఫ్యాటీ లివర్, హెపటైటిస్ బి, సి వైరస్ లు వస్తున్నాయని అన్నారు. అధిక మద్యపానం వల్ల లివర్ తీవ్రంగా దెబ్బతింటోందని, ముదిరిపోయే వరకు వ్యాధి లక్షణాలు బయట పడక చాలామందికి తెలియదని వారు హెచ్చరించారు. కాళ్లు వాపులు, పొట్ట ఉబ్బరం, లివర్ క్యాన్సర్ వంటి లక్షణాలు ఆలస్యంగా వెలుగులోకి వస్తాయని వైద్యులు వెల్లడించారు. క్రమం తప్పకుండా రక్తపరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకోవడం ద్వారా ముందస్తుగానే వ్యాధిని గుర్తించి వ్యాక్సినేషన్, సరైన చికిత్సలతో ప్రాణాపాయాన్ని తగ్గించవచ్చని సూచించారు.
కొలెస్ట్రాల్, మధుమేహం, థైరాయిడ్ సమస్యలను అదుపులో ఉంచుకోవాలని, మద్యపానం మానడం లేదా తగ్గించడం ద్వారా లివర్, ప్యాంక్రియాస్ దెబ్బతినకుండా కాపాడుకోవచ్చని వారు తెలిపారు. పాంక్రియాస్ స్పెషలిస్ట్ డాక్టర్ కృష్ణ భరద్వాజ్ పెగ్రాజ్ మాట్లాడుతూ అనారోగ్యకరమైన ఆహార అలవాట్ల వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలు పెరుగుతున్నాయని, మలవిసర్జనలో మార్పులు, రక్తస్రావం, పొట్ట ఉబ్బరం వంటి లక్షణాలు రెండు వారాలకు మించి ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆయన తెలిపారు.
కొలనోస్కోపీ పరీక్ష ద్వారా పేగుల్లో ఏర్పడే పాలిప్స్‌ను తొలిదశలోనే గుర్తించి తొలగించడం వల్ల పెద్దపేగు క్యాన్సర్‌ను నివారించవచ్చని వివరించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) 2030 నాటికి హెపటైటిస్ నిర్మూలన లక్ష్యంగా చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్ సిబ్బంది విజయ్ కుమార్, అనుదీప్ పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులను రోడ్డున పడేయడం సరికాదు



**ఒక్కో చిరు వ్యాపారికి రూ.50 వేల తక్షణ సహాయం అందించాలి. టిఆర్పి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ డిమాండ్.**

**భూపాలపల్లి అక్టోబర్ 4 (వుదయం ప్రతినిధి):**
జయశంకర్ భూపాలపల్లి భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణ కాలనీ–జంగేడు రోడ్డు విస్తరణలో భాగంగా మున్సిపల్ అధికారులు చిరు వ్యాపారాలు నిర్వహించుకుంటున్న పూల బండ్లు, పండ్ల బండ్లు, మంగలి షాపులు, టీ దుకాణాలు, కిళ్లీ కొట్లు, ఇతర చిన్న వ్యాపార సముదాయాలను కూల్చివేయడాన్ని తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ తీవ్రంగా ఖండించారు.
దసరా పండుగకు ముందు చిరు వ్యాపారుల దుకాణాలను తొలగించి, వారి జీవనోపాధిని దెబ్బతీసి కుటుంబాలను రోడ్డున పడేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని రవి పటేల్ అన్నారు.తమ జీవనోపాధిని కాపాడాలని డిమాండ్ చేస్తూ చిరు వ్యాపారులు చేపట్టిన నిరవధిక సమ్మెకు రవి పటేల్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ అవసరమే అయినప్పటికీ, ఎన్నో సంవత్సరాలుగా చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న చిరు వ్యాపారుల జీవనోపాధిని దెబ్బతీసే విధంగా అధికారులు వ్యవహరించడం సరికాదన్నారు.
ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు చిన్న వ్యాపారాలే జీవనాధారంగా ఉన్నాయని, అలాంటి వారిని ఒక్కసారిగా రోడ్డున పడేయడం మానవత్వం కాదని అన్నారు.
చిరు వ్యాపారులకు తక్షణ పరిహారం ఇవ్వాలి
కూల్చివేతల వల్ల నష్టపోయిన ప్రతి చిరు వ్యాపారికి రూ.50 వేల చొప్పున తక్షణ ఆర్థిక సహాయం అందించాలని రవి పటేల్ డిమాండ్ చేశారు. అలాగే రోడ్డు విస్తరణకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను రూపొందించి, చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలను కేటాయించి, తిరిగి అదే ప్రాంతంలో పక్కా షాపులు నిర్మించి ఇవ్వాలని కోరారు.ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు చిరు వ్యాపారుల సమస్యను తక్షణమే పరిష్కరించాలని, వారి జీవనోపాధికి భరోసా కల్పించాలని అన్నారు.
ఈ సమస్యపై జిల్లా కలెక్టర్, మున్సిపల్ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి చిరు వ్యాపారులకు న్యాయం చేయాలని రవి పటేల్ డిమాండ్ చేశారు.
చిరు వ్యాపారులు భవిష్యత్తులో చేపట్టే ప్రతి న్యాయబద్ధమైన కార్యాచరణకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అండగా ఉంటుందని రవి పటేల్ హామీ ఇచ్చారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే చిరు వ్యాపారులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సంఘాల నాయకులు, చిరు వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

## పరకాల పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా వేముల ఆంజనేయులు ఎన్నిక



**పరకాల అక్టోబర్ 4 (వుదయం ప్రతినిధి):**
పరకాల పట్టణ పద్మశాలి సేవా సంఘం నూతన అధ్యక్షుడిగా వేముల ఆంజనేయులు ఎన్నికయ్యారు. ఆదివారం పరకాలలోని పద్మశాలి భవన్‌లో మాజీ అధ్యక్షుడు బాసాని దయాకర్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎన్నికలు జరిగాయి. ముఖ్య అతిథిగా డాక్టర్ పోతాని రాజేశ్వర్ ప్రసాద్ హాజరయ్యారు. అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికలో వేముల ఆంజనేయులు తన సమీప ప్రత్యర్థి దుంపేటి నాగరాజుపై 8 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా చిలుకమారి మొగిలి ఎన్నికయ్యారు.
యువజన విభాగం అధ్యక్షుడిగా దాసరి రవి, ప్రధాన కార్యదర్శిగా దేవులపల్లి సతీష్ కుమార్ ఎన్నికయ్యారు. మహిళా విభాగం అధ్యక్షురాలిగా వేముల సధారాణి, ప్రధాన కార్యదర్శిగా కదారి అమరావతి, కోశాధికారిగా దాసరి పద్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
ఎన్నికల అధికారులుగా ప్రముఖ జర్నలిస్టు మెండు రవీందర్, మెరుగు శ్రీనివాస్ వ్యవహరించారు. కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం ట్రస్ట్ బోర్డు అధ్యక్షుడు డాక్టర్ కాశయ్య, ప్రధాన కార్యదర్శి చిదురాల దేవేందర్, మండల పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు దాసరి బిక్షపతి, ట్రస్ట్ బోర్డు సభ్యుడు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ పద్మశాలి సంఘం అభివృద్ధి, సభ్యుల సంక్షేమం, యువతను సంఘ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం కోసం కృషి చేస్తామని తెలిపారు. సంఘ ఐక్యతను మరింత బలోపేతం చేసి, పద్మశాలి సమాజ అభ్యున్నతికి అందరి సహకారంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.నూతన కార్యవర్గానికి పద్మశాలి సంఘం నాయకులు, సభ్యులు అభినందనలు తెలిపారు.

## గడప గడపకు సంక్షేమ ఫలాలు



**రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 216 మంది లబ్ధిదారులకు రూ. 1,02,51,000 విలువ గల సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన మంత్రి**

**ఖమ్మం వుదయం బ్యూరో అక్టోబర్ -4**
గడప గడపకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక శ్రీ శ్రీ సర్కిల్ వద్ద గల తన నివాసంలో ఖమ్మం రూరల్, ఎదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని 216 మంది లబ్ధిదారులకు ఒక కోటి 2 లక్షల 51 వేల రూపాయల విలువగల చెక్కులను పంపిణీ చేశారు. ఇందులో ఖమ్మం రూరల్ మండలానికి చెందిన 51 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 70 మంది, ఖమ్మం రూరల్ మండలం పరిధిలోని 95 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆపదలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, పేదల కన్నీళ్లు తుడవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. నిరుపేదలకు వైద్య ఖర్చుల భారం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధిని వేగంగా అందిస్తున్నామన్నారు. అలాగే ఆడబిడ్డల పెళ్లిళ్లకు కళ్యాణలక్ష్మి పథకం ఎంతో ఆసరాగా నిలుస్తోందని చెప్పారు.
అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు

## పేద ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తున్న కోహెన్స్ లైఫ్ సెన్సెస్ సేవలు అభినందనీయం డీఎస్పీ ప్రసన్న కుమార్



**కోహెన్స్ లైఫ్ సెన్సెస్ ఆధ్వర్యంలో భరోసా కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం**

**సూర్యాపేట అక్టోబర్ 4 (వుదయం ప్రతినిధి):**
కోహెన్స్ లైఫ్ సెన్సెస్ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్ లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ తో కలిసి ప్రారంభించారు.
ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లలేని ప్రజలకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించేందుకు కోహెన్స్ లైఫ్ సెన్సెస్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. శిబిరంలో బీపీ,షుగర్,గుండెసంబంధిత పరీక్షలు, మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు, ఇతర ఆరోగ్య సమస్యలకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, వైద్యుల సూచనల మేరకు ఉచితంగా మందులు అందిస్తున్నట్లు చెప్పారు.
ఈ కార్యక్రమంలో, మున్సిపల్ 5వ వార్డ్ కౌన్సిలర్ విజయ నాయక్,6వ వార్డు x కౌన్సిలర్ లింగ నాయ, శ్రీహాన్ హాస్పిటల్ డాక్టర్ గిరిధర్ రెడ్డి, విజిత రెడ్డి, అర్థో వెంకటేష్,కోహెన్స్ లైఫ్ సెన్సెస్ యూనిట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యూనిటెడ్ హాక్ బ్రాండెడ్ మేన్స్ షో రూంను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని



**హనుమకొండ టౌన్, అక్టోబర్ 04 (వుదయం ప్రతినిధి) :**
నగరంలోని ఆర్ఇసి ప్రాంతంలో మహ్మద్ గౌస్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన యూనిటెడ్ హాక్ బ్రాండెడ్ మేన్స్ ఫ్యాషన్ షో రూంను ఆదివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, తాజా మాజీ కార్పొరేటర్ అభినవ్ భాస్కర్ ముఖ్య అతిథిలుగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నగరంలో యూనిటెడ్ హాక్ బ్రాండెడ్ మేన్స్ ఫ్యాషన్ షోరూం ను ప్రారంభించడం సంతోషంగా ఉందని యువత కు సరికొత్త డిజైన్ లతో కూడిన బ్రాండెడ్ డ్రెస్ లు ఉన్నాయని ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పండుగ వేళ నూతనంగా ప్రారంభించిన వ్యాపార సంస్థలు దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రజలకు నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో అందిస్తూ వినియోగదారుల ఆదరణ పొందాలని షోరూమ్ నిర్వాహకులకు సూచించారు. నూతన వ్యాపారాల ద్వారా స్థానికంగా ఆర్థిక కార్యకలాపాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.తమ ఆహ్వానాన్ని మన్నించి షోరూమ్‌ల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఘనంగా సన్మానించారు.
అనంతరం షోరూం యజమాని మహ్మద్ గౌస్ మాట్లాడుతూ... యూనిటెడ్ హాక్ బ్రాండెడ్ మేన్స్ ఫ్యాషన్ షో రూంను గత సంవత్సరం నుంచి పర్యవేక్షిస్తూ ఈ షోరూం ను ప్రారంభించడం జరిగిందన్నారు.మొట్ట మొదటి సారిగా వరంగల్ లో స్థాపించడం సంతోషంగా ఉందని ముందు ముందు అన్ని మండలాలలో, జిల్లాల లో యువత కు అన్ని విధాలుగా ఉపయోగపడేలా మా యొక్క యూనిటెడ్ హాక్ బ్రాండెడ్ మేన్స్ ఫ్యాషన్ షోరూంలను ఏర్పాటు చేస్తామని అన్నారు. సరికొత్త డిజైన్ లతో కూడిన బ్రాండెడ్ డ్రెస్ లు ఉన్నాయని ఈ అవకాశాన్ని యువత, పెద్దలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో, బంధువులు, స్నేహితులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్‌లో 'ఓం చాముండేశ్వరి ఎగ్జిబిషన్' ప్రారంభం



**– ఘనంగా ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కూడా చైర్మన్ గుండు సుధారాణి**

**వరంగల్ టౌన్, అక్టోబర్ 04 (వుదయం ప్రతినిధి) :**
దసరా, దీపావళి పండుగల సందర్భంగా వరంగల్ హంటర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఓం చాముండేశ్వరి ఎగ్జిబిషన్' ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కూడా చైర్మన్ గుండు సుధారాణి ముఖ్య అతిథులుగా హాజరై శనివారం వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఏటా ప్రత్యేకమైన కాన్సెప్ట్ లతో ప్రజలకు ఆహ్లాదాన్ని, ఉపయోగకరమైన వస్తువుల ను అందుబాటులోకి తెస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఇతర ప్రాంతాలకు వెళ్లకుండానే ప్రముఖ దేవాలయాల నమూనాలు, వినూత్న ప్రదర్శనలను వరంగల్ ప్రజలకు ఇక్కడే వీక్షించే అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు.
ఈ ఎగ్జిబిషన్‌ను ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన నిర్వాహకులు మిరియాల వేణు, శ్రీకాంత్, వరుణ్, గోపి, ఫిరోజ్‌లను ఎమ్మెల్యే ప్రత్యేకంగా ప్రశంసించి, ఎగ్జిబిషన్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మామిండ్ల రాజు, వేల్పుల మోహన్ రావు, డివిజన్ అధ్యక్షులు సత్తు రమేష్, సురేందర్, నాయకులు సురేష్, వరుణ్, వేణు, నిర్వాహకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

## సీఐ గణేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ & డ్రగ్ టెస్టింగ్ ప్రోగ్రామ్



**తొర్రూరు అక్టోబర్ 4 (వుదయం ప్రతినిధి):**
మాదకద్రవ్యాల నివారణలో భాగంగా, తొర్రూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గణేష్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో భాగంగా అనుమానిత వ్యక్తులకు డ్రగ్ డిటెక్షన్ కిట్లతో పరీక్షలు నిర్వహించారు. యువత మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా ఉండేందుకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ గణేష్ మాట్లాడుతూ అంబేద్కర్ కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్
సీఐ ఆధ్వర్యంలో ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి, సరైన నంబర్ ప్లేట్లు లేని 9 వాహనాలను గుర్తించారు అనుమానిత గంజాయి వినియోగదారులను డ్రగ్ టెస్టింగ్ కిట్ల ద్వారా పరీక్షించగా ముగ్గురికి పాజిటివ్‌గా తేలింది. వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు గంజాయి, మత్తు పదార్థాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు."డ్రగ్స్ వల్ల జీవితాలు నాశనం అవుతాయని యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై దృష్టి పెట్టాలని సూచించారు. మీ పరిసరాల్లో గంజాయి, డ్రగ్స్ అమ్మకాలు, వినియోగం గురించి సమాచారం ఉంటే వెంటనే 100 లేదా తొర్రూర్ పోలీస్ స్టేషన్ కు తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఈ కార్యక్రమంలో ఎస్సై మహేందర్ రెడ్డి,సిబ్బంది కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## నాచారం జగదాంబ ఆలయానికి వెళ్లే రహదారి అందంగా ఉండాలి



**మంత్రి తుమ్మల ను కలిసిన అధికారులు, నాచారం గ్రామస్తులు.**

**దమ్మపేట అక్టోబర్ 4 (వుదయం ప్రతినిధి ):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండల పరిధిలోని నాచారం గట్టుపై కొలువుతీరిన జగదాంబ దేవాలయానికి వెళ్లే రహదారి అందంగా ఉండాలి అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ఆదేశాలు జారీ చేశారు,నాచారం గ్రామ పెద్దలు మరియు ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఈరోజు ఉదయం గండుగులపల్లి లో మంత్రి తుమ్మలను కలిశారు. ఈ సందర్భంగా ఆలయానికి వెళ్లే రహదారి పై కీలక సూచనలు చేశారు. ఆ రహదారి అందంగా ఉండాలని, డివైడర్లు, మొక్కలు ఉండే విధంగా చూడాలని మంత్రి తుమ్మల అధికారులకు గ్రామస్తులకు కీలక సూచనలు చేశారు.

## రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్‌గా డాక్టర్ అల్లం అప్పయ్య ఎన్నిక




**నూతన పాలకమండలిని ప్రకటించిన ఎలక్షన్ ఆఫీసర్ ఎ. ధర్మా నాయక్.**

**ములుగు, అక్టోబర్ 04 (వుదయం ప్రతినిధి) :**
ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ములుగు జిల్లా శాఖ నూతన పాలకమండలి ఎన్నిక పూర్తయిందని ఎలక్షన్ ఆఫీసర్ ఎ. ధర్మా నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా చైర్మన్‌గా డాక్టర్ అల్లం అప్పయ్య, వైస్ చైర్మన్‌గా గంగిశెట్టి శ్రీనివాస్, ట్రెజరర్‌గా శిరుప సతీష్ కుమార్ ఎన్నికైనట్లు వెల్లడించారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు, జిల్లా కలెక్టర్ బోర్డడే హేమంత్ సహదేవరావు ఆదేశాల మేరకు 2026–2029 పదవీకాలానికి ఆదివారం ములుగులోని రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం చైర్మన్ ఎన్నిక నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్ర పాలకమండలి సభ్యుడిగా కొత్తపల్లి ప్రసాదరావు ఎన్నికైనట్లు పేర్కొన్నారు. జిల్లా పాలకమండలి సభ్యులుగా చుంచు రమేష్, అబ్బు సతీష్, గూడూరు మహిపాల్, కొట్టె రాజిరెడ్డి, వడ్డి శ్రీనాథ్, గార నరసింహారావు, కోగిల సారయ్య, ముక్కు సుబ్బారెడ్డి, పింగిలి నాగరాజ్, వావిలాల రవితేజ, రామిడి కృష్ణారెడ్డి ఎన్నికైనట్లు వివరించారు.
ఆయా పదవులకు ఎన్నికైన మొత్తం 15 మంది వివరాలను వెల్లడిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎలక్షన్ ఆఫీసర్ ఎ. ధర్మా నాయక్ తెలిపారు.

## అశ్వారావుపేట మట్టి రోడ్లకు మహర్దశ



**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం.. వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు**

**భద్రాద్రి కొత్తగూడెం/అశ్వారావుపేట అక్టోబర్ 4 (వుదయం ప్రతినిది) :**
భద్రాద్రి కొత్తగూడెం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశాలతో సీసీ రోడ్ల పనులకు వేగం.. బతుకమ్మకు ముందే అసంపూర్తి పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచన ప్రజల సమస్యలే ప్రథమ ప్రాధాన్యం.. అభివృద్ధి పనులే అసలైన ప్రజాసేవకు నిదర్శనం! అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశాల మేరకు మట్టి, గ్రావెల్ రోడ్ల స్థానంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ప్రాధాన్యత ఇస్తూ, అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తున్నారు.
అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు ఏఎస్ఆర్ నగర్‌లో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దాదాపుగా సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అయితే కాలనీ ప్రవేశ ద్వారం వద్ద సుమారు 20 మీటర్ల మేర రోడ్డు పనులు మిగిలి ఉండటాన్ని గుర్తించిన వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు వెంటనే స్పందించారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కాలనీలో దాదాపు అన్ని రోడ్లు పూర్తయినా, ప్రవేశ ద్వారం వద్ద కొంత పని మిగిలి ఉంటే ప్రజలకు ఇబ్బందే తప్పదు. ఈ విషయాన్ని గుర్తించి అసంపూర్తి పనులపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే తన చొరవను జూపల్లి రమేష్ బాబు చాటుకున్నారు. 20వ వార్డు డ్రైవర్స్ కాలనీలో కనకదుర్గమ్మ తల్లి ఆలయం పక్కన సీసీ రోడ్డు నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి.
దసరా, బతుకమ్మ వేడుకల నేపథ్యంలో మహిళలు, ఆడపడుచులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకూడదనే ఉద్దేశంతో వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు మరోసారి అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. నవరాత్రులు ప్రారంభమయ్యే మొదటి రోజు నాటికే మిగిలిన రోడ్డు పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పండుగల సమయంలో మహిళలు బతుకమ్మ ఆడేందుకు, ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులను వేగంగా పూర్తి చేయాలని కోరారు.
అభివృద్ధి పనులతో పాటు పండుగల వేళ ప్రజల సౌకర్యాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవడమే ప్రజాప్రతినిధుల బాధ్యత అనే విధంగా జూపల్లి రమేష్ బాబు తీసుకున్న చొరవ స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది.మాటలకే పరిమితం కాకుండా.. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి చొరవ!
ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించడం.. అసంపూర్తి పనులపై అధికారులను అప్రమత్తం చేయడం.. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడం.. ఈ అంశాలకు ప్రాధాన్యతనిస్తూ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు ముందుకు సాగుతున్నారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశాలను అనుగుణంగా మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగవంతం కావాలనే లక్ష్యంతో స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మండల యూత్ కాంగ్రెస్ నాయకులు జూపల్లి ప్రమోద్, 10వ వార్డు హ్యాట్రిక్ కౌన్సిలర్ ఎస్.కె. నూర్జహాన్, 20వ వార్డు కౌన్సిలర్ విజయ్ కుమార్ రెడ్డి, కాసాని మోహన్ రావు, ఎస్.కె. సైదు బాజీ, దండ అక్షయ్ రమేష్, దోరప్ల కరుణాకర్, దాబా రాజు, దేరంగుల చంటి, కిషోర్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## ఆర్టీసీ ప్రయాణికులకు ఆన్ లైన్ సౌకర్యం

**కె. సురేష్ కుమార్ యాదగిరిగుట్ట డిపో మేనేజర్**

**యాదాద్రి భువనగిరి జిల్లా , అక్టోబర్4(వుదయం):**
యాదగిరిగుట్ట నుండి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎక్స్ ప్రెస్ లో టికెట్లు బుక్ చేసుకునే సదుపాయాన్ని కల్పించినట్లు యాదగిరిగుట్ట డిపో మేనేజర్ కె. సురేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కె. సురేష్ కుమార్ మాట్లాడుతూ యాదగిరిగుట్ట నుండి శ్రీశైలం వరకు డీలక్స్ బస్సులు నడుపుతున్నామని ఆయన అన్నారు. ప్రతి రోజూ ఉదయం 6.00 గంటలకు యాదగిరిగుట్ట డిపో నుండి బయలుదేరి, 06.20 నిముషాలకు భువనగిరి, 06.45ని.లకు ఘట్కేసర్, 07.15 నిముషాలకుఉప్పల్/నల్లకుంట ద్వారా మహాత్మ గాంధీ బస్ స్టేషన్ నుంచి శ్రీశైలం వెళుతుందని ఆయన అన్నారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## పత్తి కొనుగోళ్లకు రంగం సిద్ధం

**- అక్టోబర్ రెండో వారంలో ప్రారంభం – కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 4:**

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అక్టోబర్ రెండో వారంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఆదివారం ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డును ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డితో కలిసి ఆకస్మికంగా పరిశీలించి, కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించారు.సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోళ్ల తేదీని త్వరలో ఖరారు చేసి రైతులకు సమాచారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. మార్కెట్‌లోని శిథిలావస్థకు చేరిన భవనాలు, తూకం యంత్రాలు, మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. రైతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. పత్తి కొనుగోళ్ల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు, మార్కెట్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

**ఏఈఓల వద్ద తేమ నిర్ధారణ యంత్రాలు**

ఈ ఏడాది ఏఈఓల వద్ద కూడా తేమ నిర్ధారణ యంత్రాలను అందుబాటులో ఉంచామని కలెక్టర్ తెలిపారు. రైతులు పత్తిని మార్కెట్‌కు తీసుకొచ్చే ముందే తేమ శాతంపై అనుమానాలను సమీప ఏఈఓల వద్ద నివృత్తి చేసుకోవాలని సూచించారు. మహారాష్ట్రలోని కిన్వట్, మహోర్ ప్రాంతాల రైతుల కోసం ప్రత్యేకంగా జిన్నింగ్ మిల్లులు ఏర్పాటు చేస్తున్నామని, కేటాయించిన మిల్లుల నిల్వ సామర్థ్యానికి అనుగుణంగానే పత్తిని తీసుకురావాలని కోరారు. ప్రస్తుతం రోడ్డు పనులు కొనసాగుతున్న నేపథ్యంలో పత్తి రైతులు, వాహన దారులు రాంపూర్ రోడ్డుమీదుగా వ్యవసాయ మార్కెట్ కు రావాలని సూచించారు. మార్కెట్‌లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పోలీసుఅధికారులను ఆదేశించారు.

**రైతులకు అన్ని సౌకర్యాలు**

రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మార్కెట్‌లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. భోజనం, తాగునీరు, మహిళా రైతులకు ప్రత్యేక మరుగుదొడ్లతో పాటు హెల్ప్‌డెస్క్, డిజిటల్ డిస్‌ప్లే ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గతేడాది తూకం తదితర అంశాల్లో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్, మార్కెట్ డీఎంఓ గజానంద్, సెలెక్షన్ గ్రేడ్ విఠల్, మార్కెట్ డైరెక్టర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మంత్రుల పర్యటన

**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.. కలెక్టరేట్‌లో సమీక్ష**

**ప్రజావాణి యథావిధిగా కొనసాగుతుంది: జిల్లా కలెక్టర్**



**నిర్మల్ జిల్లా ( వుదయం ప్రతినిధి)4 అక్టోబర్ 2026**

నిర్మల్ జిల్లాలో సోమవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇతర రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు.పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అధికారులు హాజరుకానున్నట్లు వివరించారు. మంత్రుల పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు.మంత్రుల పర్యటన ఉన్నప్పటికీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని ప్రత్యేక విభాగంలో ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక



**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం రెబ్బెన మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాళ్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ ఎన్నికల ప్రక్రియలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించగా, ఎన్నికల పరిశీలకులుగా మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రేనీ రాజయ్య, ప్రధాన కార్యదర్శి బెల్లం శ్రీనివాస్ వ్యవహరించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయుల సమన్వయంతో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కార్యవర్గంజిల్లా అధ్యక్షులుగా: చకిలం మధుసూదన్, పిడి ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలికలు), సిర్పూర్ (టి) ప్రధాన కార్యదర్శిగా: ఎర్ర సత్యనారాయణ, పిడి జెడ్ పి హెచ్ ఎస్కోశాధికారిగా: ప్రవీణ్, పిడి జెడ్పిహెచ్ఎస్ జనక్‌పూర్, ఆసిఫాబాద్గౌరవ అధ్యక్షులుగా: బి. మీనా రెడ్డి, పిడి స్పోర్ట్స్ స్కూల్ (బాలికలు), ఆసిఫాబాద్ సహాధ్యక్షులుగా: ఆత్రం కృష్ణమూర్తి, పిడి ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల, బంబారామహిళా అధ్యక్షురాలిగా: జె . ఇందిర, పిడి జెడ్ పి హెచ్ ఎస్ పెట్రోల్ పంప్, కాగజ్‌నగర్ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ఈ సందర్భంగా పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. జిల్లాలో వ్యాయామ విద్యను మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి, శారీరక దారుఢ్యం పెంపొందించేందుకు సంఘం తరఫున కృషి చేయాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో జనగాం జిల్లా అధ్యక్షులు నరేందర్ గౌడ్, రాష్ట్ర కోశాధికారి సక్రు నాయక్తో పాటు కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాళ్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.నూతన కార్యవర్గం తరఫున అధ్యక్షులు చకిలం మధుసూదన్, ప్రధాన కార్యదర్శి ఎర్ర సత్యనారాయణ మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో వ్యాయామ విద్య అభివృద్ధి, ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించడం, క్రీడా ప్రతిభను వెలికితీయడం కోసం సమష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

## గురు బ్రహ్మలు బి.ఎడ్ అధ్యాపకులు

**గురువందనం – రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ విద్యావేత్తల పురస్కారాలు–2026**



**కామారెడ్డి, అక్టోబర్ 4 (వుదయం ప్రతినిధి):**

కామారెడ్డి రక్తదాతల సమూహ గౌరవ అధ్యక్షులు, యస్.వి.టీచర్ ప్లస్ ఈ లెర్నింగ్ అకాడమి ఫౌండర్ డాక్టర్ వేద ప్రకాష్, ప్రిన్సిపల్స్ అసోసియేషన్ ఆఫ్ కాలేజెస్ ఆఫ్ఎడ్యుకేషన్ పేస్ ఇండియా, తెలంగాణ ఆధ్వర్యంలో తెలంగాణ బి.ఎడ్ లెక్చరర్స్ అసోసియేషన్,తెలంగాణ ప్రైవేట్ బి.ఎడ్ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్, నిర్వాహక కమిటీ సహకారంతో “గురు వందనం – రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ విద్యావేత్తల పురస్కారాలు–2026” కార్యక్రమాన్ని హైదరాబాద్ లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో నిర్వహించడం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ యూనివర్సిటీలలో పని చేస్తున్న 31 మంది అధ్యాపకులను సన్మానించడం జరిగింది. బి.ఎడ్ ఉపాధ్యాయ విద్య రంగంలో విశిష్ట సేవలు అందిస్తూ, విద్యా ప్రమాణాల అభివృద్ధికి, భవిష్యత్ ఉపాధ్యాయుల రూపకల్పనకు, ఉపాధ్యాయ విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయ విద్యావేత్తలను గుర్తించి, సత్కరించి, వారి సేవలను గౌరవించడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని నిర్వాహకులు డాక్టర్ పిల్ల మారి వేదప్రకాష్ తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ వి.సుధాకర్, చైర్ ప్రొఫెసర్, చాణక్య యూనివర్సిటీ, బెంగళూరు; హానరరీ ప్రొఫెసర్, న్యూఢిల్లీ, నోయిడా;సభ్యులు, భారత ప్రభుత్వం, న్యూఢిల్లీ గౌరవ అతిథిగా డా. పి. శంకర్, అసోసియేట్ ప్రొఫెసర్, న్యూఢిల్లీ; డిప్యూటీ డైరెక్టర్, సభ్యులు,ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ అకడమిక్ ఆడిట్, తెలంగాణ యూనివర్సిటీ, డాక్టర్ లలిత, డాక్టర్ సునీత, ఉస్మానియా యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఉస్మానియా యూనివర్సిటీ, ప్రముఖ విద్యావేత్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉపాధ్యాయ విద్య రంగంలో అంకితభావం, విద్యా నాయకత్వం, నూతన ఆవిష్కరణలు, వృత్తిపరమైన నైపుణ్యం, విశిష్ట సేవలను గుర్తించి “గురు వందనం” కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని, ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన డాక్టర్ వేద ప్రకాష్ ను అభినందించి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని బి.ఎడ్ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయ విద్యావేత్తలు, బి.ఎడ్ లెక్చరర్లు, విద్యావేత్తలు, విద్యా పరిపాలకులు, ఉపాధ్యాయ విద్యా రంగానికి చెందిన ప్రముఖులు పాల్గొనడం జరిగింది.

## నూతన పాక్స్ చైర్మన్లకు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ శుభాకాంక్షలు...



**జగిత్యాల అక్టోబర్ 04 (వుదయం ప్రతినిధి)**

జగిత్యాల పాక్స్ చైర్మన్ గా కొలుగూరి దామోదర్ రావు అల్లీపూర్ పాక్స్ చైర్మన్ గా తంగెళ్ల రమేష్ ఇటిక్యాల పాక్స్ చైర్మన్ గా మర్రిపెల్లి శ్రీనివాస్ గౌడ్ నూతనంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా తమ నియామకానికి కృషి చేసిన జగిత్యాల నియోజక వర్గ శాసన సభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ నూతనంగా నియమితులైన పాక్స్ చైర్మన్లకు శుభాకాంక్షలు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం పాక్స్‌ల ద్వారా మరింత మెరుగైన సేవలు అందిస్తూ రైతులకు ఎల్లప్పుడూ అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు పాలక వర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న జీయర్ స్వామి



**ధర్మపురి, అక్టోబర్4 (వుదయం ప్రతినిధి):**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానాన్ని తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరు శ్రీ శఠగోప సిద్ధాంత పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ శఠకోప ముని రామానుజ జీయర్ స్వామి సందర్శించారు.ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన స్వామీజీకి దేవస్థాన సాంప్రదాయం ప్రకారం అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మేళతాళాల వాయిద్యాల నడుమ ఘన స్వాగతం పలికారు.అనంతరం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకుని జీయర్ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం దేవస్థానం అర్చకులు, సిబ్బంది స్వామీజీకి శ్రీ స్వామివారి శేష వస్త్రాలను, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ అల్వాల శ్రీనివాస్, వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, ఓంకార శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివా సాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసచార్యులు, రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ వావిలాల తిరుపతి, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్సాహంగా కరీంనగర్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలు

**ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్**

**కరీంనగర్ అక్టోబర్ 05 (వుదయం ప్రతినిధి):**

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర డిగ్రీ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు అత్యంత ఉత్సాహంగా, ప్రశాంత వాతావరణంలో జరిగాయి.ఈ ఎన్నికల్లో భాగంగా కరీంనగర్ శాసనసభ్యులు, రాష్ట్ర మాజీ మంత్రి గంగుల కమలాకర్ పోలింగ్ కేంద్రానికి స్వయంగా విచ్చేసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సమాజంలో రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లే నూతన పాలకవర్గ ఎంపిక కోసం జరుగుతున్న ఈ ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.ఈ పోలింగ్ ప్రక్రియలో జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు, రెడ్‌క్రాస్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును చాటుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

## గురుకుల పాఠశాల సమస్యలపై ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ఆరా

**మౌలిక వసతులు మెరుగుపరచాలని డిమాండ్**



**పెద్దపల్లి, అక్టోబర్ 04 (వుదయం ప్రతినిధి)**

రాష్ట్రంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని గౌరవ శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ), బీజేఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ శ్రీ మల్క కొమరయ్య పేర్కొన్నారు. ఆదివారం పెద్దపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ సంక్షేమ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించి క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, పాఠ్యపుస్తకాలు, భోజన నాణ్యత, తాగునీటి సదుపాయం, వసతి గదులు, పారిశుద్ధ్య నిర్వహణ మరియు ఇతర మౌలిక వసతులపై ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆరా తీశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మాట్లాడుతూ, పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ కనీస బాధ్యత అని, గురుకులాల బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలోనూ ప్రతిభ కనబరిచేలా పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన విద్యా వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం రాజకీయాలకు అతీతంగా పోరాడుతామని, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే వరకు నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం గురుకుల పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించి, తగిన నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని కోరారు. అలాగే విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజల గొంతుకగా.. జన తెలంగాణ పార్టీ- పార్టీ ఏర్పాటుకు సన్నాహాలు ముమ్మరం



**ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 4:**

ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజల గొంతుకగా నిలిచేందుకు జన తెలంగాణ పార్టీ ఏర్పాటు దిశగా సన్నాహాలు ముమ్మరమయ్యాయి. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో లంక పాపిరెడ్డి, బాల్నే అజయ్, బండి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించారు.సమావేశానికి ప్రజా, కుల, ఉద్యోగ సంఘాలతో పాటు విద్యార్థి, యువజన, కార్మిక, కర్షక, మహిళా సంఘాల నాయకులు హాజరై నూతన పార్టీ ఏర్పాటుపై తమ సూచనలు, సలహాలు అందించారు.ఈ సందర్భంగా లంక పాపిరెడ్డి మాట్లాడుతూ.. స్థానిక, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు జిల్లాల్లో సమావేశాలు నిర్వహించి అడహాక్ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. పార్టీ నిర్మాణ ప్రక్రియ పూర్తయిన అనంతరం రిజిస్ట్రేషన్ చేస్తామని పేర్కొన్నారు. జిల్లా పర్యటనల్లో ప్రజలు, వివిధ సంఘాల నుంచి వచ్చే సూచనలు, సలహాలను స్వీకరిస్తామని తెలిపారు. రాష్ట్రస్థాయి సమావేశంలో పార్టీని అధికారికంగా ప్రకటిస్తామని వెల్లడించారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న పార్టీకి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు.

**జిల్లా అడహాక్ కమిటీ ఏర్పాటు**

ఆదిలాబాద్ జిల్లా అడహాక్ కమిటీకి టేకం మోతీరామ్ అలియాస్ విజయ్, గద్దల శంకర్, గంగాధర్, దివాకర్, సాకారం, బడుగు రాజేశ్వర్, సుధాకర్, మారుతి, దేవురావు సత్యం, కోవా స్వరూప తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నరాల రమణయ్య, బొల్లారం బాబన్న, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రాజమల్లు, రంగన్న, కొడప సోనేరావు, ఏడేళ్లు, వీరన్న, సిడం రామ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణుల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం- కలెక్టర్



**ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 3:**

గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గుడిహత్నూర్ మండలం వైజాపూర్ గ్రామంలో శనివారం నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు నిర్వహించిన వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు.

నిపుణులైన వైద్యులు రోగులను పరీక్షించి, అవసరమైన మందులను ఉచితంగా అందించారని తెలిపారు. మారుమూల ప్రాంతాల ప్రజలు ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమాజం పట్ల బాధ్యతతో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసేందుకు ముందుకొచ్చిన వైజాపూర్ మెడికల్ నిర్వాహకులను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు పోలీసు శాఖ నుంచి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కోటే, డీఎంహెచ్ఓ సాధన, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, స్థానిక సర్పంచ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో ఏం జరుగుతోంది? నిన్నటి రగడపై గంట రాములు ఫైర్



**పెద్దపల్లి, అక్టోబర్ 04 (వుదయం ప్రతినిధి)**

బీఆర్ఎస్‌లో ప్రశ్నించే బీసీ నాయకుల గొంతులను అణచివేసే ప్రయత్నం జరుగుతోందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ జెడ్పీటీసీ గంట రాములు ఆరోపించారు. సొంత పార్టీ సర్పంచులు, నాయకులు సమస్యలను ప్రశ్నిస్తే వారిపైనే దాడులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ బీసీ సెల్ సమావేశంలో చోటుచేసుకున్న ఘర్షణ నేపథ్యంలో ఆదివారం పెద్దపల్లి పట్టణంలోని ఆర్కే గార్డెన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.రంగంపల్లిలోని ఆర్ఆర్ గార్డెన్‌లో నిన్న నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి బీసీ సెల్ సమావేశానికి తమ వర్గానికి చెందిన బీసీ నాయకులకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించగా, దాసరి వర్గీయులు తమపై దాడికి పాల్పడ్డారని గంట రాములు ఆరోపించారు. సొంతపార్టీనాయకులపైనే దాడులు చేయడం బాధాకరమన్నారు. ఈ ఘటనను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతామని స్పష్టం చేశారు.బీఆర్ఎస్ పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్న బీసీ నాయకులు రాజకీయంగా ఎదగకుండా అడ్డుకునే ప్రయత్నం జరుగుతోందని గంట రాములు ఆరోపించారు. బీసీ నాయకులకు సముచిత ప్రాధాన్యం ఇవ్వకుండా పక్కనపెడుతున్నారని విమర్శించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అనుకూలంగా పనిచేసిన వారిని, ఎన్నికల్లో ఏజెంట్లుగా వ్యవహరించిన వారిని పార్టీలోకి తీసుకొచ్చి ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులను మాత్రం విస్మరిస్తున్నారని అన్నారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల బీఆర్ఎస్ ప్రతిష్టకు నష్టం కలుగుతుందని టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గంటరాములు అన్నారు.

## కాంగ్రెస్‌ను తిరుగులేని శక్తిగా మార్చాలి – అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాసరెడ్డి



**ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 4:**

కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి, వచ్చే ఎన్నికల నాటికి తిరుగులేని శక్తిగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. భోరజ్ మండలానికి చెందిన పలువురు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పట్టణంలోని కంది శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు.భోరజ్ మండల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న నిమ్మల గజానన్‌తో పాటు పొట్ట అశోక్, శైలేష్‌రెడ్డి, రాజారెడ్డి తదితర నాయకులు కాంగ్రెస్‌లో చేరడం సంతోషకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. కొత్తగా చేరిన నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనడంతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ క్రియాశీలంగా ఉండాలని కంది శ్రీనివాసరెడ్డి సూచించారు. అందరూ సమన్వయంతో పనిచేస్తే గ్రామస్థాయి నుంచి పార్టీ మరింత బలపడుతుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్, ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్‌రావు, నాయకులు శాంతన్‌రావు, భోరజ్ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి..

**విద్యార్థులకు ప్రభుత్వ విప్ విజయరమణ రావు పిలుపు**

**పెద్దపల్లి, అక్టోబర్ 04 (వుదయం ప్రతినిధి)**

విద్యార్థుల్లో దేహదారుఢ్యంతో పాటు మానసిక వికాసానికి క్రీడలు ఎంతో అవసరమని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్స్‌లో నిర్వహించిన70వ ఎస్‌జీఎఫ్జిల్లా స్థాయి అండర్–11, అండర్–14 బాలురు, బాలికల కరాటే సెలక్షన్స్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని, వారి ప్రతిభను అభినందించారు. ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌తోపాటు కరాటే వంటి క్రీడల్లో పెద్దపల్లి ప్రాంత విద్యార్థులు, యువకులు ప్రతిభ ను చాటుతున్నారని తెలిపారు. జిల్లాస్థాయిపోటీల్లో సత్తా చాటిరాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై పెద్దపల్లి జిల్లా కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**నారాయణపేట టౌన్ అక్టోబర్4 (వుదయం ప్రతినిధి)**

లయన్స్ క్లబ్ ఆఫ్ నారా యణపేట 320 ఏ ఆధ్వ ర్యంలో ఎస్ ఎం ఎచ్ హాస్పిటల్‌లో డాక్టర్ సచిన్ నేతృ త్వంలో ఆదివారం ఉచిత మెడికల్ క్యాంపును విజ యవంతంగా నిర్వహించా రు.ఈ ఉచిత వైద్య శిబిరంలో పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఉచితంగా షుగ ర్ పరీక్షలు నిర్వహించారు. ఈ క్యాంపు కోసం అవస రమైన షుగర్ టెస్ట్ కిట్లను లయన్ కృపాకర్ రెడ్డి స్పాన్సర్ చేశారు.ఈ వైద్య శిబిరంలో దాదాపు 200 మంది ప్రజలు పాల్గొనీ ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు.ఈ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట 320 ఏ అధ్యక్షులు లయన్ రవికుమార్ గౌడ్ ఆధ్వర్యం లో విజయవంతంగా నిర్వ హించారు.ఈకార్యక్రమంలోలయన్ డాక్టర్ హరినారాయణ బట్టడ్ , లయన్ మోహన్ కుమార్ కోన, లయన్ రాజేష్‌పోలేపల్లి,లయన్ శ్రీనివాస్ లాహోటి ,లయన్ భీమ్ చందర్ గౌడ్ ,లయన్ కృష్ణమూర్తి,లయన్ జయంత్ రెడ్డి,లయన్ బాలాజీ ఎగ్‌బోటే ,లయన్ అనిల్ మిస్కేన్,లయన్ డాక్టర్ ఆంజనేయులు ఆర్మీ,యన్ ఎస్. చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర భూ రీ-సర్వే పనులను కట్టుదిట్టంగా నిర్వహించాలి

**వనపర్తి అక్టోబర్ 4 (వుదయం ప్రతినిధి)**

- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్

వనపర్తి జిల్లాలో చేపడుతున్న సమగ్ర భూ రీసర్వే పనులను నిబంధనల ప్రకారం, పారదర్శకంగా, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్ ఆదేశించారు.ఆదివారం గోపాల్‌పేట మండలం చెన్నూరు గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే ప్రక్రియ కొనసాగుతున్న తీరును పరిశీలించడంతో పాటు సంబంధిత రికార్డులను తనిఖీ చేసి, అధికారులకు పలు సూచనలు చేశారు .ఈ సందర్భంగా గ్రామంలోని రైతులు, భూ యజమానులతో అదనపు కలెక్టర్ మాట్లాడారు. ప్రస్తుతం పొలాల్లో సాగు చేస్తున్న పంటలు, పంట చేతికి వచ్చే సమయం, సాగు వివరాలు తదితర అంశాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రీసర్వే ప్రక్రియను సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. కోరిలేషన్ రిజిస్టర్ నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధరీసర్వే ప్రక్రియలో అత్యంత కీలకమైన కోరిలేషన్ రిజిస్టర్‌ను పక్కాగా, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సర్వేకు సంబంధించిన సమాచారాన్ని రైతులు, భూ యజమానులకు ముందుగానే నోటీసుల ద్వారా తెలియజేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి, భూ రీసర్వే లక్ష్యాలు, ప్రాధాన్యత, ప్రక్రియపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. సర్వే సమయంలో సరిహద్దులు, సర్వే రాళ్ల గుర్తింపులో స్పష్టత ఉండేలా నిబంధనల ప్రకారం వివిధ రకాల సర్వే రాళ్లకు రంగులు వేయాలని సూచించారు.



**12 మండలాల్లో ప్రారంభమైన రీ-సర్వే పనులు**

జిల్లాలోని మొత్తం 15 మండలాలకు గాను ఇప్పటికే 12 మండలాల్లో భూ రీసర్వే పనులు ప్రారంభమైనట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. మిగిలిన రేవల్లి, ఆత్మకూర్, చిన్నంబావి మండలాల్లో మరో రెండు, మూడు రోజుల్లో రీసర్వే పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.తొలి విడతలో భాగంగా జిల్లాలోని 70 గ్రామాల్లో భూ రీసర్వే నిర్వహించేందుకు లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఇప్పటివరకు పెబ్బేరు మండలం బూర్దిపాడు గ్రామంలో రీసర్వే ప్రక్రియ ఇప్పటికే విజయవంతంగా పూర్తయిందని వెల్లడించారు.భూ రీసర్వే ప్రక్రియలో అధికారులు, సర్వే సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యటనలో సంబంధిత మండల సర్వే అధికారులు, రెవెన్యూ సిబ్బంది, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య చిత్ర విశ్లేషణపై పరిశోధనకు పీహెచ్.డీ

**పటాన్చెరు (వుదయం):**



హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి కందుల రేవతి డాక్టరేట్‌కు అర్హత సాధించారు. 'వైద్య చిత్రాల పునరుద్ధరణ, వర్గీకరణ కోసం నూతన అల్గారిథమ్ ల అభివృద్ధి, పనితీరు మూల్యాంకనం' చేసి, ఆమె సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. విజయ్ కుమార్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వల్లడించారు.కంప్యూటర్‌ఎయిడెడ్ డయాగ్నోసిస్ వ్యవస్థలను బలోపేతం చేయడానికి, డీప్ లెర్నింగ్, ఫీచర్ ఆప్టిమైజేషన్, న్యూరల్ నెట్ వర్కులు, ఇమేజ్ సెగ్మెంటేషన్ ను ఏకీకృతం చేస్తూ, వైద్య చిత్రాల పునరుద్ధరణ, వర్గీకరణ కోసం అధునాతన అల్గారిథమ్ లను అభివృద్ధి చేయడంపై ఆమె పరిశోధన దృష్టి సారించినట్టు వివరించారు. ప్రతిపాదిత పద్ధతులు 97.29 శాతం వరకు వర్గీకరణ కచ్చితత్వాన్ని సాధించాయన్నారు. ఇది మూల్యాంకనం చేసిన బేస్ లైన్ విధానాల కంటే గణనీయమైన మెరుగుదలను ప్రదర్శించినట్టు తెలియజేశారు.డాక్టర్ రేవతి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.మహబూబ్ బాషా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించి, ఆమె తన విద్య, పరిశోధన వృత్తిలో నిరంతర విజయం సాధించాలని వారు ఆకాంక్షించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఆరోగ్యశ్రీ ఉద్యోగుల రాష్ట్ర కమిటీ ఏకగ్రీవ ఎన్నిక





**నాగర్ కర్నూల్ రూరల్, అక్టోబరు 4 (వుదయం ప్రతినిధి):**

తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం నూతన రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది.సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గిరి యాదయ్య ఎన్నికయ్యారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బిజినపల్లి మండలం పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న పి. విష్ణు, రాష్ట్ర కార్యదర్శిగా వట్టెం గ్రామానికి చెందిన సమీర్ బాబా ఎన్నికయ్యారు.రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ కృషి చేస్తుందని ఎన్నికైన నాయకులు తెలిపారు. ఎన్నికకు సహకరించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఆరోగ్యశ్రీ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.జిల్లాకు చెందిన విష్ణు, సమీర్ బాబా రాష్ట్ర కమిటీలో కీలక బాధ్యతలు చేపట్టడంపై నాగర్‌కర్నూల్ జిల్లా ఆరోగ్యశ్రీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

## సహకార సంఘం గోదాం రైస్ మిల్ నిర్మాణంలో అక్రమాలు నిరూపిస్తాం

- కాంగ్రెస్ నాయకులు అభివృద్ధిని మరిచి విమర్శలకు దిగారు
- లేనిపోని మాటలాడితే చూస్తూ ఊరుకునేది లేదు
- ఖబర్దార్ కాంగ్రెస్ నాయకులారా
- కరెంటు కోతలు మొదలయ్యాయి

**యాలాల ఆగస్టు 4 వుదయం ప్రతినిధి:-**





యాలాల సహకార సంఘం గోదాం మరియు రైస్ మిల్ నిర్మాణంలో జరిగిన అక్రమాలను నిరూపిస్తామన్నారు. ఆదివారం యాలాల మండల పరిధిలోని దౌలాపూర్ గ్రామ సమీపంలో బిఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు . ఈ సమావేశంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి రైతు సంఘం అధ్యక్షులు అరవింద్ కుమార్ రెడ్డి, యాలాల సహకార సంఘం మాజీ వైస్ చైర్మన్ వడ్డే రాములు బెన్నూరు మాజీ సర్పంచ్ పటేల్ రెడ్డి, పార్టీ కార్యదర్శి గణేష్, కృష్ణ కుమార్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాలాల సహకార సంఘం గోదాం, రైస్ మిల్ నిర్మాణానికి రూ. రెండు కోట్ల 50 లక్షలు మంజూరయ్య అని తెలిపారు. ఇట్టి ఇట్టి పనులను పళ్ళ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి అప్ప చెప్పారని తెలిపారు. గోదాం పనులు పూర్తిచేసి రైస్ మిల్ పరికరాలు కొనుగోలు చేయకుండానే నిధులు చెక్కుల ద్వారా డ్రా చేశారని సాక్షాలు చూపించారు. అట్టి కాంట్రాక్టర్ పై గతంలో ఉన్న చైర్మన్ సురేందర్ రెడ్డి పాలకవర్గం కాంట్రాక్టర్ పై ఫిర్యాదు చేయడం జరిగింది తెలిపారు, సంబంధిత కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిసిఓకు వినతిపత్రం అందజేయడం జరిగిందని తెలిపారు. డిసీఓ స్పందించి విచారణకు ఆదేశించారు. ఈ విచారణ అక్టోబర్ 5న విచారణ జరుగుతుందని తెలిపారు. ఇదే విషయమై అప్పటి కలెక్టర్ ప్రతీక్ జైన్ కు ఫిర్యాదు చేయడం జరిగింది మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి తెలిపారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ విచారణ అధికారిగా అడిషనల్ కలెక్టర్ రాజేశ్వరిని నియమించారని చెప్పారు. అడిషనల్ కలెక్టర్ రాజేశ్వరి విచారణ జరిపి సంబంధించిన నివేదికను కలెక్టర్ పంపించడం జరిగిందని వివరించారు. ఇంత జరిగినా అక్రమాలు జరగలేదని కాంగ్రెస్ నాయకులు చెప్పడం హాస్యస్పదంగా ఉందన్నారు. విలేకరుల సమావేశం నిర్వహించి బిఆర్ఎస్ నాయకుల పై లేనిపోని ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. అభివృద్ధిని మరిచి కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ నాయకులను విమర్శించే పనిని ఎంచుకున్నారని తెలిపారు. బిఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేసి మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. బిఆర్ఎస్ పార్టీ క్రమశిక్షణ గల కార్యకర్తలను తయారు చేసింది అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలోకి వివిధ పార్టీల నుంచి వచ్చి కలగుర గంపలాగా మారిందని తెలిపారు. రకరకాలుగా మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుల అక్రమల చిట్టాలను బయటపెడతామని సూచించారు. ఉదయం బిఆర్ఎస్ పార్టీలో ఉండి సాయంత్రం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేను కలిసింది ఎవరో నిరూపించాలని మాజీ సర్పంచ్ అరవింద్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అభివృద్ధిని మరిచి విమర్శలు దిగారని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు కరెంటు కోతలు విధించి ఇబ్బందుల పాలు చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా గ్రామపంచాయతీలో నిధులు లేక సర్పంచులు కొట్టుమిట్టాడుతున్నారని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ గెలిచిన గ్రామాలకు నిధులు ఇవ్వడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటయ్య, బి ఆర్ ఎస్ నాయకులు సుభాన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ముస్తఫా, రేలపాటి రాములు, మొగులయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు

## ఫుడ్ సేఫ్టీ నియమాలు పాటించాలి

- అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృత శ్రీ

**సంగారెడ్డి వుదయం :**

జిల్లాలో ఆహార పదార్థాల తయారీ, విక్రయాలు నిర్వహిస్తున్న వ్యాపారులు, కంపెనీల యజమాన్యాలు తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృత శ్రీ సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సంగారెడ్డిలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. ఫుడ్ బిజినెస్ నిర్వహించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ పొందాలని తెలిపారు. ఆహార పదార్థాల తయారీ, నిల్వ, ప్యాకింగ్, విక్రయాల్లో నిర్దేశిత ప్రమాణాలను పాటించాలన్నారు. వినియోగదారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఫుడ్ బిజినెస్ సంస్థల్లో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలు పాటించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అమృత శ్రీ స్పష్టం చేశారు.

## ఆలయ చైర్మన్ బరిలో పాతూరి శ్రీనివాస్ గౌడ్..?

- ప్రజాక్షేత్రంలో జోరుగా సాగుతున్న ప్రచారం.!

**అక్బర్ పేట భూంపల్లి అక్టోబర్ 04 ( వుదయం ప్రతినిధి )**



దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం కూడవెల్లి శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ చైర్మన్ పదవికి సంబంధించి నియోజకవర్గంలో ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఆలయ చైర్మన్‌గా అక్బర్ పేట భూంపల్లి మండలం తాళ్ళపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధి పాతూరి శ్రీనివాస్ గౌడ్‌కు అవకాశం దక్కే సూచనలు ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో, స్థానిక ప్రజల్లో జోరుగా ప్రచారం సాగుతోంది.గతంలో ఆయన పోతరెడ్డి పేట ఎంపీటీసీగా బాధ్యతలు నిర్వహించి, ప్రజలకు ఎన్నో వినూత్న సేవలు అందించారని. ప్రజా సమస్యల పరిష్కారంలో నిరంతరం ముందుంటూ, అందరితో సులభంగా కలిసిపోయే వ్యక్తిగా ఆయనకు స్థానికంగా మంచి గుర్తింపు ఉందంటూ జోరుగా ప్రచారం సాగుతుంది. ప్రజాసేవలో సుదీర్ఘ అనుభవం ఉన్న శ్రీనివాస్ గౌడ్‌కు ఈ ప్రతిష్టాత్మకమైన కూడవెల్లి ఆలయ చైర్మన్ పదవిని కట్టబెడితే, ఆయన తన అనుభవంతో ఆలయ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఎన్నో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తారని భక్తులు, స్థానిక ప్రజలు బలంగా ఆకాంక్షిస్తున్నారు. ఆలయ ఖ్యాతిని మరింత పెంచడంతో పాటు, భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఆయన సారథ్యం ఎంతో దోహదపడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.మరి ఈ ప్రచారంపై అధికారికంగా ఎలాంటి నిర్ణయం వెలువడుతుందో చూడాలి.?

## ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

- లక్ష్మీపల్లి స్టేజీ వద్ద ఘటన.. డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ఆరోపణలు

**చిన్నంబావి మండలం 04 వుదయం రిపోర్టర్**



చిన్నంబావి మండల పరిధిలోని లక్ష్మీపల్లి స్టేజీ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని సుజాతమ్మ (55) మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పెబ్బేరు నుంచి కొల్లాపూర్ వెళ్తున్న కొల్లాపూర్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు (టీజీ 31 జెడ్ 0021) లక్ష్మీపల్లి స్టేజీ వద్ద ఆగకుండా ముందుకు వెళ్తుండగా బస్సు ఎక్కేందుకు ప్రయత్నించిన మహిళా ప్రయాణికులు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో సుజాతమ్మ బస్సు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు మహిళలు తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ప్రత్యక్ష సాక్షులు, ప్రమాదం నుంచి బయట పడిన మహిళా ప్రయాణికుల కథనం మేరకు.. లక్ష్మీపల్లి స్టేజీ వద్ద బస్సు ఎక్కేందుకు మహిళలు ప్రయత్నిస్తుండగా డ్రైవర్ బస్సును ఆపకుండా వేగంగా ముందుకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో రోడ్డు దాటుతున్న సుజాతమ్మను బస్సు ఢీకొట్టినట్లు తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని బంధువులు ఆరోపించారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**మృతదేహం వద్ద బంధువుల ఆందోళన**

ప్రమాద విషయం తెలియగానే చిన్నంబావి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. సుజాతమ్మ మృతదేహాన్ని తరలించే విషయంలో బంధువులు, కుటుంబ సభ్యులు కొద్దిసేపు రోడ్డుపై ధర్నాకు దిగారు. కుటుంబానికి ప్రభుత్వం నుంచి అన్ని విధాలా ఆదుకోవాలని, తగిన నష్ట పరిహారం అందించాలని నినాదాలు చేశారు. దీంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

**డిపో అధికారుల హామీ**

విషయం తెలుసుకున్న కొల్లాపూర్ ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి రత్నమ్మ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రయోజనాలు, పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే వనపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ దేవేందర్‌గౌడ్ కూడా ఘటనపై స్పందించి బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందాల్సిన ప్రయోజనాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

**కుటుంబానికి పరిహారం.. ఉద్యోగం ఇవ్వాలి**

సుజాతమ్మ కుటుంబానికి ప్రభుత్వం తగిన నష్టపరిహారం చెల్లించాలని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఆర్టీసీలో ఉద్యోగం కల్పించాలని బంధువులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఇదే కుటుంబానికి చెందిన భాస్కర్‌గౌడ్, ఆయనతో పాటు ప్రయాణిస్తున్న గురువయ్య సుమారు ఆరేళ్ల క్రితం ఆర్టీసీ బస్సు ప్రమాదంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పటి నుంచి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇప్పటికీ ప్రభుత్వ పరిహారం అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా సుజాతమ్మ కూడా ఆర్టీసీ బస్సు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

**నాయకుల పరామర్శ**

ప్రమాద స్థలాన్ని మాజీ జడ్పీటీసీ కేసిరెడ్డి వెంకటరమణమ్మ చిన్నారెడ్డి, మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ మధుసూదన్ రెడ్డి, ఉల్పాల మహేశ్వర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బిసన్న, లక్ష్మీపల్లి గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం నుంచి తగిన ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ఘటనపై స్థానిక ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఇర్ఫానీ దర్గా 24 వ ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న జగ్గారెడ్డి



- దర్గా లో ప్రత్యేక ప్రార్థనలు అనంతరం కవ్వాలి కార్యక్రమం కు హాజరై కళాకారులకు కానుకలు అందించిన జగ్గారెడ్డి

**సంగారెడ్డి వుదయం**

సంగారెడ్డి పట్టణ శివారులోని ఇర్ఫాని దర్గా 24వ ఉర్సు ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. ఉర్సు ముగింపు సందర్భంగా దర్గాలో ప్రత్యేక దీపారాధన, ప్రార్థనా కార్యక్రమాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి దీపాలు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వహించిన ఖవ్వాలి కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.ఉర్సు ముగింపు కార్యక్రమానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హాజరై దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దర్గాలకు కులమతాలకు అతీతంగా ప్రజలు తరలివస్తారని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య సోదరభావం, ఐక్యతను మరింత పెంపొందిస్తాయని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ ఉర్సు వేడుకల్లో సంగారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ అహ్మద్, కాంగ్రెస్ నాయకుడు కూన సంతోష్ కుమార్, దర్గా నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విజయవంతమైన పీఎంఎస్‌జీ-ఎంబీవై సేవా సేతు

- డివిజనల్ ఇంజనీర్ ఎం. సుధాకర్

**నాగర్ కర్నూల్, అక్టోబరు 4 (వుదయం బ్యూరో):**

ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో నిర్వహించిన పీఎంఎస్‌జీఎంబీవై సేవా సేతు కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని డివిజనల్ ఇంజనీర్ ఎం. సుధాకర్ తెలిపారు.ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని, వివిధ ప్రభుత్వ పథకాలు, సేవలపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన సేవలను అందించడం జరిగిందన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు.కార్యక్రమంలో ఏడీఈలు శంకరయ్య, ప్రవీణ్ కుమార్, హర్షవర్ధన్ రెడ్డి, ఏఈలు మాన్య నాయక్, జానకిరామ్, ప్రదీప్ గౌడ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ర్నూల్, అక్టోబరు 4 (వుదయం ప్రతినిధి):* ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో నిర్వహించిన పీఎంఎస్‌జీఎంబీవై సేవా సేతు కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని డివిజనల్ ఇంజనీర్ ఎం. సుధాకర్ తెలిపారు.కార్యక్రమంలో ఏడీఈలు శంకరయ్య, ప్రవీణ్ కుమార్, హర్షవర్ధన్ రెడ్డి, ఏఈలు మాన్య నాయక్, జానకిరామ్, ప్రదీప్ గౌడ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## భగవద్గీత బోధనలు ఆచరించాలి

**జహీరాబాద్, అక్టోబర్ 4:(వుదయం )**



భగవద్గీత బోధనలు ప్రతి ఒక్కరి జీవితంలో ఆచరణలోకి వస్తే వ్యక్తిగతంగా, సామాజికంగా మంచి మార్పు సాధ్యమవుతుందని సంగారెడ్డి జిల్లా కంది అక్షయ పాత్ర బాధ్యులు విభీషణ్ ప్రభూజీ వ్యాఖ్యానించారు. శ్రీల ప్రభుపాదుల ఇస్కాన్ ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలోని శాంతి నగర్ లో ఆదివారం ఉదయం 227 వ నగర సంకీర్తన అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా హనుమాన్ మందిరంలో ఏర్పాటు చేసిన సత్సంగ సమావేశంలో ఆయన భక్తులనుద్దేశించి ప్రవచించారు. కర్మ యోగంలోని ఆరవ శ్లోకంపై వివరణ ఇస్తూ మనిషి నిజమైన ఆధ్యాత్మిక జీవన విధానాన్ని అర్థం చేసుకోవడానికి ఎంతో ముఖ్యమైనదన్నారు.కార్యేంద్రియాలను నియంత్రించినట్లు బయటకు కనిపిస్తూ, మనస్సులో మాత్రం ఇంద్రియ విషయాలను ఆలోచిస్తూ ఉండే వ్యక్తి మిథ్యాచారి అని శ్రీకృష్ణుడు ఈ శ్లోకం ద్వారా తెలియజేశారని ఆయన వివరించారు. మనస్సు, ఇంద్రియాలు నియంత్రణలో ఉన్నప్పుడే మనిషి నిజమైన ఆధ్యాత్మిక పురోగతిని సాధించగలడని, భగవంతుని సేవా భావంతో తన కర్తవ్యాలను నిర్వర్తించడం ద్వారా జీవితం సార్థకమవుతుందని విభీషణ్ ప్రభూజీ పేర్కొన్నారు. "బయటి ప్రవర్తనతో పాటు మనస్సులోని ఆలోచనలు కూడా పవిత్రంగా ఉండాలి. భగవంతుని స్మరిస్తూ, సమాజానికి సేవ చేస్తూ కర్తవ్యాన్ని నిర్వహించడమే నిజమైన ఆధ్యాత్మిక జీవనం" అని ఆయన సందేశం ఇచ్చారు. అంతకుముందు శాంతినగర్ ప్రధాన వీధుల్లో శోభాయాత్ర నిర్వహిస్తూ సంకీర్తన కార్యక్రమాన్ని కొనసాగించారు. కీర్తనలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ భక్తులు కృష్ణ భక్తి భావంలో మునిగిపోయారు. అనంతరం శాంతినగర్ లోని చిన్నారులు స్మార్ట్ ఫోన్ లకు దూరంగా ఉంటూ ఆధ్యాత్మికత వైపు దృష్టి సారించేందుకు చిన్నారుల చేత ప్రతి రోజూ హనుమాన్ చాలీసా పారాయణం, చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరచిన చిన్నారులకు ప్రభూజీ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. శాంతినగర్ నివాసులు వెంకట్ సాగర్ ప్రసాదాన్ని వితరణ చేయగా, జన్మదినోత్సవాన్ని జరుపుకుంటున్న చింత కార్తీక్ కుటుంబాన్ని భక్తులు ఆశీర్వచనాలు అందజేశారు.

**హుగ్గెల్లి లోనూ ఘనంగా 191వ పల్లె సంకీర్తన**

ఇదిలా ఉండగా జహీరాబాద్ మండలం హుగ్గెల్లి గ్రామంలోనూ ఆ గ్రామ హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు పల్లె సంకీర్తన ఘనంగా జరిగింది. గ్రామ ఆంజనేయ స్వామి మందిరం నుండి గ్రామస్థులు శోభాయాత్రను ప్రారంభించి గ్రామ ప్రధాన వీధుల గుండా సాగి తిరిగి మందిరానికి చేరుకొంది. హుగ్గెల్లి గ్రామంతోపాటు పరిసర పల్లెల ప్రజలు సైతం పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

## ఇంద్రారెడ్డి సేవలు చిరస్మరణీయం

- కోటబాస్‌పల్లిలో ఘనంగా మాజీ మంత్రి ఇంద్రారెడ్డి జయంతి వేడుకలు
- ఇంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గూటిక నరసింహారెడ్డి( బాబన్న)

**తాండూర్ అక్టోబర్ 4 వుదయం ప్రతినిధి**

తాండూరు: తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం విశేష కృషి చేసిన మాజీ విద్యాశాఖ మంత్రి, మాజీ హోంమంత్రి, తెలంగాణ ఉద్యమకారుడు స్వర్గీయ ఇంద్రారెడ్డి సేవలు చిరస్మరణీయమని ఇంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, సిటీ కేబుల్ ఎండీ గొట్టిక నరసింహారెడ్డి (బాబన్న) అన్నారు. తాండూరు మండలం కోటబాస్‌పల్లి గ్రామంలో ఇంద్రారెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంద్రారెడ్డి విగ్రహానికి నరసింహారెడ్డి (బాబన్న) పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా సేవ, విద్యాభివృద్ధి, తెలంగాణ ప్రాంత అభ్యున్నతి కోసం ఇంద్రారెడ్డి చేసిన కృషి ప్రజల హృదయాల్లో ఎప్పటికీ నిలిచిపోతుందన్నారు. సమాజం పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత, ప్రజల సమస్యలపై ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.ఇంద్రారెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు సేవ చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని నరసింహారెడ్డి అన్నారు. విద్యా రంగానికి, తెలంగాణ ఉద్యమానికి ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో టీచర్ నాగప్ప, రాజశేఖర్ రెడ్డి, డైరెక్టర్లు వెంకటేష్, నర్సింలు,పలువురు ఇంద్రారెడ్డి అభిమానులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొని నివాళులర్పించారు.





# విగ్రహం సగం.. విరాళాల లెక్కలెక్కడ?

- దేవరగట్టుపై శివుడి విగ్రహం ఎప్పటికి పూర్తవుతుంది?
- ఏళ్లుగా అదే దృశ్యం.. నిర్మాణం ముందుకు కదలదే!
- విరాళాల సేకరణపై ప్రచారం.. ఆదాయ, వ్యయాలపై స్పష్టత ఏదీ?
- ఆలయ అభివృద్ధి హామీల మధ్య భక్తుల నిలదీత

**మల్దకల్ అక్టోబర్ 04 (వుదయం బ్యూరో)**

భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలవాల్సిన దేవరగట్టు.. ప్రస్తుతం ఒక అసంపూర్తి నిర్మాణానికి సాక్షిగా మారింది. దేవరగట్టుపై ఏర్పాటు చేయాలని తలపెట్టిన శివుని విగ్రహం సగంలోనే ఆగిపోయి ఏళ్లు గడుస్తున్నా.. దానికి 'మోక్షం' ఎప్పుడు లభిస్తుందో చెప్పేవారు లేరు. ప్రారంభంలో ఉత్సాహంగా మొదలైన విగ్రహ నిర్మాణం కొంతకాలానికే నిలిచిపోయింది. కాలం గడుస్తోంది.. పాలకులు మారుతున్నారు.. హామీలు వస్తున్నాయి.. కానీ శివుని విగ్రహం మాత్రం అదే అసంపూర్తి రూపంలో దర్శనమిస్తోంది. దీంతో భక్తుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

**ఏళ్లుగా ఇదే ప్రశ్న.. సమాధానం మాత్రం ఎక్కడ?**

విగ్రహం పెడతాం.. నిర్మాణం పూర్తి చేస్తాం" అని చెప్పి పనులు ప్రారంభించినా, మధ్యలో ఎందుకు ఆపాల్సి వచ్చిందన్నది ఇప్పటికీ అంతుచిక్కని ప్రశ్నగా మారింది.నిర్మాణం నిలిచిపోవడానికి అసలు కారణమేంటి? నిధుల కొరతా? నిర్వహణ లోపమా? లేక మరేదైనా కారణమా? సంబంధిత నిర్వాహకులు ఇప్పటికైనా ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. భక్తుల మనోభావాలతో ముడిపడిన నిర్మాణం ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉండటం బాధాకరమని స్థానికులు పేర్కొంటున్నారు. విరాళాలు ఎన్ని.. ఖర్చెంత?" శివుని విగ్రహ నిర్మాణం కోసం కొన్ని లక్షల రూపాయలు విరాళాలుగా సేకరించారనే ప్రచారం స్థానికంగా సాగుతోంది. ఈ ప్రచారంపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. విరాళాలు నిజంగా సేకరించి ఉంటే..

**ఎంత మొత్తం సేకరించారు? ఎవరి ఆధ్వర్యంలో సేకరించారు? ఎంత ఖర్చు చేశారు? ప్రస్తుతం మిగిలిన నిధులు ఎన్ని?**

నిర్మాణం ఎందుకు ఆగిపోయింది? అనే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని భక్తులు కోరుతున్నారు. భక్తుల నుంచి రూపాయి రూపాయి సేకరించినా.. ఆ నిధుల వినియోగంపై లెక్కలు చెప్పాల్సిన బాధ్యత లేదా? అని కొందరు భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఆదాయ, వ్యయ వివరాలను బహిరంగంగా వెల్లడిస్తే అన్ని అనుమానాలకు తెరపడుతుందని వారు చెబుతున్నారు. శివుడి విగ్రహం పూర్తవుతుందా.. ఇదే భక్తుల ఎదురుచూపు దేవరగట్టుపై శివుని విగ్రహం పూర్తయితే ఈ ప్రాంతానికి మరింత ఆధ్యాత్మిక ప్రాధాన్యం పెరుగుతుందని భక్తులు భావిస్తున్నారు. కానీ సంవత్సరాలు గడుస్తున్నా పనులు పూర్తికాకపోవడంతో "ఇక ఎప్పుడు?" అనే ప్రశ్నే మిగిలింది.

నిర్మాణాన్ని వెంటనే పునఃప్రారంభించి, పూర్తి చేయడానికి గడువుతో కూడిన కార్యాచరణను ప్రకటించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. అభివృద్ధి మాటలు చాలవు.. పనులు కనిపించాలి మల్దకల్ శ్రీ తిమ్మప్ప స్వామి దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొస్తామని, తన వంతు కృషి చేస్తానని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హామీ ఇవ్వడం పట్ల భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే హామీలు కాగితాలకే పరిమితం కాకుండా.. పనులు కళ్లముందు కనిపించాలని వారు కోరుతున్నారు. దేవాలయం నుంచి దేవరగట్టు వరకు రహదారి సౌకర్యం,ఆలయానికి తూర్పు ద్వారం, మహిళల కోసం మరుగుదొడ్లు, స్నానపు గదులు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు. బ్రహ్మోత్సవాల వేళ రహదారి కష్టాలు శ్రీ తిమ్మప్ప స్వామి బ్రహ్మోత్సవాల సమయంలో భక్తుల రద్దీ భారీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో దేవరగట్టు వరకు రహదారి సౌకర్యం లేకపోవడం భక్తులకు ఇబ్బందికరంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు.దసరా నుంచే రహదారి పనులు ప్రారంభించి బ్రహ్మోత్సవాల నాటికి భక్తులకు మెరుగైన సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. మహిళలకు కనీస సౌకర్యాలైనా కల్పించాలి వేలాది మంది భక్తులు వచ్చే ఆలయంలో మహిళల కోసం తగిన మరుగుదొడ్లు, స్నానపు గదులు లేకపోవడం ఇబ్బందికరంగా మారుతోందని భక్తులు చెబుతున్నారు. ఆలయ అభివృద్ధిలో భారీ నిర్మాణాలకే ప్రాధాన్యం ఇవ్వకుండా భక్తులకు నిత్యావసరమైన మౌలిక సదుపాయాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని వారు కోరుతున్నారు. ఇకనైనా లెక్క తేల్చాలి.. పనులు పూర్తి చేయాలి చారిత్రక ప్రాధాన్యం ఉన్న క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పడం మాత్రమే కాకుండా.. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులపై సమీక్ష నిర్వహించి, ఏ పని ఎప్పటికి పూర్తవుతుందో స్పష్టమైన కాలపట్టిక ప్రకటించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. సగంలో ఆగిన శివుని విగ్రహం.. స్పష్టత లేని విరాళాల ప్రచారం.. అసౌకర్యాల మధ్య భక్తుల రాకపోకలు.. ఏళ్లుగా ఎదురుచూస్తున్న రహదారి.. ఇవన్నీ ఎప్పుడు పరిష్కారమవుతాయన్నదే ఇప్పుడు మల్దకల్ భక్తుల ముందున్న ప్రధాన ప్రశ్న. శివుడి విగ్రహానికి మోక్షమెప్పుడు? భక్తుల విరాళాలకు లెక్కెప్పుడు? దేవరగట్టు అభివృద్ధికి కార్యాచరణ ఎప్పుడు?' ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆలయ నిర్వాహకులు ఇకనైనా స్పందించి స్పష్టమైన సమాధానం ఇవ్వాలని భక్తులు కోరుతున్నారు.

# అక్టోబర్ 18న సద్దుల బతుకమ్మ, అక్టోబర్ 20న దసరా పండుగ

- పట్టణ పుర ప్రముఖుల సమావేశంలో నిర్ణయం
- ప్రశాంత వాతావరణంలో.. ఆనందోత్సాహాల మధ్య పండుగలు నిర్వహించుకోవాలి..
- ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్చెరు (వుదయం):**

పటాన్చెరు డివిజన్ పరిధిలో సద్దుల బతుకమ్మ పండుగను అక్టోబర్ 18 ఆదివారం రోజున, దసరా పండుగను అక్టోబర్ 20 మంగళవారం రోజున నిర్వహించుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖుల సమావేశంలో నిర్ణయించారు. ఆదివారం ఉదయం పటాన్చెరు పట్టణంలోని శ్రీ కోదండ సీతారామ స్వామి దేవాలయంలో పండుగ తేదీలపై మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అధ్యక్షతన.సమావేశం నిర్వహించగా..స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అక్టోబర్ 18వ తేదీ, ఆదివారం సాయంత్రం పట్టణంలోని సాకి చెరువు కట్టపై సద్దుల బతుకమ్మ సంబరాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దసరా పండుగను అక్టోబర్ 20 తేదీ సాయంత్రం 05:00 గంటలకు జిహెచ్ఎంసి కార్యాలయం ఎదుట ధ్వజారోహన నిర్వహించి, కొత్త మార్కెట్ ప్రాంగణంలో జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించాలని నిర్ణయించారు. అనంతరం సాయంత్రం ఏడు గంటలకు మైత్రి మైదానంలో మహిషాసుర దహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాలతో పండుగలు నిర్వహించుకోవాలని కోరారు. ప్రభుత్వపరంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, సపాన దేవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ జడ్పీటీసీ మాణిక్యం, పురోహితులు నరసింహ చారి, పట్టణ పుర ప్రముఖులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.



# తీర్మానాల తిమ్మినిబమ్మిని!

- సర్పంచ్‌నే బెదిరిస్తారా?
- దొడ్డిదారిన ప్రభుత్వ భూముల దందా!
- సర్వే నంబర్ 245Aలో 2-11 ఎకరాల స్థలంపై 'స్కెచ్'
- కేజీబీవీ, ఎఫ్‌సీఐ గోదాంల పేరిట అక్రమ కేటాయింపులకు కుట్ర
- సంతకం పెట్టలేదని వీధిరచ్చ.. గట్టు సర్పంచ్ నాగరాజు ఫిర్యాదు!

**గట్టు అక్టోబర్ 04 (వుదయం బ్యూరో)**

గట్టుగ్రామపంచాయతీల్లో ప్రజాస్వామ్య వ్యవస్థను పాతరేస్తూ, అధికార బలంతో ప్రభుత్వ భూములను నొక్కేసేందుకు జరుగుతున్న కుట్రలు గట్టు మండలంలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. సర్పంచ్‌కు కనీస సమాచారం లేదు.. పంచాయతీ బోర్డులో చర్చ అంతకంటే లేదు.. కానీ గట్టు మండల కేంద్రంలోని అత్యంత విలువైన సర్వే నంబరు 245/A లో ఉన్న 2 ఎకరాల 11 గుంటల ప్రభుత్వ భూమిపై కొందరి కన్ను పడింది. ఎఫ్‌సీఐ గోదాం నిర్మాణంతో పాటు కేజీబీవీ కళాశాల పేరు చెప్పి దొడ్డిదారిన ఈ భూములను కట్టబెట్టేందుకు 'అక్రమ తీర్మానాల' దందాకు తెరదీశారు. తీర్మాన పత్రాలపై వెంటనే సంతకం చేయాలని, లేకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయంటూ ఏకంగా పంచాయతీ ప్రథమ పౌరుడినే బెదిరింపులకు గురిచేయడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. సంతకానికి నిరాకరించిన సర్పంచ్‌ను నలుగురి ముందూ అసభ్యకర పదజాలంతో దూషించి రచ్చరచ్చ చేశారు. ఈ అక్రమ కేటాయింపుల వ్యవహారంపై సర్పంచ్ నాగరాజు శనివారం గట్టు పోలీసులను ఆశ్రయించడంతో ఈ భూభాటోపం బట్టబయలైంది. సభ పూర్తవగానే మొదలైన 'నాటకం'! శుక్రవారం గట్టు పంచాయతీ కార్యాలయం వేదికగా ఉపాధి హామీ పనులపై గ్రామ సభ నిర్వహించారు. సభ ముగిసి సభ్యులంతా ఇళ్లకు వెళ్తున్న సమయంలో ఉప సర్పంచ్ భర్త, కొందరు వార్డు సభ్యులు ఒక పక్కా వ్యూహం ప్రకారం దొంగ తీర్మానాల కాగితాలతో సర్పంచ్ వద్దకు వచ్చారు. మండల కేంద్రంలో సర్వే నంబరు 245/A లో 2.11 ఎకరాల భూమి అందుబాటులో ఉందంటూ, అక్కడ ఎఫ్‌సీఐ గోదాం నిర్మించేందుకు స్థలం కేటాయిస్తున్నట్లు తీర్మానంలో రాసుకొచ్చారు. దీనితో పాటు కేజీబీవీ కళాశాల నిర్మాణానికి కూడా స్థలాన్ని కేటాయిస్తున్నట్లు కాగితాల్లో పొందుపరిచారు. సర్పంచ్ ప్రమేయం లేకుండా, కనీస సమాచారం ఇవ్వకుండా తయారు చేసిన ఆ తీర్మాన పత్రాలపై వెంటనే పంచాయతీ సీలు వేసి సంతకం పెట్టాలని సర్పంచ్‌పై విరుచుకుపడ్డారు. భూముల కేటాయింపుల వెనుక ఉన్న అసలు రంగును పసిగట్టిన సర్పంచ్ నాగరాజు.. నిబంధనలు పరిశీలించకుండా, సమగ్ర వివరాలు తెలియకుండా సంతకం చేసేది లేదని ఖరాకండిగా తేల్చిచెప్పారు.

ముందు సంతకం పెట్టు.. తర్వాత నీ సంగతి చూస్తాం!' సర్పంచ్ నుంచి ఊహించని నిరాకరణ ఎదురవడంతో ఆ గ్యాంగ్ తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయింది. "ముందు సంతకం పెట్టు.. తర్వాత ఏం చేయాలో చూసుకుందాం!" అంటూ హుకుం జారీ చేస్తూ బెదిరింపులకు దిగారు. చట్టబద్ధత లేని అక్రమ తీర్మానాలపై సంతకం పెట్టనని సర్పంచ్ స్పష్టం చేయడంతో, విధి నిర్వహణలో ఉన్న ఆయనపై అనుచితంగా ప్రవర్తిస్తూ బూతులతో విరుచుకుపడ్డారు. ప్రజాప్రతినిధి అని కూడా చూడకుండా నడిరోడ్డుపై పంచాయతీని రచ్చకెక్కించారు.

**పోలీస్ స్టేషన్‌కు చేరిన పంచాయతీ రచ్చ**

పంచాయతీరాజ్ చట్టాలను తుంగలో తొక్కి, తనపై ఒత్తిడి తెచ్చి సర్వే నంబరు 245/A లోని భూములకు సంబంధించి అక్రమ తీర్మానాలను ఆమోదింపజేసుకోవాలని చూసిన బాధ్యులపై సర్పంచ్ నాగరాజు గట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు తెలియకుండా దొంగ తీర్మానాలు రూపొందించడం, సంతకం చేయాలని బెదిరించడం, నిరాకరించి నందుకు దూషించడంపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ ఘటనతో గట్టు గ్రామపంచాయతీలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. సర్వే నంబరు 245/A లోని భూములను సొంత అవసరాలకు, అనుకూలురకు కట్టబెట్టేందుకే ఈ నాటకం ఆడారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు ఈ వ్యవహారంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

# మృత్యువు ముంగిట వీరవిహారం వందల ప్రాణాలకు వజ్రకవచం!

- ఆకాశంలో ప్రాణపణంగా 'మచ్చార్' పోరాటం!
- తీవ్ర గాయాలతోనూ చెక్కుచెదరని ధైర్యం.. కడవరకూ నడిపిన కర్తవ్యదీక్ష!
- ఫ్లైదుబాయ్ ప్రమాదంలో మృత్యుముఖం నుంచి ప్రయాణికులను కాపాడిన ధీరుడు
- దేశం గర్వించదగ్గ వీరుడు కెప్టెన్ స్మిత్ మచ్చార్: సరిత తిరుపతయ్య

**గద్వాల, అక్టోబర్ 04 (వుదయం కరస్పాండెంట్)**



ఒకవైపు శరీరంలో ప్రవహిస్తున్న రక్తం.. మరోవైపు నరనరాన్నీ దహించివేస్తున్న తీవ్ర గాయాల నొప్పులు! ప్రాణాలు పోయేందుకు క్షణ కాలం చాలు.. కానీ ఆకాశంలో ఆ వీరుడి సంకల్పం ముందు మృత్యువు కూడా మోకరిల్లక తప్పలేదు! ఆపద ఘడియల్లో తన ప్రాణాన్ని పణంగా పెట్టి, వందలాది మంది ప్రయాణికుల ప్రాణాలకు వజ్రకవచమై నిలిచిన కెప్టెన్ స్మిత్ మచ్చార్ అసాధారణ ధైర్యసాహసాలకు యావత్ భారతావని శిరస్సు వంచి సెల్యూట్ చేస్తోందని తెలంగాణ రాష్ట్ర షీప్స్ అండ్ గోట్స్ సహకార కార్పొరేషన్ చైర్‌పర్సన్, గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీమతి సరిత తిరుపతయ్య ఘనంగా కొనియాడారు. ఫ్లైదుబాయ్ (FZ1073) విమానంలో చోటుచేసుకున్న తీవ్ర భయానక ఘటనలో కెప్టెన్ మచ్చార్ ప్రదర్శించిన అసాధారణ సమయస్ఫూర్తి, అసమాన వృత్తి నిబద్ధతలను ఆమె శ్లాఘించారు. ఈ సందర్భంగా సరిత తిరుపతయ్య మాట్లాడుతూ... "మరణం ముంగిట నిలబడినా ఆయన గుండె ధైర్యం చెక్కుచెదరలేదు. తన ప్రాణాపాయాన్ని మరచి, ప్రయాణికులను క్షేమంగా దించే వరకూ రక్తమోడుతున్న చేతులతోనే విమాన స్టీరింగ్‌ను వీడకుండా నిలబడటం సామాన్యమైన విషయం కాదు! ఇది కేవలం ధైర్యం మాత్రమే కాదు... అసమానమైన త్యాగనిరతి, వీరత్వం" అని కొనియాడారు. కెప్టెన్ మచ్చార్ చూపిన ఈ పోరాట పటిమ ప్రపంచవ్యాప్తంగా భారతీయుల ధీరత్వానికి, పట్టుదలకు ఆమోఘమైన గుర్తింపు తీసుకువచ్చిందని సరిత తిరుపతయ్య పేర్కొన్నారు. వందలాది కుటుంబాల్లో వెలుగులు నింపి, భారత గౌరవాన్ని ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్లిన కెప్టెన్ స్మిత్ మచ్చార్ త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు, సంఘీభావాన్ని తెలియజేశారు.

# కేసీఆర్ నగర్‌లో గార్వి సెలబ్రేషన్స్

- లబ్ధిదారులతో సోమిరెడ్డి మాటామంతి

**వుదయం, తెల్లాపూర్ ప్రతినిధి (అక్టోబర్ 4)**



తెల్లాపూర్ డివిజన్ కేసీఆర్ నగర్ ఫేస్ 2లోని 89వ బ్లాక్‌లో గార్వి సెలబ్రేషన్స్ నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ చైర్మన్ మల్లేపల్లి సోమిరెడ్డి హాజరై మహిళలు, లబ్ధిదారులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం 114, 22వ బ్లాక్‌ల లబ్ధిదారులతో మాటామంతి నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. "మీకు అండగా ఉంటా.. భయపడొద్దు. మరో రెండేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది" అని సోమిరెడ్డి భరోసా కల్పించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన జహీంఘీర్, టీమ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు శ్రీశైలం, నాగరాజు, శ్రీకాంత్ రెడ్డి, కేసీఆర్ నగర్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిలో ఎకరాలకు ఎకరాలు.. గుట్టలు మాయం!

- సెలవు రోజులను ఆసరాగా చేసుకుని మట్టి తవ్వకాలు?
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారంటూ అధికారులపై విమర్శలు

**కోహీర్, అక్టోబరు 4 (వుదయం ప్రతినిధి):**





సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ మండల పరిధిలో ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.మండలంలోని పలు గ్రామాల్లో గుట్టలను యథేచ్ఛగా తొలగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రత్యేకంగా ప్రభుత్వ భూములను లక్ష్యంగా చేసుకుని మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని చెబుతున్నారు.

**సెలవు రోజుల్లోనే తవ్వకాలకు తెర?**

ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు ఉన్న రోజులను ఆసరాగా చేసుకుని మట్టి తవ్వకాలు, తరలింపు జరుగుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. జేసీబీలు, టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తూ వ్యాపారం సాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.పగటిపూటతో పాటు కొన్ని సందర్భాల్లో ఇతర సమయాల్లోనూ తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం.

మట్టి తవ్వకాలపై అధికారులు గతంలో పలుమార్లు జరిమానాలు విధించినప్పటికీతవ్వకాలు మాత్రం పూర్తిగా నిలిచిపోవడం లేదని స్థానికులు అంటున్నారు. జరిమానాలు విధించినా మళ్లీ అదే ప్రాంతాల్లో తవ్వకాలు కొనసాగుతున్నాయని ఆరోపిస్తున్నారు.

**దీంతో ప్రభుత్వ నిబంధనల అమలుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ..**

కోహీర్ మండలంలోని చింతల్‌ఘాట్, కొత్తూరు,(డి )సజ్జాపూర్, పైగిడిగుమ్మల్ తదితర గ్రామాల పరిధిలో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.కొన్ని ప్రాంతాల్లో గుట్టలు తొలగిపోవడంతో భూభాగ స్వరూపమే మారుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.ప్రభుత్వ భూములు, సహజ వనరుల పరిరక్షణపై అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

**ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందా?**

అనుమతులు, నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలింపు జరిగితే ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి నష్టం వాటిల్లే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అక్రమ తవ్వకాలపై పూర్తిస్థాయి తనిఖీలు నిర్వహించిఅనుమతులు ఉన్నాయా లేదా అన్న విషయాన్ని అధికారులు స్పష్టం చేయాలని కోరుతున్నారు.మట్టి తవ్వకాలపై ఫిర్యాదులు వచ్చిన ప్రతిసారి చర్యలు తీసుకోవడం కాకుండాశాశ్వతంగా సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రభుత్వ భూముల సరిహద్దులను గుర్తించి ప్రత్యేకంగా పర్యవేక్షణ చేపట్టాలని కోరుతున్నారు.

అనుమతులు లేకుండా తవ్వకాలు జరిగితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అంటున్నారు.

**ఉన్నతాధికారులు దృష్టి సారించాలి**

కోహీర్ మండలంలో మట్టి తవ్వకాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని

**స్థానిక ప్రజలు కోరుతున్నారు.**

సెలవు రోజుల్లో కూడా తవ్వకాలు జరగకుండా పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని సూచిస్తున్నారు.

ప్రభుత్వ భూములు, గుట్టలు, సహజ వనరులను రక్షించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తవ్వకాలకు సంబంధించిన అనుమతులు, జరిమానాలు, గతంలో తీసుకున్న చర్యలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.అని కోహీర్ మండలం ప్రజలు అంటున్నారు.

# డాక్టర్లపై అధికారుల దాడులు అరికట్టాలి నిరసన ర్యాలీ ఆమనగల్

**రంగారెడ్డి జిల్లా ( వుదయం ప్రతినిధి )**



రంగారెడ్డి జిల్లా ఆమనగల్ ఆమనగల్ మున్సిపాలిటీ పట్టణంలో కల్వకుర్తి నియోజకవర్గం సంబంధించిన ప్రైవేటు ప్రాక్టీస్ చేస్తున్న డాక్టర్లు అందరూ ఆమనగల్ పట్టణంలో నిరసన ర్యాలీ వ్యక్తం చేశారు, గతం 40 సంవత్సరాల నుంచి ప్రాక్టీస్ చేస్తున్న డాక్టర్లపై అధికారులు దాడులకు పాల్పడ్డారని కల్వకుర్తి నియోజకవర్గం ప్రైవేట్ డాక్టర్స్ యూనియన్ సభ్యులందరూ ఆమనగల్ పట్టణానికి చేరి ఆమనగల్ మున్సిపల్ చైర్మన్ పత్యానాయక ఆధ్వర్యంలో వైద్యులందరూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడి నుండి ర్యాలీగా తీస్తూ రాజీవ్ గాంధీ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు మా పై జరుగుతున్న దాడులు అరికట్టాలని మాకు తగిన గుర్తింపు ట్రైనింగ్ ఇచ్చి ప్రభుత్వం వెంటనే ఉపాధి కల్పించాలని కోరారు ఐఎంఏ అసోసియేషన్ వారు మా పై దాడులు చేయకుండా చూడాలని మేం కూడా రాష్ట్రవ్యాప్తంగా ఒకటిన్నర లక్షల మంది పైగా ఉన్నామని ప్రభుత్వం గుర్తించాలన్నారు ఆమనగల్ మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ మాట్లాడుతూ ఆస్పత్రులపై అధికారులు దాడిచేయడంసరికాదన్నారు వారు 50 సంవత్సరాల నుండి అనుభవంతో వైద్యం చేసిన అనుభవం ఉందన్నారు, ప్రభుత్వ కాలేజీలోనే చదివి బిహెచ్ఎంఎస్, బి యు ఎం ఎస్, బి ఎ ఎం ఎస్ వారు ప్రభుత్వ సీట్లలో చదివి ఇప్పుడు అల్లోపతి వైద్యం చేయవద్దు అంటే వారు ఎలా బతకాలని నిలదీశారు, అలాగే ఆర్ఎంపి వైద్యులకు గత 15 సంవత్సరాల క్రితం గత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆర్.ఎం.పి పి.ఎం.పిలకు ఒక సంవత్సరం కాలం పాటు ట్రైనింగ్ ఇచ్చారు ఇప్పటికైనా వారిని ప్రభుత్వం గుర్తించి వారు ఎలాంటి అనుమతి పత్రాలు ఇవ్వకున్నా సరే దాడులు ఆపాలన్నారు,బ్రతుకుతెరువు కోసం వాళ్లు అదే వృత్తిని నమ్ముకున్నారు కాబట్టి వారిపై దాడులుజరగకుండా చూడాలన్నారు, వాళ్లపై దాడు జరిగితే ఏ ప్రభుత్వానికి అయినా నష్టమే జరుగుతుందని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో ప్రత్యానాయక్ స్వామి భాస్కర్ విజయ్ శేఖర్ పర్వతాలు వెంకటేష్ శ్రీనివాస్ గుప్తా చందు నాయక్ వెంకటేష్ కృష్ణా నాయక్ విజయ్ తుమ్మల రమేష్ ప్రసాద్ వెంకటాచారి శేఖర్ మల్లేష్ తిరుపతయ్య యాదయ్య రమేష్ శ్రీనివాస్ ఇలా 500 మంది పైగా వైద్యులు పాల్గొన్నారు

# వన్యప్రాణి వారోత్సవాల్లో పాములపై అవగాహన




**అచ్చంపేట, అక్టోబరు 4 (వుదయం ప్రతినిధి):**

వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ఆదివారం అచ్చంపేట పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో వాకర్స్ క్లబ్ సభ్యులకు పాముల సంరక్షణ, రక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రజల్లో వన్యప్రాణుల పట్ల అవగాహన పెంపొందించడం, పాముల పట్ల ఉన్న అపోహలను తొలగించడం, పాములుమనుషుల మధ్య సురక్షిత సహజీవనాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.ఈ సందర్భంగా స్నేక్ క్యాచర్ సుమన్, జూనియర్ అసిస్టెంట్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ హన్మంతు నాయక్ పాముల వివిధ జాతులు, వాటి గుర్తింపు, విషపూరిత మరియు విషరహిత పాముల మధ్య తేడాలు, ప్రవర్తన, నివాస ప్రాంతాలపై వివరించారు. పాములు పర్యావరణ సమతుల్యతలో పోషించే కీలక పాత్ర, ఎలుకలు, ఇతర హానికర జీవుల నియంత్రణలో ప్రాధాన్యతను తెలియజేశారు.ఇళ్లలోకి లేదా నివాస ప్రాంతాల్లోకి పాములు ప్రవేశించినప్పుడు భయాందోళనకు గురికాకుండా వాటిని చంపకుండా, దూరంగా ఉండి శిక్షణ పొందిన స్నేక్ రెస్క్యూ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. పాములను పట్టుకునే సమయంలో పాటించాల్సిన భద్రతా చర్యలు, పాముకాటుకు గురైనప్పుడు తీసుకోవాల్సిన తక్షణ జాగ్రత్తలు, మూఢనమ్మకాలకు దూరంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు.పాములు ప్రకృతిలో ముఖ్యమైన జీవులని, వాటి ఉనికి అటవీ పర్యావరణ వ్యవస్థ సమతుల్యతకు అవసరమని తెలిపారు. ప్రతి పాము ప్రమాదకరం కాదని, భయంతో అనవసరంగా చంపకుండా వన్యప్రాణి సంరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని అవగాహన కల్పించారు. వాకర్స్ క్లబ్ సభ్యులు ఆసక్తిగా పాల్గొని పాములకు సంబంధించిన పలు సందేహాలను అడిగి తెలుసుకున్నారు. ఇటువంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు తెలిపారు. వన్యప్రాణి వారోత్సవాలు 2026 సందర్భంగా ప్రజల్లో ప్రకృతి, వన్యప్రాణులు, జీవవైవిధ్య పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు అటవీ శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు కొనసాగుతాయని జిల్లా అటవీ అధికారి రేవంత్ చంద్ర తెలిపారు.

# గ్యార్మి ఉత్సవాల్లో ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



**వెల్దండ అక్టోబర్ 4 (వు దయం)**

మండల పరిధిలోని చేర్యాకర్ గ్రామంలో ఎండీ అలీలుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్యార్మి ఉత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారుఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, మండల BRS పార్టీ అధ్యక్షులు పుట్ట రాంరెడ్డి,చేర్యాకర్ గ్రామ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు,మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, జిల్లా నాయకులు నాగులు నాయక్,మాజీ సర్పంచ్ రామచంద్రయ్య,మాజీ ఎంపీటీసీలు భీమయ్య గౌడ్,జ్యోతి నిరంజన్,చందు నాయక్,మాజీ BRS పార్టీ అధ్యక్షులు జోగాయ్య,మాజీ సర్పంచ్లు అంజి నాయక్,శంకర్ నాయక్,డీలర్ మైసయ్య,ఉపసర్పంచ్ కొండల్,మాజీ ఉప సర్పంచ్లు నరసింహ ముదిరాజ్, నర్సింహా,వార్డు సభ్యులు పురుగుల లాలయ్య, పురుగుల రమేష్, కేశమోని జంగయ్య,ఆనంద్,పోలె అశోక్,గొర్రె జంగయ్య,సత్యం, మీసాల రాజు, రామ రాజు,అల్లే సందీప్,గాండ్ల జంగయ్య,గుదే వెంకటయ్య, జంగిలి యాదగిరి,మత పెద్దలు md స్కైలాబ్, md బాబా, md గౌస్, md సఖిల్,SC సెల్ అధ్యక్షులు నాగయ్య,సతీష్,సుభాష్,కృష్ణ,గణేష్, శ్రీను,గ్రామస్థులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**వుదయం న్యూస్ శివ్వంపేట అక్టోబర్ 04.....**

మెదక్ జిల్లా శివ్వంపేట: మండలంలోని గోమారం గ్రామానికి చెందిన మంచోళ్ల వెంకటేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఆదివారం గోమారం గ్రామంలోని వెంకటేష్ నివాసానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఎమ్మెల్యే వెంట జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, బిక్షపతి రెడ్డి, లక్ష్మణ్, నర్సింగ్, దేవేందర్ తదితరులు ఉన్నారు.





# సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణి



**వెల్దండ అక్టోబర్ 4 (వు దయం)**

మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో రాచూర్ గ్రామానికి చెందిన 62 మంది రైతులకు ఆదివారం సబ్సిడీ వేరుశనగ (పల్లి విత్తనాలు) పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ యాదయ్య, యువ నాయకులు పడకంటి వెంకటేష్, మేనేజర్ శరత్, VOA లు హైమావతి, జ్యోతి, గ్రామస్థులు కొంగల్ల మల్లయ్య, గుత్తి సత్యనారాయణ, దుబ్బ ఎల్లయ్య, సతీష్‌కుమార్, రౌతు మహేశ్వర్ గౌడ్,కొంగల్ల ఆనంద్, గుత్తి శ్రీశైలం,గుత్తి రామకృష్ణ, బండ శ్రీశైలం,మల్లేష్,తదితరులు ఉన్నారు.

# ఈ పొరపాట్లు వద్దు!

ప్రస్తుతం మేకప్ ప్రతి ఒక్కరి జీవనశైలిలో భాగమైపోయింది. అయితే ఈ విషయంలో కొంతమంది కొన్ని షార్ట్‌కట్స్ ఫాలో అవుతుంటారు. మరి, ఇవి మంచివో, కావో తెలుసుకుందాం రండి..

ఆఫీస్ పూర్తవగానే మీరు ఒక ఫంక్షన్‌కు వెళ్లాల్సి ఉంది. ఇంటికొచ్చి తయారై వెళ్లే సమయం లేదు. నేరుగా ఆఫీస్ నుంచే ఫంక్షన్‌కు వెళ్లాల్సి వస్తే ఏం చేస్తారు? ఉదయం వేసుకున్న మేకప్‌పై నుంచే తిరిగి టచప్ ఇస్తుంటారు చాలామంది. కానీ అదే వద్దంటున్నారు నిపుణులు. ఎందుకంటే మేకప్ పైన వేసే మేకప్ సరిగా సెట్ అవ్వదు. పైగా ఎబ్బెట్టుగా కనిపిస్తుంది. చర్మం బాగా ఎండిపోయినట్లు నిర్జీవంగా మారిపోవడమే కాకుండా మొటిమలు కూడా వచ్చే అవకాశాలు ఎక్కువంటున్నారు.

చాలామంది మేకప్ వేసుకున్నాం కదా.. ఇంక సన్‌స్క్రీన్ అవసరం ఉండదులే అనుకుంటారు. కానీ అది పొరపాటు. మిగతా సమయాల్లో ఎలా ఉన్నా మధ్యాహ్న పగటి సమయంలో బయటకు వెళ్లాల్సి వస్తే తప్పకుండా సన్‌స్క్రీన్ రాసుకోవాలి. ఎందుకంటే సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల నుంచి చర్మాన్ని రక్షించగలిగేది సన్‌స్క్రీన్ మాత్రమే. సన్‌స్క్రీన్ రాసుకున్న తర్వాత దాని మీద మామూలుగా మేకప్ వేసుకున్నా సెట్ అవుతుందంటున్నారు నిపుణులు. మీరు ఉపయోగించే మేకప్ బ్రష్‌లను తరచూ శుభ్రం చేయాలంటున్నారు నిపుణులు. ఎందుకంటే.. శుభ్రం చేయని బ్రష్‌లపై బ్యాక్టీరియా చేరుతుంది.. వాటిని తిరిగి ఉపయోగిస్తే లేనిపోని చర్మ సమస్యలు కొని తెచ్చుకున్నట్లే. అందుకే మేకప్‌కి ఉపయోగించే బ్రష్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం తప్పనిసరి.

పొద్దున్నే లేచి, తలస్నానం చేసేసరికే ఆఫీసు టైం దగ్గర పడుతుంది. ఇక తల ఆరబెట్టుకునే టైం ఎక్కడుంటుంది? అందుకే గబగబా హెయిర్ డ్రయర్‌తో ఆరబెట్టేసి, స్ట్రెయిట్‌నర్‌తో స్ట్రెయిట్ చేసేసి, నచ్చిన హెయిర్ స్టైల్ వేసేసుకుంటారు చాలామంది. కానీ దానివల్ల జుట్టు ఆరోగ్యానికి నష్టం వాటిల్లుతుంది అంటున్నారు నిపుణులు. హెయిర్ డ్రయర్స్, స్ట్రెయిట్‌నర్స్, కర్లర్స్.. ఇవన్నీ ఎక్కువ వేడిని విడుదల చేస్తాయి. ఫలితంగా జుట్టులో ఉండే సహజ నూనెలు ఆవిరైపోతాయి. కాసేపటికే జుట్టు గరుకుగా, నిర్జీవంగా తయారవుతుంది. కాబట్టి తలస్నానం చేసిన తర్వాత జుట్టుని సహజంగా ఆరనిస్తేనే అన్ని విధాలా మంచిది. అలాగే తడిగా ఉన్న జుట్టును కూడా దువ్వకూడదు. ఆరకుండా జడ వేసుకోకూడదు. ఈ విషయాల్లో నిర్లక్ష్యం వహిస్తే జుట్టు ఎక్కువగా రాలిపోతుంది.

పార్టీకో, ఫంక్షన్‌కో వెళ్లొచ్చి బాగా అలసిపోయారు. ఇక, ఏ పనీ చేసే ఓపిక లేక అలాగే వెళ్లి మంచం ఎక్కేస్తారు. ఇలా చేస్తే మీ చర్మానికి మీరే హాని తలపెట్టినట్లవుతుంది. ఎందుకంటే ముందు మీ ముఖానికి ఉన్న మేకప్‌ను పూర్తిగా తొలగించుకోవాలి. లేదంటే మేకప్ అవశేషాలతో చర్మ రంధ్రాలు మూసుకుపోయి మృతకణాలు, మొటిమల సమస్యలు తప్పవంటున్నారు నిపుణులు.

మేకప్ సామగ్రి కొన్న తర్వాత అవి ఎన్ని రోజులు ఇంట్లో అలానే ఉన్నా వాటిని ఉపయోగిస్తూనే ఉంటాం. కానీ, వీటి గడువు తేదీని కూడా ఎప్పటికప్పుడు గమనించాలంటున్నారు నిపుణులు. ఒకవేళ ఎక్స్‌పైరీ దాటిన ఉత్పత్తులను ఉపయోగిస్తే అలర్జీలు, చర్మ సంబంధిత సమస్యలు తలెత్తే ప్రమాదం ఎక్కువంటున్నారు. కాబట్టి గడువు తేదీని బట్టి ఏడాదికోసారి మేకప్ ఉత్పత్తులు మార్చడం మంచిదని సూచిస్తున్నారు నిపుణులు.



# చక్కని ఆరోగ్యం

## ఇదేం తలనొప్పి?

'అబ్బబ్బ అసలే తలనొప్పిగా ఉంటే...' పిల్లలు అల్లరి చేస్తున్నా, శ్రీవారు మాటిమాటికీ పనులతో విసిగించినా చెప్పే మాటే! పైగా తరచూ అంటుంటాం కూడా. అలాగని ఊరికే అనం. నిజంగానే పదే పదే పలకరిస్తూ ఉంటుంది. కేవలం మాత్రలు వేసుకుని ఊరుకుంటున్నారేమో! వీటినీ చెక్ చేసుకోవాలి.



'పనుల్లో పడితే నీళ్లే గుర్తుండవు' చాలామంది ఆడవాళ్లు చెప్పే మాటే! కానీ ఈ నిర్లక్ష్యం ప్రభావం పడేది మెదడు మీదేనట. అది కొనసాగి కొంతసేపయ్యాక తలనొప్పిగా కనిపిస్తుంది. ఏడు గంటల కనీస నిద్ర చాలు... అనుకుంటున్నారేమో! ఒకరోజు పదింటికి, మరోరోజు అర్ధరాత్రి దాటాక... ఇలా రోజుకో రకంగా పడుకున్నారనుకోండి. వేళలు పాటించకపోయినా ఇది పలకరించేస్తుందట. కాబట్టి, మెదడుని గజిబిజి చేయకండి. లేదంటే ఇలా ఇబ్బంది పెడుతుందట. ఎలా కూర్చుంటున్నారు? సిస్టమ్, మొబైల్‌లోకి చూస్తున్నప్పుడు తెలియకుండానే తలను ముందుకు వంచి ఉంచుతాం. ఆ ప్రభావం పుర్రె ఎముకల మీద పడుతుందట. ఇక స్క్రీన్ చూస్తే కళ్లు ఆర్పనే ఆర్పం. ఈ ప్రభావమూ జతై తలనొప్పికి దారి తీస్తుంది. ఉపవాసాలు, పనిలో పడి మర్చిపోవడం... మనల్ని తిండికి దూరం చేసే కారణాలెన్నని? ఇలా గంటలకొద్దీ తినకుండా ఉంటే గ్లూకోజ్ స్థాయులు తగ్గుతాయి. అదీ ఇలా బయటపడుతుందట. ఇవి చాలవన్నట్లు ఒత్తిడి తోడు. అది దరిచేరితే తెలియకుండానే దవడలు బిగించి ఉంచుతామట, భుజాలూ పైకి లేస్తాయట. ఆ కండరాలన్నీ పట్టినట్లయ్యి తలనొప్పికి దారితీస్తాయట. కాబట్టి, ట్యాబ్లెట్లు మింగుతూ వెళ్లకండి. కారణాన్ని గమనించుకోండి. దానికి తగ్గట్టుగా జీవనశైలిలో మార్పులు చేసుకోండి. అలాగని తీవ్రంగా వస్తుంటే వదిలేసేరు. అప్పుడు మాత్రం నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాల్సిందే.

## కుక్క కరిచినా, గోళ్లతో గాయం చేసినా ఎంతో ప్రమాదకరం..

కుక్క కాటు లేదా గోళ్లతో చేసిన గాయం చిన్నదిగా కనిపించినా, రేబిస్ ప్రమాదం ఉన్నప్పుడు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. రేబిస్ అనేది కేంద్ర నాడీ వ్యవస్థపై ప్రభావం చూపించే వైరస్ వ్యాధి. ఒకసారి వ్యాధి లక్షణాలు కనిపించడం ప్రారంభమైన తర్వాత ఇది దాదాపు ప్రాణాంతకంగా మారుతుంది. అయితే జంతువు కరిచిన వెంటనే సరైన ప్రథమ చికిత్స, అవసరమైన రేబిస్ టీకా, ఇతర చికిత్సలు తీసుకుంటే ఈ వ్యాధిని నివారించవచ్చు. ప్రపంచవ్యాప్తంగా మానవుల్లో వచ్చే రేబిస్ కేసుల్లో దాదాపు 99 శాతం కుక్కల వల్లే వస్తున్నాయి. భారత్‌లో ప్రతి ఏడాది సుమారు 91 లక్షల జంతు కాటు ఘటనలు జరుగుతుండగా, వాటిలో మూడు వంతులకు పైగా కుక్కల వల్లే సంభవిస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాలు చెబుతున్నాయి. అందుకే కుక్క కాటు లేదా అనుమానాస్పదంగా దాడి చేసిన వెంటనే చికిత్స తీసుకోవడం చాలా ముఖ్యం. కుక్క కరిచిన వెంటనే ముందుగా గాయాన్ని కనీసం 15 నిమిషాల పాటు సబ్బు, ప్రవహించే నీటితో శుభ్రంగా కడగాలి. గాయాన్ని కేవలం తుడవడం లేదా కొద్దిసేపు నీటితో కడగడం సరిపోదు. ఇలా కడగడం వల్ల గాయంపై ఉన్న లాలాజలం, వైరస్ పరిమాణాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. అందుబాటులో ఉంటే కడిగిన తర్వాత అయోడిన్ కలిగిన లేదా వైరస్‌ను నిర్వీర్యం చేసే ద్రావణాన్ని ఉపయోగించవచ్చు. అయితే గాయంపై కారం పొడి, మొక్కల రసాలు, ఆమ్లాలు, క్షారాలు లేదా ఇతర హానికరమైన పదార్థాలను రాయకూడదు. ఇవి రేబిస్‌ను నివారించకపోగా కణజాలానికి మరింత నష్టం కలిగిస్తాయి. గాయం చిన్నదిగా ఉన్నా వెంటనే ఆరోగ్య కేంద్రానికి లేదా యాంటీ రేబిస్ క్లినిక్‌కు వెళ్లి వైద్యుల సలహా తీసుకోవాలి. ప్రతి కుక్కను తాకిన సందర్భంలో రేబిస్ టీకా అవసరం ఉండదు. జంతువును తాకడం, ఆహారం పెట్టడం లేదా చెక్కుచెదరని చర్మంపై జంతువు నాకడం వంటి వాటిని సాధారణంగా రేబిస్ ప్రమాదంగా పరిగణించరు. చర్మంపై స్వల్పంగా చేసిన గాయాలు లేదా రక్తస్రావం లేకుండా చర్మం దెబ్బతిన్న సందర్భాల్లో గాయాన్ని కడిగి వెంటనే రేబిస్ టీకా తీసుకోవాల్సి ఉంటుంది. చర్మాన్ని చీల్చేలా కాటు లేదా గోళ్ల గాయం ఉండడం, గాయపడిన చర్మం లేదా కళ్లు, నోటి వంటి శ్లేష్మ పొరలపై జంతువు లాలాజలం పడడం వంటి తీవ్రమైన పరిస్థితుల్లో గాయాన్ని శుభ్రం చేయడంతోపాటు వెంటనే రేబిస్ టీకా, అవసరమైన సందర్భాల్లో రేబిస్ ఇమ్యూనోగ్లోబులిన్ తీసుకోవాలి. ఇంతకుముందు రేబిస్ టీకా పూర్తి కోర్సు తీసుకున్నవారికి సాధారణంగా ఇమ్యూనోగ్లోబులిన్ అవసరం ఉండదు.



## అర్ధ మత్స్యేంద్రాసనం...

వెన్నెముకను సున్నితంగా మెలితిప్పుతూ చేయడంవల్ల ఈ భంగిమను 'వెన్నెముక మెలితిప్పడం' అని కూడా అంటారు.

చేసే విధానం: యోగా మ్యాట్ పైన సౌకర్యవంతంగా కూర్చొని... కాళ్లను ముందుకు చాచండి. ఇప్పుడు కుడి మోకాలిని వంచి, కుడి మడమను ఎడమ తుంటికి దగ్గరగా తీసుకురండి. ఎడమ కాలిని వంచి, ఎడమ పాదాన్ని... కుడి మోకాలి పక్కన ఉంచండి. చీలమండ కుడి తొడను తాకేలా చూసుకోండి. ఇప్పుడు వెన్నెముకను ఎడమవైపు తిప్పండి. కుడి చేతిని పైకెత్తి ఎడమ మోకాలి బయటవైపు తీసుకొచ్చి, దాంతో ఎడమ పాదాన్ని పట్టుకోండి. ఎడమ చేతిని ఎడమ భుజం వైపు నేలపైన ఆన్చి పెట్టండి. తర్వాత తలను వీలైనంత వరకు ఎడమ వైపు తిప్పి, ఎడమ భుజం పైనుంచి చూడండి. వెన్నెముక, మెడ, తలను ఒక సరళరేఖలో ఉంచేలా ప్రయత్నించండి. ఆ స్థితిలో కాసేపు శ్వాసతీసుకోం డి. ఆపై మెల్లగా ఆస నం విడవండి. ఇప్పు డు రెండో వైపూ ఇదే భంగిమను పునరావృతం చేయండి. ఆ తర్వాత కాసేపు విశ్రాంతి తీసుకోండి.



ప్రయోజనాలు: వెన్నెముక ఆరోగ్యానికి సాయపడుతుంది. ఒత్తిడి, సరైన భంగిమ లో కూర్చోలేకపోవడం వల్ల కలిగే మెడ బిగువును పోగొడుతుంది. పొత్తికడుపు ప్రాంతాన్ని సంకోచింపజేసి, వదలడంవల్ల ఆ ప్రాంతంలో రక్తప్రసరణ పెరిగి, అంతర్గత అవయవాలకు మసాజ్ జరుగుతుంది. బరువుని తగ్గిస్తుంది. మూత్రపిండాల ఆరోగ్యానికి మంచిది. శ్వాస, శ్వాసకోశ పనితీరుని మెరుగుపరుస్తుంది.

## శరీరంలో ఐరన్ మాత్రమే కాదు, ఇది తక్కువగా ఉన్నా అలసటగా ఉంటుంది..

తరచూ అలసటగా అనిపించడం, నిద్ర సరిగా పట్టకపోవడం, రాత్రివేళ కాళ్లలో అసౌకర్యంగా అనిపించడం లేదా ఎప్పుడూ ఆందోళనగా ఉండడం వంటి లక్షణాలను చాలా మంది ఒత్తిడికి కారణంగా భావిస్తుంటారు. అయితే శరీరంలో ఇనుము నిల్వలు తక్కువగా ఉండడం కూడా ఇలాంటి సమస్యలకు సంబంధం కలిగి ఉంటుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా అలసటతోపాటు ఆందోళన, రాత్రి వేళ కాళ్లలో అసహనం, జుట్టు రాలడం వంటి సమస్యలు ఉన్న మహిళలు తమ శరీరంలోని ఇనుము స్థాయిలను కూడా పరిశీలించుకోవాలని సూచిస్తున్నారు. ఇందుకోసం కేవలం హిమోగ్లోబిన్ పరీక్షపై ఆధారపడకుండా ఫెరిటిన్ పరీక్ష చేయించుకోవడం ద్వారా శరీరంలో నిల్వగా ఉన్న ఇనుము గురించి మరింత సమాచారం తెలుసుకోవచ్చని చెబుతున్నారు. హిమోగ్లోబిన్, ఫెరిటిన్ రెండూ ఇనుముకు సంబంధించినవే అయినప్పటికీ వాటి పాత్రలు వేర్వేరుగా ఉంటాయి. హిమోగ్లోబిన్ శరీరం ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఇనుము పరిస్థితి గురించి సూచిస్తే, ఫెరిటిన్ శరీరంలో నిల్వగా ఉన్న ఇనుము పరిమాణం గురించి తెలియజేస్తుంది. అందువల్ల హిమోగ్లోబిన్ సాధారణ స్థాయిలో ఉన్నప్పటికీ శరీరంలోని ఇనుము నిల్వలు తక్కువగా ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా రోజంతా శరీరం అలసిపోయినట్లు అనిపించినా రాత్రివేళ మెదడు ప్రశాంతంగా లేకపోవడం, నిద్రకు ఇబ్బంది కలగడం వంటి లక్షణాలు కనిపిస్తే ఇనుము నిల్వల పరిస్థితిని కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. శరీరంలో ఇనుము తక్కువగా ఉండడం నిద్రపై కూడా ప్రభావం చూపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళ కాళ్లను కదిలించాలనే అసౌకర్యం కలిగించే రెస్ట్‌లెస్ లెగ్స్ సిండ్రోమ్‌తో తక్కువ ఇనుము స్థాయిలకు సంబంధం ఉంటుందని పేర్కొంటున్నారు. మెదడు పనితీరులోనూ ఇనుము కీలక పాత్ర పోషిస్తుంది. డోపమైన్, సెరోటోనిన్ వంటి రసాయనాల తయారీలో శరీరానికి ఇది అవసరం. అయితే ఫెరిటిన్ స్థాయిని మాత్రమే చూసి నిర్ణయానికి రాకూడదని, శరీరంలో వాపు లేదా ఇన్‌ఫ్లమేషన్ ఉందో తెలుసుకోవడానికి సీఆర్‌పీ అనే రక్త పరీక్షతో కలిపి పరిశీలించడం ఉపయోగకరంగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.



## శరీరంలో జీవక్రియలు మందగించినప్పుడు కనిపించే లక్షణాలు ఇవే..




బరువు, ఆరోగ్యం, శారీరక దారుఢ్యం గురించి మాట్లాడేటప్పుడు మెటబాలిజం లేదా జీవక్రియ అనే పదం తరచూ వినిపిస్తుంది. మనం తీసుకునే ఆహారంలోని పోషకాలను శరీరం శక్తిగా మార్చుకుని, అవసరమైన శారీరక కార్యకలాపాలకు ఉపయోగించుకునే ప్రక్రియనే జీవక్రియ. వయసు, లింగం, శరీరంలో కండరాలు–కొవ్వు నిష్పత్తి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ, హార్మోన్ల పనితీరు వంటి అనేక అంశాలు జీవక్రియను ప్రభావితం చేస్తాయి. పోషకాహారం తీసుకోవడం, తగినంత నిద్రపోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం వంటివి జీవక్రియ సక్రమంగా పనిచేయడానికి సహాయపడతాయి. అయితే కొన్ని కారణాల వల్ల జీవక్రియ మందగించినప్పుడు శరీరం కొన్ని సంకేతాలను చూపించదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు . బరువు పెరగడానికి ముందే శరీరం కొన్ని హెచ్చరిక సంకేతాలను అందిస్తుందని వారు పేర్కొంటున్నారు. ఉదయం నిద్రలేచిన వెంటనే అలసటగా అనిపించడం, మెదడు మందగించినట్లు లేదా ఆలోచనలు స్పష్టంగా లేకపోవడం, రోజంతా చురుకుగా ఉండడానికి పలుమార్లు కాఫీ అవసరమవడం వంటి లక్షణాలను గమనిస్తూ ఉండాలి. అలాగే తరచూ మలబద్ధకం ఉండడం, ఇతరులతో పోలిస్తే ఎక్కువగా చలిగా అనిపించడం, పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోవడం, సాధారణంగా జీవితం పట్ల ఉత్సాహం లేదా సంతోషం తగ్గినట్లు అనిపించడం వంటి మార్పులు కూడా కనిపిస్తాయని వారు తెలిపారు.

ఈ సంకేతాలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా సమస్యకు కారణమేమిటో తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని నిపుణులు పేర్కొన్నారు. జీవక్రియలో సమస్యలు ఏర్పడడం నిజమైన పరిస్థితేనని, సరైన ఆహారం, అవసరమైన పోషక మద్దతుతో దాన్ని నియంత్రించవచ్చని వారు తెలియజేస్తున్నారు. అయితే ఈ లక్షణాలు కనిపించినంత మాత్రాన జీవక్రియ మందగించిందని నిర్ధారించలేమని గమనించాలి. శరీరంలో ఇలాంటి మార్పులకు ఇతర కారణాలు కూడా ఉండే అవకాశం ఉంది. అందువల్ల లక్షణాలు నిరంతరం కొనసాగితే వాటిని నిర్లక్ష్యం చేయకుండా తగిన వైద్య సలహా తీసుకోవడం అవసరం. జీవక్రియకు సంబంధించిన మార్పులు ఎప్పుడూ బరువు పెరగడం రూపంలోనే కనిపించాల్సిన అవసరం లేదని పోషకాహార నిపుణులు పేర్కొన్నారు. ఉదయం లేవగానే అలసట, తరచూ మలబద్ధకం, చలి, పొట్ట చుట్టూ కొవ్వు పెరగడం వంటి మార్పులను సాధారణ సమస్యలుగా భావించి



పక్కన పెట్టకుండా శరీరం అందించే సంకేతాలుగా గమనించాలని సూచించారు. ఈ మార్పులను ముందుగానే గుర్తించి ఆహారం, నిద్ర, శారీరక చురుకుదనం వంటి జీవనశైలి అంశాలపై శ్రద్ధ పెట్టడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగ్గా చూసుకునే అవకాశం ఉంటుందని వారు తెలియజేస్తున్నారు.

## నిద్రలేమి సమస్య ఉన్నవారు రోజూ తప్పనిసరిగా వ్యాయామం చేయాల్సిందే..

మంచి నిద్ర శరీరం, మెదడు ఆరోగ్యానికి ఎంతో అవసరం. అయితే ఒత్తిడి, ఎక్కువ పని గంటలు, రాత్రివేళల్లో డిజిటల్ తెరలను ఎక్కువగా చూడడం, క్రమం లేని జీవనశైలి వంటి కారణాలతో చాలామందికి నిద్ర సరిగా పట్టడం లేదు. నడక వంటి సాధారణ వ్యాయామాలు నిద్రకు మేలు చేస్తాయని తెలిసిందే. అదే సమయంలో కండరాలపై ఒత్తిడి కలిగించే బలవర్ధక వ్యాయామాలు కూడా నిద్ర నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడతాయని నిపుణుల అభిప్రాయాలు సూచిస్తున్నాయి. బరువులు ఎత్తడం, శరీర బరువుతో చేసే వ్యాయామాలు, వ్యాయామ పరికరాలు లేదా నిరోధక పట్టీలతో చేసే సాధనలు ఇందులోకి వస్తాయి. క్రమం తప్పకుండా బలవర్ధక వ్యాయామాలు చేయడం వల్ల ఒత్తిడి తగ్గి మనస్సు ప్రశాంతంగా మారుతుంది. వ్యాయామం రోజువారీ ఉద్రిక్తతను తగ్గించడంతో పాటు మానసిక స్థితిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. దీనివల్ల రాత్రి నిద్రకు ఉపక్రమించినప్పుడు మనసు ప్రశాంతంగా ఉండే అవకాశం ఉంటుంది. అదే సమయంలో కండరాలు పనిచేయడం వల్ల శరీరానికి సహజమైన అలసట ఏర్పడి నిద్రకు ఉపకరిస్తుంది. క్రమబద్ధమైన వ్యాయామం నిద్ర నాణ్యత, నిద్ర వ్యవధిలో మెరుగుదలకు కూడా దోహదపడుతుంది. అయితే ఎక్కువసేపు లేదా అధిక తీవ్రతతో వ్యాయామం చేస్తేనే నిద్ర బాగా వస్తుందనేది కాదు. శరీరాన్ని పూర్తిగా అలసిపోయేలా చేయడం కంటే వ్యాయామాన్ని క్రమం తప్పకుండా చేయడం ముఖ్యమని సూచనలు చెబుతున్నాయి.



బలవర్ధక వ్యాయామాలను ప్రారంభించేవారు తొలుత తక్కువ స్థాయి సాధనతో మొదలుపెట్టి, శరీరం అలవాటు పడుతున్న కొద్దీ క్రమంగా తీవ్రతను పెంచుకోవాలి. సరైన పద్ధతిలో వ్యాయామాలు చేయడం ముఖ్యం. కాళ్లు, వీపు, ఛాతీ, భుజాలు, చేతులు, పొత్తికడుపు భాగాలకు సంబంధించిన కండరాలకు వ్యాయామం అందేలా సమతుల్యమైన సాధనను ఎంచుకోవాలి. వ్యాయామం తర్వాత కండరాలకు కోలుకునేందుకు తగిన విశ్రాంతి ఇవ్వాలి. నడక, సైక్లింగ్ వంటి ఇతర మితమైన శారీరక కార్యకలాపాలను కూడా దీనితో కలిపి చేయవచ్చు. అయితే నిద్ర సమస్యలకు వ్యాయామం ఒక్కటే పరిష్కారం కాదు. ఒత్తిడి, కొన్ని ఆరోగ్య సమస్యలు, మందులు, కెఫీన్, మద్యం, పని వేళల్లో మార్పులు, క్రమం లేని నిద్ర సమయం వంటి అనేక అంశాలు నిద్రను ప్రభావితం చేస్తాయి. పడుకునే సమయానికి దగ్గరగా వ్యాయామం చేసే విషయంలో ప్రతి ఒక్కరి శరీరం ఒకే విధంగా స్పందించదు. కొందరికి వ్యాయామం తర్వాత ప్రశాంతంగా, నిద్రమత్తుగా అనిపించే అవకాశం ఉంటుంది. మరికొందరికి ముఖ్యంగా అధిక తీవ్రతతో చేసే వ్యాయామం తర్వాత శరీరం మరింత చురుకుగా మారి నిద్ర పట్టడం ఆలస్యం అవుతుంది. అందువల్ల రాత్రి పడుకునే ముందు బలవర్ధక వ్యాయామం చేసినప్పుడు నిద్రకు ఇబ్బంది కలుగుతుందనిపిస్తే, దాన్ని రోజులో కొంత ముందుగా చేయడం మంచిది. సాయంత్రం సమయంలో తేలికపాటి వ్యాయామాన్ని ఎంచుకోవచ్చు. వ్యాయామంతోపాటు ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, పడకగదిని సౌకర్యవంతంగా ఉంచడం, నిద్రకు ముందు డిజిటల్ తెరలను వాడడం తగ్గించడం, సాయంత్రం తర్వాత అధిక కెఫీన్ తీసుకోకపోవడం వంటి అలవాట్లు కూడా మంచి నిద్రకు తోడ్పడతాయని నిపుణులు సూచిస్తున్నారు.

## అమెరికా సంస్థల ఉన్నతాధికార్లతో పీయూష్ గోయల్ భేటీ



అమెరికాకు చెందిన పలు కంపెనీల ఉన్నతాధికార్లతో భారత వాణిజ్య పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించి, భారత్‌లో పెట్టుబడి అవకాశాలపై చర్చించారు. ఆయన అక్టోబరు 5 వరకు అమెరికాలోనే ఉంటారు. అమెరికాలోని ప్రధాన రిటెయిల్ సంస్థ అయిన టార్గెట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ లీగల్ అండ్ కాంప్లియెన్స్ అధికారి గ్రాంట్ మెక్‌గీతో మంత్రి సమావేశమయ్యారు. 'మేక్ ఇన్ ఇండియా చొరవ కింద భారత్‌లో పెరుగుతున్న తయారీ అవకాశాలను టార్గెట్ మరింత సద్వినియోగం చేసుకోవడం, దేశంలో ఉనికిని బలోపేతం చేసుకోవడం, భారత్ నుంచి సరఫరాను విస్తరించడం తదితరాలకు ఉన్న అవకాశాలపై చర్చించామ'ని ఒక సామాజిక మాధ్యమ పోస్ట్‌లో మంత్రి తెలిపారు.




# 'పసిడి' ఆభరణాలకు 'నకిలీ' హాల్‌మార్క్ ముప్పు

ఏదైనా పసిడి ఆభరణం కొనుగోలు అనంతరం, స్వచ్ఛత ధ్రువీకరణకు హాల్‌మార్కింగ్ చిహ్నాలను పరిశీలించాల్సి ఉంటుంది. హాల్‌మార్కింగ్ ఉంది కదా అని దానిని యాప్‌లో చెక్ చేసుకోకపోతే కొనుగోలుదార్లు మోసపోయే ప్రమాదం లేకపోలేదు. ఒక్కో బంగారు ఆభరణానికి హాల్‌మార్కింగ్ ధ్రువీకరణ ఇచ్చేందుకు ఛార్జీని రూ.45 నుంచి రూ.75కి భారతీయ ప్రమాణాల మండలి (బీఐఎస్) పెంచింది. అయితే వెండి ఆభరణాల హాల్‌మార్కింగ్ ఛార్జీలో మార్పు చేయకుండా, ఆభరణానికి రూ.35గానే వసూలు చేస్తున్నారు. బంగారు ఆభరణాల హాల్‌మార్కింగ్ ఛార్జీని పెంచడం వల్ల, స్వచ్ఛత ధ్రువీకరణ కోసం అస్సేయింగ్/హాల్‌మార్కింగ్ కేంద్రానికి వెళ్లకుండా కొందరు అక్రమార్కులు/వ్యాపారులు నకిలీ హాల్‌మార్కింగ్ స్టాంపులను సృష్టించి, వినియోగదారులను మోసగించే ప్రమాదం ఉందని ఆలిండియా జెమ్ అండ్ జువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జీజేసీ) హెచ్చరిస్తోంది. ప్రతి ఆభరణానికి ముద్రిస్తున్న హాల్‌మార్క్ ప్రత్యేక గుర్తింపు సంఖ్య (హెచ్‌యూఐడీ) గురించి కొనుగోలుదార్లకు అవగాహన లేకపోవడం అక్రమార్కులకు కలిసి వస్తోందని వివరించింది.



దేశంలోని దాదాపు 800 జిల్లాల్లో 10% ప్రాంతాల్లో మాత్రమే హాల్‌మార్కింగ్, బీఐఎస్ కేర్ మొబైల్ యాప్ ద్వారా హాల్‌మార్క్ ప్రత్యేక గుర్తింపు (హెచ్‌యూఐడీ) సంఖ్యను తనిఖీ చేసుకునే అవగాహన ఉందని జీజేసీ ఛైర్మన్ రాజేష్ రోక్డే తెలిపారు. ముఖ్యంగా చిన్న నగరాలు-పట్టణాలు-గ్రామీణ వినియోగదారులకు దీనిపై అవగాహన లేకపోవడంతో.. మోసగాళ్లు ఫోటోగ్రాఫ్‌లు, నకిలీ స్టాంపులను సులభంగా కాపీ చేసి నకిలీ బంగారాన్ని 'హాల్‌మార్కింగ్ స్వచ్ఛత పేరిట' అంటగట్టే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. దేశంలో హాల్‌మార్కింగ్ కేంద్రాల (ఏహెచ్‌సీలు) సంఖ్య 2022 జులైలో 1,220 కాగా, 2026 జులై నాటికి 1,577కు పెరిగింది. ఇప్పటి వరకు హెచ్‌యూఐడీతో కూడిన హాల్‌మార్క్ ముద్రించిన మొత్తం ఆభరణాల సంఖ్య 65 కోట్లు దాటింది. ఒక్క 2025-26లోనే 13.22 కోట్ల ఆభరణాలకు హాల్‌మార్కింగ్ చేశారు.

హాల్‌మార్కింగ్ ముద్రణకు తాజా ఛార్జీల పెంపుతో, వార్షికంగా దాదాపు రూ.400 కోట్ల అదనపు ఆర్థిక భారం, దానికి రూ.80 కోట్ల జీఎస్‌టీ భారం పడుతుందని జీజేసీ అంచనా వేస్తోంది. ఫలితంగా వినియోగదారుల రక్షణ కొరవడే పరిస్థితి ఏర్పడినందున, హాల్‌మార్కింగ్‌కు పాత ధర రూ.45ను పునరుద్ధరించాలని కోరుతూ కేంద్ర వినియోగదారు వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి, బీఐఎస్‌కు జీజేసీ వినతిపత్రం సమర్పించింది. ఆభరణాలకు తప్పనిసరి ఫోటోగ్రఫీ వంటి అదనపు నిబంధనల వల్ల.. గతంలో కేవలం 6 గంటల్లో పూర్తయ్యే హాల్‌మార్కింగ్ ప్రక్రియకు ఇప్పుడు 24-36 గంటల సమయం పడుతోంది. దీని వల్ల ఆభరణాల వ్యాపారుల వర్కింగ్ క్యాపిటల్ ఎక్కువ సమయం నిలిచిపోయి, వారి ఫైనాన్సింగ్ ఖర్చులు భారీగా పెరుగుతున్నాయని మండలి తెలిపింది. బీఐఎస్ నిబంధనల ప్రకారం.. అసలైన హాల్‌మార్క్ ఆభరణంపై 3 గుర్తులు తప్పనిసరిగా ఉండాలి. బీఐఎస్ లోగో, స్వచ్ఛత గ్రేడ్ (22, 18 క్యారెట్‌లు), 6 అంకెలు-అక్షరాలతో కూడిన హెచ్‌యూఐడీ కోడ్ ఉండాలి. దీని పరిశీలనకు స్మార్ట్‌ఫోన్‌లోకి 'బీఐఎస్ కేర్' యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, హెచ్‌యూఐడీ ఆప్షన్ ఎంచుకోవాలి. మనం కొనుగోలు చేయాలనుకుంటున్న ఆభరణంపై ఉండే హెచ్‌యూఐడీ కోడ్‌ను అందులో నమోదు చేస్తే, అది సరైన ధ్రువీకరణ పొందిన ఆభరణమో, కాదో తెలుస్తుంది. సరైనది అయితే ఆభరణంలో బంగారం స్వచ్ఛత, హాల్‌మార్క్ చేసిన తేదీ, సదరు కేంద్రం వివరాలు క్షణాల్లో లభిస్తాయి.

# పాత ప్రీమియం కార్లను కొనేద్దాం




విలాసవంతమైన కారు కొనాలంటే కొత్తదే కావాలన్న భావన క్రమంగా మారుతోంది. ఖరీదైన ప్రీమియం వాహనాలను సొంతం చేసుకోవాలనుకునే యువత.. కొత్త కార్లకు బదులుగా వాడిన (ప్రీ-ఓన్డ్) లగ్జరీ కార్లను ఎంచుకుంటోంది. కొత్త కార్ల ధరలు గణనీయంగా పెరగడం, యువతలో పెరుగుతున్న ఆకాంక్షలు ఇందుకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. ప్రీమియం వాహనాల విభాగంలోకి అడుగు పెట్టేందుకు ప్రీ-ఓన్డ్ కార్లు అనుకూలమైన మార్గంగా మారుతున్నాయి. ప్రస్తుతం ఈ విభాగంలోని కొనుగోలుదారుల సగటు వయసు 35-40 ఏళ్ల మధ్య ఉంది.

పాత లగ్జరీ కార్ల విపణి గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రథమార్ధంలో దాదాపు 21 శాతం పెరిగింది. అదే సమయంలో అమ్ముడైన వాహనాల సగటు ధర (ఏఎస్‌పీ) 25 శాతం పెరిగింది. అధిక విలువ కలిగిన మోడళ్లకూ కొనుగోలుదారుల నుంచి ఆదరణ పెరుగుతోందని మార్కెట్ గణాంకాలు చెబుతున్నాయి.

పాత లగ్జరీ కార్ల విపణిలో రూ.15 లక్షల నుంచి రూ.30 లక్షల ధరల శ్రేణి కీలకంగా మారింది. ఈ బడ్జెట్‌లో ప్రీమియం బ్రాండ్లకు చెందిన పెద్ద కార్లు, మెరుగైన ఫీచర్లు ఉన్న మోడళ్లు అందుబాటులోకి రావడం కొనుగోలుదారులను ఆకర్షిస్తోంది. కొత్త లగ్జరీ కారుతో పోలిస్తే తక్కువ ధరకు ప్రీమియం అనుభూతిని పొందే అవకాశం లభిస్తోంది. ఇక సెడాన్లతో పోలిస్తే ఎస్‌యూవీలకు గిరాకీ ఎక్కువగా కనిపిస్తోంది. విశాలమైన స్థలం, మెరుగైన ప్రయాణ అనుభూతి, అధిక గ్రౌండ్ క్లియరెన్స్, రోజువారీ వినియోగానికి అనుకూలత వంటి అంశాలూ వీటి ఆదరణకు కారణమవుతున్నాయి. పెట్రోల్ వాహనాలతో పోలిస్తే డీజిల్ మోడళ్లకూ కొనుగోలుదారుల నుంచి ఆసక్తి కనిపిస్తోంది. ప్రీ-ఓన్డ్ లగ్జరీ కారును కొనుగోలు చేసేటప్పుడు వినియోగదారులు కేవలం బ్రాండ్ పేరునే పరిగణనలోకి తీసుకోవడం లేదు.

# ఆర్‌బీఐ వడ్డీ రేట్లు పెంచే ఛాన్స్




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలకమైన రెపోరేటును పెంచే అవకాశం ఉంది. అక్టోబర్ నెల ద్రవ్యపరపతి విధాన సమీక్షలో రెపోరేటును 0.25 శాతం మేర పెంచుతూ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఆర్థిక విశ్లేషకులు, బ్యాంకర్లు అభిప్రాయపడుతున్నారు. పశ్చిమాసియాలో అనిశ్చిత పరిస్థితుల కారణంగా నెలకొన్న ద్రవ్యోల్బణ భయాలకు తోడు, ఇతర కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు సవరిస్తుండడమే ఇందుక్కారణమని పేర్కొంటున్నారు. ఒకవేళ విశ్లేషకులు ఊహించినట్లే ఆర్‌బీఐ వడ్డీ రేట్లు సవరిస్తే.. రెపోరేటుతో ముడిపడి ఉన్న గృహ, వాహన రుణాలు ప్రియం కానున్నాయి. ఆ మేర నెలవారీ చెల్లించే ఈఎంఐలు భారం కానున్నాయి. 2023 ఫిబ్రవరిలో చివరిసారిగా ఆర్‌బీఐ వడ్డీ రేట్లను పెంచింది. దీంతో అప్పట్లో రెపోరేటు 6.50 శాతానికి చేరింది. ఆపై 2023-24లో స్థిరంగా కొనసాగించింది. 2025లో వరుసగా వడ్డీ రేట్లు తగ్గించిన ఆర్‌బీఐ.. పశ్చిమాసియా పరిస్థితుల నేపథ్యంలో స్థిరంగా కొనసాగిస్తోంది. ప్రస్తుతం రెపో రేటు 5.25 శాతంగా ఉంది. అక్టోబర్ నెలకు సంబంధించిన ఎంపీసీ భేటీలో రెపోరేటుపై నిర్ణయం తీసుకోనుంది. బుధవారం నిర్ణయం వెలువడనుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కేంద్ర బ్యాంకులతో సమానంగా ఆర్‌బీఐ కూడా వడ్డీ రేట్లు సవరించవచ్చని పలువురు ఆర్థిక నిపుణులు పేర్కొన్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, వృద్ధి ఊపందుకోవడం వంటివి ఇందుకు కారణాలని చెబుతున్నారు. ముఖ్యంగా పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు తలెత్తడం వల్ల ఇంధనం, కమొడిటీ ధరలు పెరుగుతున్నాయని, దీనివల్ల మరోసారి రెపోరేటు పెంచొచ్చని అభిప్రాయపడుతున్నారు. పీటీఐ నిర్వహించిన పోల్‌లో మెజారిటీ ఆర్థిక నిపుణులు ఇదే తరహా అభిప్రాయం వ్యక్తంచేశారు. అయితే, మరోసారి స్టేటస్ కో కొనసాగించే అవకాశమూ లేకపోలేదని మరో ఆర్థికవేత్త అభిప్రాయపడ్డారు. డిమాండ్ ఆధారిత ద్రవ్యోల్బణం ఇంకా ఊపందుకోని కారణంగా మరికొంత కాలం వేచి చూసే ధోరణిని ఆర్‌బీఐ అవలంబించొచ్చని అభిప్రాయం వ్యక్తంచేశారు.

# బెంగళూరులో యూజెనిక్స్ హెయిర్ సైన్సెస్ నూతన సెంటర్



హెయిర్ రీస్టోరేషన్ రంగంలో ప్రముఖ సంస్థ యూజెనిక్స్ హెయిర్ సైన్సెస్ బెంగళూరులో నూతన కేంద్రాన్ని ప్రారంభించింది. ఇందిరా నగర్‌లోని ఫెదర్‌లైట్ వాంటేజ్, 100 ఫీట్ రోడ్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక కేంద్రాన్ని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రారంభించారు. ఈ కేంద్రంలో ఆరు శస్త్రచికిత్స గదులు ఉన్నాయి. గురుగ్రామ్, ముంబై, హైదరాబాద్, భువనేశ్వర్ కేంద్రాల తర్వాత దేశంలో యూజెనిక్స్‌కు ఇది ఐదో కేంద్రం. బెంగళూరు, కర్ణాటకలోని రోగులకు అత్యాధునిక జుట్టు పునరుద్ధరణ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా సంస్థ దీన్ని ఏర్పాటు చేసింది.ఈ సందర్భంగా సీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ.. బెంగళూరుకు యూజెనిక్స్‌ను తీసుకురావడం అభినందనీయమన్నారు. సమాచార సాంకేతిక, అంతరిక్ష, జీవసాంకేతిక, వైద్య రంగాల్లో కర్ణాటకకు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. ప్రపంచ స్థాయి వైద్య నిపుణులను, వైద్య పర్యాటకాన్ని బెంగళూరుకు తీసుకురావడంలో యూజెనిక్స్ కృషి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.యూజెనిక్స్ సహ వ్యవస్థాపకుడు, ఎయిమ్స్ న్యూఢిల్లీ పూర్వ విద్యార్థి డాక్టర్ ప్రదీప్ సేథి మాట్లాడుతూ.. రెండు దశాబ్దాల క్రితం రిషికేశ్‌లో చిన్న క్లినిక్‌తో ప్రారంభమైన సంస్థ నేడు దేశ, విదేశాల నుంచి రోగులకు సేవలు అందిస్తోందన్నారు. బెంగళూరు వంటి ఆవిష్కరణలకు కేంద్రంగా ఉన్న నగరంలో సేవలు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.మరో సహ వ్యవస్థాపకురాలు డాక్టర్ అరికా బన్సల్ మాట్లాడుతూ.. బెంగళూరు కేంద్రం ద్వారా ఇతర నగరాలకు చికిత్స కోసం వెళ్లాల్సిన రోగులకు తమ వైద్య సేవలు మరింత చేరువవుతాయని తెలిపారు. ప్రతి రోగి అవసరాలను వ్యక్తిగతంగా అర్థం చేసుకుని చికిత్స అందించడమే తమ విధానమన్నారు. యూజెనిక్స్‌లో వైద్యుల ఆధ్వర్యంలో చికిత్స కొనసాగుతుంది. రోగ నిర్ధారణ, చికిత్స ప్రణాళిక, హెయిర్‌లైన్ రూపకల్పన, దాత ప్రాంతం పరిశీలన, శస్త్రచికిత్సతో పాటు ప్రతి కీలక దశను వైద్యులే పర్యవేక్షిస్తారు. ఈ ప్రారంభోత్సవంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ ఇసుక శిల్పి సుదర్శన్ పట్నాయక్ ప్రత్యేకంగా రూపొందించిన ఇసుక శిల్పాన్ని ప్రదర్శించారు. తెలంగాణ మైనారిటీ సంక్షేమ, ప్రభుత్వ సంస్థల శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్, కర్ణాటక నీటిపారుదల, విజ్ఞాన సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ అజయ్‌ధరం సింగ్ తదితరులు పాల్గొన్నారు.




## ఈ పతకం.. తేలికగా రాలేదు: సంజు శాంసన్ ఎమోషనల్



ఆసియా క్రీడల క్రికెట్ విభాగంలో భారత్‌కు రెండు బంగారు పతకాలు వచ్చాయి. తొలుత అమ్మాయిలు సాధించగా.. దాదాపు చివరి రోజున శ్రేయస్ నాయకత్వంలోని టీమ్‌ఇండియా కైవసం చేసుకుంది. ఫైనల్‌లో పాక్‌ను భారత్ చిత్తు చేసింది. అనుభవజ్ఞులైన అగ్రశ్రేణి ఆటగాళ్లను బరిలోకి దింపడం వల్లే ఉత్కంఠ పోరులో ఒత్తిడిని తట్టుకొని విజయం సాధించినట్లు సంజు వెల్లడించాడు. ఆసియా క్రీడల్లో పతకం తేలికగా రాలేదని వ్యాఖ్యానించాడు. ''ఆసియా క్రీడల బరిలోకి దిగిన భారత జట్టులోని ఆటగాళ్లకు ఎంతో అనుభవం ఉంది. ఆ అనుభవమే విజేతగా నిలిపింది. ప్రాక్టీస్ మ్యాచ్‌లు జరగనప్పుడు మా శక్తిని ఎలా మేనేజ్ చేసుకోవాలి, ఎలా ప్రిపేర్ కావాలి. ఏకాగ్రతతో ఎలా ఉండాలో మాకు తెలుసు. మా అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించడం స్వర్ణం నెగ్గడంలో సాయపడింది. పాకిస్థాన్‌తో ఫైనల్‌లో ఏం జరిగిందో అందరికీ తెలుసు. ఆటగాళ్లతోపాటు అభిమానులకూ ఇదో గొప్పగేమ్'' అని సంజు వెల్లడించాడు.

# రోహిత్.. 'సెంచరీ'ల సంఖ్య నీ వయసును దాటిపోవాలి: గావస్కర్




వెస్టిండీస్‌తో మూడో వన్డేలో రోహిత్ శర్మ 92 పరుగుల వద్ద ఔటై కాస్తలో సెంచరీ చేజార్చుకున్నాడు. రోహిత్ మూడంకెల స్కోరును అందుకోకపోవడంపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ నిరుత్సాహానికి గురయ్యారు. ఇలా సెంచరీ చేసే అవకాశాన్ని ఎప్పుడూ వదులుకోవద్దని సూచించారు. ఈ క్రమంలో ఓ టార్గెట్‌ను రోహిత్ ముందు ఉంచారు. 'రోహిత్ శర్మ 92 పరుగుల వద్ద ఔట్ అయినప్పుడు నేను నిరాశ చెందా. అందుకు రెండు కారణాలు.. ఒకటి, అతడు సెంచరీ మిస్ చేసుకోవడం. ఇక రెండోది.. 2027 ఐసీసీ వన్డే వరల్డ్ కప్ ముగిసిన తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికే అవకాశం ఉండటం. ఇప్పుడు ఇది ఎందుకంటే.. అతడు గుడ్‌బై చెప్పాలని నిర్ణయించుకొనే నాటికి కనీసం అతడి వయసు కంటే ఎక్కువ శతకాలు ఉండాలని కోరుకుంటున్నా. ఇప్పుడు విండీస్‌పై మరో సెంచరీ చేసి ఉంటే ఆ లక్ష్యానికి కాస్త చేరువగా వచ్చేవాడు. ఎవరైనా ప్లేయర్ తన వయసు కంటే ఎక్కువ శతకాలు చేస్తే ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తుంది'' అని గావస్కర్ తెలిపారు. ప్రస్తుతం రోహిత్ ఖాతాలో 35 సెంచరీలు ఉన్నాయి. వచ్చే వన్డే ప్రపంచ కప్ నాటికి అతడి వయసు 40 ఏళ్లకు చేరుతుంది. ''నా అంతర్జాతీయ కెరీర్ చివరి దశలో నేను కూడా మరిన్ని టెస్టు సెంచరీలు చేయాలని అనుకున్నా. నేను రిటైర్‌మెంట్ తీసుకొనే సమయానికి ఆ శతకాల సంఖ్య ఎక్కువగా ఉండాలని భావించా. మూడుసార్లు నేను 90ల్లోనే పెవిలియన్‌కు చేరా. ఒకవేళ అవి చేసి ఉంటే.. నా రిటైర్‌మెంట్ ఏజ్ 38కి సమంగా నిలిచేవి. కానీ, అలా సాధ్యపడలేదు. అందుకే, రోహిత్ శర్మ విషయంలో జరగాలని కోరుకుంటున్నా. గత వరల్డ్ కప్‌తో పోలిస్తే ప్రస్తుతం రోహిత్ బ్యాటింగ్ శైలిలో మార్పు వచ్చింది. అప్పుడు తొలి బంతి నుంచే బాదేద్దామని భావించేవాడు. కానీ, ఇప్పుడు తన వికెట్ విలువ తెలుసుకున్నాడు. 2023 ప్రపంచ కప్‌లో మంచి ఆరంభాలను పెద్ద స్కోర్లుగా మలచలేదు. ఇప్పుడు మాత్రం నిలకడగా భారీగా పరుగులు చేయడం సంతోషంగా ఉంది. 70-80 బంతుల్లోనే సెంచరీ చేస్తే అది జట్టుకు ఎంతో ఉపయోగం. ఇక సోషల్ మీడియాలో వచ్చే విమర్శలు అతడిని ఏమీ చేయలేవనేది నా ఉద్దేశం'' అని సునీల్ గావస్కర్ వ్యాఖ్యానించారు. గావస్కర్ 38 ఏళ్ల వయసులో ఆటకు గుడ్‌బై చెప్పారు. ఆయన టెస్టుల్లో 34, వన్డేల్లో ఒక సెంచరీ చేశారు.

# బై బై జపాన్.. ఖతార్‌లో కలుద్దాం..!



దాదాపు పదిహేను రోజులపాటు అలరించిన ఆసియా క్రీడల సంబరం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో భారత్ తరపున నీరూ దాండా పతాకధారిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జపాన్ నుంచి ఖతార్‌కు అతిథ్య హక్కులను ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా (OCA) అధ్యక్షుడు షేక్ జోవాన్ బిన్ హమద్ అల్ థానీ అధికారికంగా బదిలీ చేశారు. ఆసియా క్రీడల టార్చ్‌ను ఖతార్ ప్రధానమంత్రి షేక్ మహ్మద్ బిన్ అబ్దుల్ రెహ్మాన్‌కు జోవాన్ అందించారు. సాధారణంగా క్రీడల ఆరంభం, ముగింపు వేడుకలకు పతాకధారులుగా ఇద్దరు ఉంటారు. ఒకరు పురుష అథ్లెట్, మరొకరు మహిళా అథ్లెట్. కానీ, ఈసారి ఆసియా క్రీడలు ముగింపు వేడుకల్లో భారత్ నుంచి ఒక్కరే హాజరు కావడం గమనార్హం. వేదికపైకి భారత అథ్లెట్లు జాతీయ జెండాలతో చేరుకున్నారు. ఈ ఆసియా క్రీడల్లో భారత్ 85 పతకాలతో నాలుగో స్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. భారత్ సాధించిన పతకాలకు సంబంధించి అధికారిక బ్రాడ్‌కాస్టర్ సోనీ స్పోర్ట్స్ ఓ వీడియోను షేర్ చేసింది. ఇక అగ్రస్థానంలో చైనా (341) ఉండగా.. జపాన్ (269), దక్షిణ కొరియా (150) తర్వాత స్థానాల్లో నిలిచాయి.

# ధోని మాటలు స్ఫూర్తి నింపాయి: షై హోప్

భారత్‌తో మూడు వన్డేల సిరీస్‌ను 2-1 తేడాతో విండీస్ కోల్పోయింది. అయితే, చివరిమ్యాచ్‌లో విండీస్ ఆ సారథి షై హోప్ అజేయ సెంచరీతో గెలిపించాడు. హోప్ 143 బంతుల్లో 17 ఫోర్లు, 3 సిక్స్‌ల సాయంతో 162 పరుగులు చేశాడు. అతడికే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు వరించింది. ఈ సందర్భంగా తనకు టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని మాటలు స్ఫూర్తిగా నిలిచాయని గుర్తు చేసుకున్నాడు. 'ఎంఎస్ ధోని అద్భుతమైన వ్యక్తి. అతడితో నేను గతంలో మాట్లాడా. ఆ సందర్భం గా చెప్పిన మాటలు నాకు ఇప్పటికీ గుర్తున్నాయి. ఏదైనా లక్ష్య సాధనలో మనం అనుకున్న దానికంటే ఎప్పుడూ ఎక్కువ సమయం ఉంటుందని అన్నారు. ఈ మ్యాచ్‌లో కేవలం తుది ఫలితంపైనే ఎక్కువగా దృష్టి పెట్టకుండా చివరి వరకూ మ్యాచ్‌ను తీసుకెళ్లేందుకు ప్రయత్నించా. లక్ష్యం గురించి మరీ ఎక్కువగా ఆందోళన పడకుండా.. బౌండరీలను సాధించడం ఎలా అనేది ఫోకస్ చేశా'' అని హోప్ తెలిపాడు. ''భారత జట్టు అప్పటికే కొన్ని ఓవర్లు వెనకబడి ఉందని నాకు తెలుసు. ఆఖర్లో ఎక్కువ మంది ఫీల్డర్లు బయట ఉండరని తెలుసు. సర్కిల్‌లో ఐదుగురు ఉండాలి. ఇలాంటి స్కోరును డిఫెండ్ చేయడం కష్టమని తెలుసు. వాటన్నింటిని పరిగణనలోకి తీసుకొని బ్యాటింగ్ చేశా. అదృష్టవశాత్తూ మాకు మంచే జరిగింది.'' అని వెల్లడించాడు.




# ఆసియా క్రీడల్లో భారత్-పాక్ మ్యాచ్‌లకే మోస్ట్ వ్యూస్: ఓసీఏ



భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన పురుషుల క్రికెట్ ఫైనల్, హాకీ సెమీఫైనల్ మ్యాచ్‌లకు ఆసియా క్రీడల చరిత్రలోనే అత్యధిక వ్యూస్ వచ్చాయని 'ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా' (OCA) వెల్లడించింది. శనివారం జరిగిన పాకిస్థాన్-భారత్ క్రికెట్ మ్యాచ్ అత్యధికంగా వీక్షణలు సాధించగా.. గురువారం నిర్వహించిన భారత్-పాక్ హాకీ సెమీఫైనల్ మ్యాచ్ రికార్డు స్థాయి వ్యూస్ ను సాధించినట్లు ఓసీఏ కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు తయ్యబ్ ఇక్రమ్ పేర్కొన్నారు. అయితే వీక్షకుల సంఖ్య, రెండింటిలో ఏ మ్యాచ్‌కు ఎక్కువ వీక్షణలు వచ్చాయనే గణాంకాలను వెల్లడించలేదు. ఆసియా క్రీడల నేపథ్యంలో కొందరు క్రీడాకారులకు సరైన వసతి సౌకర్యాలు, నిర్వహణ ఏర్పాట్లు కల్పించలేదని పలువురు ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై తయ్యబ్ ఇక్రమ్ మాట్లాడుతూ.. ఇటువంటి భారీ క్రీడా కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు పలు సవాళ్లు ఎదురవ్వడం సహజమన్నారు. 'వసతి సహా పలు విషయాలపై కొన్ని ఫిర్యాదులు వచ్చాయని, మరికొన్ని సమస్యలు కూడా వెలుగులోకి వచ్చాయని మాకు తెలుసు. వాస్తవానికి కొన్ని సవాళ్లు ఉన్నాయి. కానీ, మేము ఆ సవాళ్లను ఎదుర్కొన్న విధానమే మరింత ముఖ్యమైనది. మేము మా అథ్లెట్లకు ఉత్తమ వసతి ఏర్పాట్లు, లాజిస్టిక్స్, కమ్యూనికేషన్లను అందించడానికి ప్రయత్నించాము. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం మాకు కొత్తేమీ కాదు. ఒలింపిక్ గేమ్స్, ఆసియా గేమ్స్ సహా అనేక ఇతర ఖండాంతర క్రీడలను నిర్వహించాము. ప్రస్తుతం ఎదురైన సవాళ్లను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తాం' అని పేర్కొన్నారు.

# హీరో ఎన్టీఆర్ కు మద్దతుగా నిలిచిన హీరో విజయ్ దేవరకొండ



**వుదయం సినిమా:** ఎన్టీఆర్ హీరోగా నటించిన దేవర సినిమాలోని చుట్టమల్లే పాటను ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ తో మహిళల్ని కించపరిచేలా రూపొందించిన ఘటన అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఈ ఘటనపై హీరో ఎన్టీఆర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తన ఆగ్రహాన్ని వెల్లడిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ ఘటన నేపథ్యంలో ఎన్టీఆర్ కు మద్దతుగా నిలబడేందుకు ముందు కొచ్చారు విజయ్ దేవరకొండ. మానవీయ విలువల్లో మనం పూర్తిగా దిగజారిపోయామంటూ ఆయన ట్వీట్ చేశారు.హీరో విజయ్ దేవరకొండ స్పందిస్తూ – విలువల పరంగా మనం నీచమైన స్థాయికి దిగజారిపోతున్నాం. ఈ ఘటనకు బాధ్యతలైన వారిని వదిలి పెట్టకూడదు. చట్టపరంగా వారిని కఠినంగా శిక్షించాలి. మరొకరు ఇలాంటి తప్పు చేయకుండా గుణపాఠం నేర్పాలి. పిల్లల్ని ఎలా పెంచుతున్నాం, మనం ఎలాంటి సమాజంలో జీవిస్తున్నామనే సందేహాన్ని ఈ ఉదంతం రేకెత్తిస్తోంది. మరొకరిని బాధపెట్టడంలో సంతోషాన్ని వెతుక్కునేలా మారిపోవడం బాధాకరం. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయని ప్రపంచమంతా భయపడుతుంటే మరోవైపు ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని కొందరు ఇలాంటి తప్పుడు పనులకు ఉపయోగించుకుంటున్నారు. డిజిటల్ వేదికలపై జరిగినా దీన్ని లైంగిక దాడితో సమానంగా పరిగణించాలి. చట్టప్రకారం తీవ్రంగా శిక్షించాలి. ఈ ఘటనను వ్యతిరేకిస్తున్న ప్రతి ఒక్కరికీ నా పూర్తి మద్దతు ఉంటుంది. అన్నారు.

వుదయం సినిమా MOVIE TIME!

## సింగీతం శ్రీనివాసరావు మరణం లేని మహనీయుడు



**వుదయం సినిమా:** దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు గారి మరణం పట్ల ప్రముఖ నిర్మాత అశ్వినీదత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సింగీతం శ్రీనివాసరావు గారి మృతికి సంతాపం తెలియజేస్తూ భావోద్వేగంతో నివాళులు అర్పించారు. "తెలుగు సినిమాకే వెలుగులు పంచిన విజయా సంస్థ దర్శక వారసుడు సింగీతం శ్రీనివాసరావు గారు వెళ్ళిపోయారు. గుండె కలచివేసింది. కళ్ళు చెమర్చాయి. కళాఖండాలను రూపొందించినా, నిరాడంబరుడిగానే చివరివరకూ మసలిన దార్శనిక ముని ఆయన. ఒకప్పుడు ఆయనతో చేద్దామనుకున్నా కథ కలిసి రాలేదు. కానీ నా కల ఆగిపోలేదు. 'సింగ్ గీతం' రూపంలో వైజయంతీ పతాకం మీద శాశ్వతంగా వెలుగుతూనే ఉంటుంది. మరణం లేని మహనీయుడు. ఆయనకి నా కన్నీటి వీడ్కోలు".

# శ్రీ సింగీతం శ్రీనివాసరావు ఆత్మకు శాంతి చేకూరాలి



విచారిస్తున్నాను. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాము. భారతీయ చలన చిత్ర పరిశ్రమకి విభిన్న చిత్రాలు అందించిన దర్శకుడాయన. పుష్పక విమానం, విచిత్ర సోదరులు, మయూరి, ఆదిత్య 369, మైకేల్ మదన కామరాజు లాంటి చిత్రాల్లో శ్రీ సింగీతం శ్రీనివాసరావు చేసిన ప్రయోగాలు, చూపిన సృజన ప్రేక్షకులను మెప్పించాయి. ఆయన రూపొందించిన అమెరికా అమ్మాయి, పంతులమ్మ లాంటి చిత్రాల్లోని గీతాలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. 94 ఏళ్ల వయసులోనూ సింగ్ గీతం అనే చిత్రానికి దర్శకత్వం వహించడం ఆయనకి సినిమా పట్ల ఉన్న ఆసక్తిని తెలియచేసింది. శ్రీ సింగీతం శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

**— (పవన్ కళ్యాణ్)ఉప ముఖ్యమంత్రి**

ఈ నష్టం నాకు చాలా వ్యక్తిగతంగా అనిపిస్తోంది.నేను ఎదుగుతున్న రోజుల్లో సింగీతం శ్రీనివాసరావు గారు నాకు ఇష్టమైన దర్శకులలో ఒకరు. ఆయన సినిమాల వెనుక ఉన్న కళాత్మకతను నేను పూర్తిగా



అర్థం చేసుకోకముందే, వాటిని ఎంతో ఆశ్చర్యంతో చూసేవాడిని. నేను పెద్దయ్యాక, సినిమా రంగంలో భాగమైన కొద్దీ, ఆయనపై నా అభిమానం మరింత బలపడింది.ఆయన సినిమాను నిజంగా ప్రేమించిన వ్యక్తి. తన ఊహలలో నిర్భయంగా ఉంటూ, నిరంతరం ప్రయోగాలు చేస్తూ, ఏ ఒక్క జానర్‌కు గానీ, ఫార్ములాకు గానీ తనను తాను పరిమితం చేసుకోలేదు. ఆయన తీసిన ప్రతి సినిమా మనకు ఏదో ఒకటి నేర్పుతుంది. ప్రతి సినిమా ఒక పాఠ్యపుస్తకం లాంటిది.నాకు, సినిమాల మాయాజాలంతో నన్ను ప్రేమలో పడేలా చేసిన దర్శకులలో ఆయన ఎప్పటికీ ఒకరిగా నిలిచిపోతారు.మనం ఒక నిజమైన దిగ్గజాన్ని కోల్పోయాము, కానీ ఆయన సినిమా చిరకాలం నిలిచి, తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. **— మంచు విష్ణు**

ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు గారి మరణ వార్త నన్ను తీవ్రంగా కలచివేసింది. ఆయన మా కుటుంబానికి చాలా సన్నిహితులు.మేమిద్దరం కలిసి మూడు విభిన్నమైన క్లాసిక్ చిత్రాలను అందించాము: తెలుగు సినిమాకే కాకుండా భారతీయ సినిమాకే



ఒక కొత్త ముద్ర వేసిన 'ఆదిత్య 369'; తెలుగులో మొట్టమొదటి కంప్యూటర్ గ్రాఫిక్స్ ఆధారిత చిత్రమై, బాక్సాఫీస్ వద్ద చరిత్ర సృష్టించి, జానపద చిత్రాలలో ఇప్పటికీ తిరుగులేనిదిగా నిలిచిన 'భైరవ ద్వీపం'; పౌరాణిక చిత్రం 'శ్రీ కృష్ణార్జున విజయం'. ఈ మూడు చిత్రాల ద్వారా, ఒకే దర్శకుడి సారథ్యంలో నేను సాంఘిక, చారిత్రక, జానపద, పౌరాణిక అనే నాలుగు ప్రధాన జానర్‌లలోని పాత్రలను పోషించాను. ఆ జ్ఞాపకాలను నేను ఎప్పటికీ మరచిపోలేను.మా నాన్నగారు తొలిసారిగా శ్రీకృష్ణుడి పాత్ర పోషించిన చిరస్మరణీయ చిత్రం 'మాయాబజార్' కోసం గొప్ప దర్శకుడు కె.వి. రెడ్డి గారి వద్ద సింగీతం గారు సహాయకుడిగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత, ఆయన మా నాన్నగారి అనేక చిత్రాలకు అసోసియేట్‌గా పనిచేశారు. అందువల్ల, మా కుటుంబానికి ఆయనతో సినిమా రంగానికి అతీతమైన ఒక ప్రత్యేకమైన బంధం ఏర్పడింది.

**— నందమూరి బాలకృష్ణ**

# "ఏకం కాన్ క్లేవ్" లో ప్రొడ్యూసర్ బన్నీ వాస్



**వుదయం సినిమా:** తెలుగు సినిమా పాన్ ఇండియా కాదు పాన్ వరల్డ్ కు రీచ్ కావాలని, నిర్మాతగా తాను అదే కోరుకుంటానని అన్నారు ప్రొడ్యూసర్ బన్నీ వాస్. ఆయన హైదరాబాద్ లో జరిగిన ఏకం బిజినెస్ కాన్ క్లేవ్ లో అతిథిగా పాల్గొన్నారు. వివిధ రంగాలకు చెందిన దాదాపు 300 మంది వ్యాపారవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగాప్రొడ్యూసర్ బన్నీవాస్ మాట్లాడుతూ – మన జీవితంలో కష్టం సుఖం ఎలా ఉంటాయో సినిమా బిజినెస్ లోనూ లాభాలు, నష్టాలు సహజం. ఈ రోజు నేను పోగొట్టుకుంటే రేపు సంపాదిస్తాననే నమ్మకంతో ముందుకు వెళ్తుంటాం. మిగతా వ్యాపారాలు కొన్నేళ్లకు బోర్ కొడుతుంటాయి. కానీ సినిమాకు వర్క్ చేస్తున్నప్పుడు ఏ రోజూ విసుగురాదు. ప్రతి రోజూ ఒక కొత్త ఛాలెంజ్ గా తీసుకుని పనిచేస్తాం. నేను ఆర్య సినిమా డిస్ట్రిబ్యూషన్ లో సక్సెస్ అయ్యాక ఇక మనం ఇక్కడ రాణించగలం అనే ఆత్మవిశ్వాసం కలిగింది. సినిమా వ్యాపారం ఎలా చేస్తే రీజనబుల్ అనేది నాకు తెలుసు. అందుకే ఇన్నేళ్లు పరిశ్రమలో కొనసాగుతున్నాను. ప్రతి ఫ్రైడే ఇక్కడ తలరాతలు మారిపోతుంటాయి. డబ్బుతో పాటు పేరు కూడా పోతుంది. ఎందుకంటే సినిమా అనేది పబ్లిక్ ప్లాట్ ఫామ్. సినిమా బాగుంటే ప్రశంసించే వాళ్లే. బాగా లేకుంటే విమర్శిస్తారు. దర్శకుడు స్క్రీన్ నుంచి ఆడియెన్స్ కు సినిమాను ఊహిస్తాడు. కానీ ప్రొడ్యూసర్ ఆడియెన్స్ నుంచి స్క్రీన్ కు సినిమాను ఊహించుకోవాలి. ప్రొడ్యూసర్ కావాలంటే ఈ క్వాలిటీ తప్పకుండా ఉండాలి. సినిమా క్రియేటివ్ గా ఉంటూనే కమర్షియల్ ఎలిమెంట్స్ తో ఉండాలి. అప్పుడే ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది. తెలుగు సినిమా పాన్ ఇండియా కాదు పాన్ వరల్డ్ వెళ్లాలి. అదే ప్రొడ్యూసర్స్ గా మేము కోరుకునేది. అన్నారు.

# "చకోర – Lunar Love Bird"
# ప్రీ రిలీజ్ ఈవెంట్




**వుదయం సినిమా:** High Joy Commercials బ్యానర్ పై డా. చింతాడ హేమారావు నిర్మాతగా, VIP – Vintage Iconic Pictures నిర్మాణ సారథ్యంలో మంగా శ్రీనివాస్ రచన – దర్శకత్వంలో రూపొందిన మాస్ పోయెట్రీ మ్యూజికల్ లవ్ స్టోరీ "చకోర – Lunar Love Bird". శ్రవణ్, మలైకా టి. వాసుపల్ ను సరికొత్త ప్రేమ జంటగా పరిచయం చేస్తూ తెరకెక్కిన ఈ ప్రేమ కథ చిత్రం శ్రీ లక్ష్మి పిక్చర్స్ ద్వారా ఈ నెల 9న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. తాజాగా ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ను స్టార్ డైరెక్టర్ శివ నిర్వాణ అతిథిగా విశాఖలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోడీవోపీ రుప్ప గోపీకృష్ణ మాట్లాడుతూ – ఈ సినిమాను ఒక ఛాలెంజ్ గా తీసుకుని చేశాం. జస్ట్ 45 డేస్ లో మొత్తం షూటింగ్ కంప్లీట్ చేశాం. సినిమా ఔట్ పుట్ చాలా బాగా వచ్చింది. మీ అందరినీ మూవీ ఆకట్టుకుంటుందని నమ్ముతున్నాను. అన్నారు. హీరోయిన్ అనుష్క లూహార్ మాట్లాడుతూ నేను హిందీలో సినిమాలు, వెబ్ సిరీస్ లు చేశాను. టాలీవుడ్ లో నటించాలనేది నా డ్రీమ్. ఈ చిత్రంతో ఆ కల నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉంది. నటిగా నాకు ఈ మూవీ ఒక మంచి అవకాశంగా భావిస్తున్నా. మేమంతా చాలా ఎఫర్ట్స్ పెట్టి చేసిన ఈ సినిమాను మీ అందరూ ఇష్టపడతారు.

# భార్య మౌనిక భూమా మంచుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన మంచు మనోజ్



**వుదయం సినిమా:** తన భార్య మౌనిక భూమా మంచు పుట్టినరోజు సందర్భంగా నటుడు మంచు మనోజ్ సోషల్ మీడియా వేదికగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. తన జీవితంలో అత్యంత కష్టమైన సమయాల్లోనూ, తిరిగి నిలబడే ప్రయాణంలోనూ మౌనిక అందించిన అండ, నమ్మకం తనకు ఎంతో బలాన్ని ఇచ్చాయని భావోద్వేగంగా పేర్కొన్నారు.
నమస్తే వరల్డ్, AIKYA ధైర్య సేన సమితి ద్వారా సమాజ సేవలో మౌనిక చేస్తున్న కృషిని అభినందిస్తూ, ఆమె కలలు సాకారం కావాలని ఆకాంక్షించారు. తన పుట్టినరోజు వేడుకల్లో భాగంగా AIKYAను ప్రారంభించామని, ఈ ఆలోచన వెనుక ఉన్న అసలైన హృదయం మౌనికేనని తెలిపారు.తమ కుటుంబం, కలిసి నిర్మించుకున్న అందమైన జీవితానికి కృతజ్ఞతలు తెలుపుతూ.. ఆమె ఎప్పటికీ తనకు ఎంతో ప్రత్యేకమని, ఆమె కలలకు కుటుంబమంతా

# 'కామ్రేడ్ కళ్యాణ్' టైటిల్ సాంగ్

**వుదయం సినిమా:** 'కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్' శ్రీ విష్ణు పీరియడ్ ఎలిమెంట్స్, హ్యూమర్, రొమాన్స్, ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా 'కామ్రేడ్ కళ్యాణ్' తో అలరించబోతున్నారు. జనకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కోన వెంకట్ సమర్పిస్తున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్ పాటలతో సినిమాపై అంచనాలు పెరిగాయి. తాజాగా మాస్ మహారాజా రవితేజ 'కామ్రేడ్ కళ్యాణ్' టైటిల్ సాంగ్ లాంచ్ చేశారు.



విజయ్ బుల్గానిన్ ఫన్ ఫుల్ గా ఈ పాటను కంపోజ్ చేశారు. రాహుల్ సిప్లిగంజ్ వాయిస్‌తో పవర్‌ఫుల్ ఎనర్జీని అందించగా, భాస్కరభట్ల రాసిన లిరిక్స్ కామ్రేడ్ గా హీరో క్యారెక్టర్ ను ఎంటర్టైనింగ్ గా ప్రజెంట్ చేశాయి. విడుదలైన వెంటనే ఈ సాంగ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో రాధికా శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే కీలక

# 'భోగి' హై ఇంటెన్స్ టీజర్ రిలీజ్

**వుదయం సినిమా:** చార్మింగ్ స్టార్ శర్వా డిఫరెంట్ ఇంటెన్స్ పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి' తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. లక్ష్మీ రాధామోహన్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. మిగిలిన షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏకకాలంలో జరుగుతున్నాయి. ఈ క్రమంలో మేకర్స్ ప్రమోషనల్ కార్యక్రమాలను ప్రారంభిస్తూ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. గ్రామీణ జానపద శైలిలో సాగే వాయిస్ ఓవర్‌తో టీజర్ ప్రారంభమవుతుంది. బొగ్గుల గుట్ట అనే గ్రామాన్ని పరిచయం చేస్తూ.. పాలేగాళ్ళు కమ్మరి గంగను తీసుకెళ్లారని అనుపమ పరమేశ్వరన్ పాత్ర చెబుతుంది. అతనికి ఏమైనా జరిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరిస్తుం

మైన భక్తి కార్యక్రమం నిర్వహించాల్సి ఉంటుందని టీజర్ ద్వారా ప్రజెంట్ చేశారు. ఆ తర్వాత గంగగా శర్వా రఫ్ అండ్ రగ్డ్ లుక్‌లో పవర్‌ఫుల్‌గా ఎంట్రీ ఇవ్వడం ఆకట్టుకుంది. మట్టితో మమేకమైన ఓ సాధారణ కూలీగా కనిపించే ఆయన.. ఇక తాను మౌనంగా ఉండబోనని హెచ్చరిస్తారు. తన కత్తితో తొమ్మిది మెట్లను కడిగి, శత్రువుల రక్తంతో వాటిని అలంకరిస్తానని గంగ చెప్పే మాటలు పాత్రలోని ఇంటెన్సిటీని చూపిస్తాయి.హీరో, అతని ప్రేమకథకు సంబంధించిన పాత్రలను పరిచయం చేయడమే కాకుండా.. ఒక రా, ఇంటెన్స్, రూటెడ్, ర్యాజింగ్ ప్రపంచానికి టీజర్ ప్రజెంట్ చేసింది. 1960ల ప్రారంభంలో తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోని ఓ కల్పిత గ్రామం నేపథ్యంలో ఈ కథ సాగుతుంది.



Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : Sirikonda AUGUSTIN . RNI No.: APTEL/2013/52694. E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.